ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 08.06.2026 | సంపుటి : 12 సంచిక : 319 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## చురుగ్గా నైరుతి

- నేడో రేపో తెలంగాణను తాకనున్న రుతుపవనాలు
- తేలికపాటి వర్షాలతో చల్లబడిన వాతావరణం
- గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- 3 నుంచి 4 డిగ్రీలు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం

**హైదరాబాద్(జనంసాక్షి):** భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలంగాణను వరుణుడు కరుణించాడు. నైరుతి రుతుపవనాల రాకతో తెలంగాణ వ్యాప్తంగా పలుచోట్ల శనివారం వర్షం కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఎండలతో హడలెత్తిన జనం ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.నైరుతి రుతుపవనాలు శనివారం ఏపీని తాకాయి. అవి చురుకుగా కదులుతుండటంతో రుతుపవనాల ఆగమనానికి సూచనగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడుతున్నాయి. ఆదివారం లేదా సోమవారం నాటికి తెలంగాణ రాష్ట్రానికి రుతు పవనాలు తాకే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా జూన్ ఒకటి లేదా మొదటి వారంలో రుతు పవనాలు వస్తాయి. ఈ దఫా ఎల్‌నినోతో ఆలస్యం అవుతాయని, పదో తేదీ నాటికి గానీ వచ్చే అవకాశం లేదని తొలుత అంచనా వేశారు.తాజాగా వాటి గమనంలో వేగం పెరిగింది. శనివారం అత్యధికంగా వికారాబాద్ జిల్లా తాండూరులో 5 సెం.మీ. వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.4 నమోదు అయింది. మేడ్చల్-మల్కాజిగిరి, నల్గొండ తదితర జిల్లాల్లోనూ వానలు పడ్డాయి. హైదరాబాద్ వ్యాప్తంగా అనేక చోట్ల వర్షాలు కురిశాయి. అత్యధికంగా మియాపూర్‌లో 4.3 సెం.మీలు మిగతా 2లో..

## అభివృద్ధిని భాజపా అడ్డుకుంటోంది



### మెట్రోకు ఎందుకు అనుమతులు రావట్లేదో కిషన్‌రెడ్డి చెప్పాలి

- ట్రిపుల్‌ఆర్‌కు నిధులు ఎందుకివ్వరో, మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం
- పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్‌ఎంసీ విభజన
- కేంద్రం అన్ని రాష్ట్రాల్లో పూర్తి ధాన్యం కొని, తెలంగాణలో మాత్రం సగం కొంటోంది
- కేటీఆర్,కిషన్ రెడ్డి వేర్వేరు పార్టీల్లో ఉన్నా పరస్పరం సహకరించుకుంటారు
- ఉప్పల్ భగాయత్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'మా మోదీ నదులను ప్రక్షాళన చేశారని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారని, మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఉప్పల్ భగాయత్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఎంఎంసీతో పాటు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై పలు విమర్శలు గుప్పించారు. మిగతా 2లో..



"గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు. యూపీలో గంగానది ప్రక్షాళన చేశామని యోగి చెప్పుకున్నారు. మా మోదీ నదులను ప్రక్షాళన చేశారని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకుంటున్నారు. మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారు. ఉప్పల్, నల్గొండ ప్రజలు మూసీ మురికితో ఇబ్బందులు పడుతున్నారు. రెండో స్థానంలోని హైదరాబాద్ మెట్రో 9వ స్థానానికి పడిపోయింది. మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదించట్లేదు. నాగోల్ నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లేలా మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపాం. కేంద్రమంత్రిగా ఉన్న నేత మెట్రో విస్తరణను ఢిల్లీలో అడ్డుకుంటున్నారు. మెట్రో విస్తరణను అడ్డుకుంటున్న నేతలను నిలదీయాలి. మెట్రోకు ఎందుకు అనుమతులు రావట్లేదో కిషన్‌రెడ్డి చెప్పాలి"

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## నదీజలాలపై కాంగ్రెస్ రాజీ

- గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి సిద్ధమవుతోంది
- ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నాం: హరీశ్

గతంలో కృష్ణా, ఇప్పుడు గోదావరి నీటిని మళ్లించేందుకు తెలంగాణను మోసం చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో ఏపీ ప్రభుత్వం నదీ జలాల తరలింపునకు మరోసారి ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మిగతా 12లో..



## అందుబాటులోకి నీట్ రీ ఎగ్జామ్ సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రం ఏ నగరంలో ఉందనే సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు మిగతా 2లో..



## అంశం ఏదైనా చర్చకు సిద్ధమే

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్

హైదరాబాద్(జనంసాక్షి): ఏ అంశం మీద ఎక్కడ చర్చ పెట్టినా తాను సిద్ధమేనని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. పొలిమేరకు రాకుండా తనను ఆపేవారు తెలంగాణలో ఇంకా పుట్టలేదని వ్యాఖ్యానించారు. "రేవంత్‌రెడ్డిలా నేను పది పార్టీలు మారలేదు. నా పుట్టుక.. చావు.. రెండూ భాజపాలోనే. నేనేంటో తెలంగాణ ప్రజలకు తెలుసు. ఎంత మిగతా 2లో..



రైతులు వ్యతిరేకిస్తున్నా.. కోహెడ పండ్ల మార్కెట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు :రామచందర్‌రావు

## భూములు తీసుకునే రైతులకు పరిహారం ఇవ్వాల్సిందే

**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పొలిమేర దాటనీయమని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు.. భాజపా కార్యకర్తలు తలచుకుంటే మీ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు గ్రామాల్లో తిరగలేరని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో మిగతా 2లో..

## టీవీకే మూడు నెలలుకూడా కొనసాగడం కష్టమే

### ఇదే విషయాన్ని తమిళనాడు ప్రజలు చర్చించుకుంటున్నారు • డీఎంకే అధినేత స్టాలిన్ ఎద్దేవా



**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడులో టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా కొనసాగుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారని డీఎంకే అధినేత స్టాలిన్ అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన కారణంగా 6నెలల వరకు విమర్శలకు దూరంగా ఉందామని అనుకున్నామని.. కానీ రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. ఆ గడువు రాకముందే పరిణామాలు మారే విధంగా ఉన్నాయన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే డీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం క్షేత్ర స్థాయిలో చర్యలు మొదలు పెట్టిందని వెల్లడించారు.బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం, ప్రాంతీయ సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా అధికారంలోకి రాలేకపోయామని అన్నారు.కానీ కొందరు మాత్రం ఓటర్లను కలవకపోయినా, బూత్ ఏజెంట్లను నియమించకపోయినా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని స్టాలిన్ అన్నారు. అటువంటి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉంటుందని తాను అనుకోవట్లేదన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన మిగతా 2లో..

## ఇండియా కూటమి కీలక సమావేశానికి టీవీకే?

2లో..

## జూన్ 15న పాఠశాలలు పునఃప్రారంభం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణ విద్యార్థులకు విద్యాశాఖ వేసవి సెలవులను పొడిగించింది. జూన్ 15న పాఠశాలలు పునః ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జూన్ 13 రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో షెడ్యూల్ మార్పు చేశారు. జూన్ 13 రెండో శనివారం సెలవుకు బదులు జులై 11న తరగతులు నిర్వహించనున్నారు. విద్యా సంవత్సరం నష్టపోకుండా జులై 11న రెండో శనివారం తరగతులు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ వెల్లడించారు. పాఠశాలల పున:ప్రారంభ తేదీలకు సంబంధించి పలు వర్గాల నుంచి ప్రభుత్వానికి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్కూల్ రీఓపెనింగ్ తేదీల్లో మార్పు విషయాన్ని అన్ని జిల్లాల డీఈవోలు, ప్రధానోపాధ్యాయులు గమనించాలని సూచించారు.సర్కారు బదులు, మిగతా 2లో..



## కనురెప్ప కాలం కరెంట్ పోని రాష్ట్రం తెలంగాణ

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- భవిష్యత్తు డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు
- ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ హక్కు
- 2030 నాటికి 20వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తియే లక్ష్యం
- వ్యవసాయ పంప్‌సెట్లకు 100% సోలరైజేషన్.. రెండు మండలాల్లో శ్రీకారం : ఉప ముఖ్యమంత్రి భట్టి





**ఖమ్మం (జనంసాక్షి):** ఖమ్మం జిల్లా కేంద్రంలో పాకబండలో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రసంగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ, వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి డిపార్ట్‌మెంట్ అప్‌డేట్ అవుతోందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఖమ్మం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందన్నారు. విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగినప్పటికీ, ఎక్కడా ఎలాంటి కోతలు, అంతరయాలు లేకుండా.. విద్యుత్‌ను సరఫరా చేశామని చెప్పారు. విద్యుత్ డిమాండ్ పెరగడాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఒక సూచికగా భావించవచ్చని చెప్పారు. ఉత్పాదక రంగాలన్ని విద్యుత్‌తోనే ముడిపడి ఉంటాయని చెప్పారు. డిమాండ్ పెరుగుతోందంటే ప్రజల కొనుగోలు శక్తి, ఉత్పత్తి పెరుగుతున్నట్లని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. 2023లో రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ విద్యుత్ డిమాండ్ కేవలం 15,000 మెగావాట్లు మాత్రమే ఉండేదన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్లకే పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు చేరుకుందని తెలిపారు. కేవలం రెండున్నర సంవత్సరాలలోనే 3,500 మెగావాట్లకు పైగా గరిష్ఠ విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. మిగతా 2లో..



## నీట్ సంక్షోభానికి కేంద్రానిదే బాధ్యత

### తప్పు బోర్డుది.. శిక్ష విద్యార్థులకా?

- ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగిస్తేనే వ్యవస్థకు బలమైన సందేశం
- పేపర్ లీక్‌ల వల్ల ప్రతిభావంతులకు ఘోర అన్యాయం
- నీట్ అంశాన్ని రాజ్యసభ వేదికగా కేంద్రాన్ని నిలదీస్తాం : కేటీఆర్




**హైదరాబాద్(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'నీట్' పరీక్షల కుంభకోణం మరియు పేపర్ లీకేజీ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లోపభూయిష్టమైన వ్యవస్థ వల్ల నష్టపోయిన విద్యార్థులకు భరోసా కల్పించేందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని ఆయన ప్రధానిని కోరారు. తప్పు చేసిన పెద్దలపై చర్యలు తీసుకుంటేనే, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ఉంటాయనే బలమైన సందేహం బ్యూరోక్రాట్లలో వెళ్తుందని స్పష్టం చేశారు. మలేషియా అధికారిక పర్యటనకు వెళ్లే ముందు, జూన్ 4వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌లో నీట్ బాధితులు, లాంగ్ టర్మ్ విద్యార్థులతో కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి నిర్వహించారు.ఇది ప్రభుత్వ 'అట్టర్ ఫ్లాప్'.. విద్యార్థుల ఆవేదనఈ ముఖాముఖిలో విద్యార్థులు పాల్గొని తాము ఎదుర్కొంటున్న మానసిక క్షోభను కేటీఆర్ ముందు ఏకరవు పెట్టారు. రాత్రింబవళ్లు కష్టపడి మిగతా 2లో..

## భారత్‌తో సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటాం

- కూర్చొని మాట్లాడుకుంటే ఏ సమస్యా పెద్దది కాదు
- నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌తో సరిహద్దు సమస్యలను దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. పరస్పర గౌరవంతో కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కరించుకోలేని సమస్య అంటూ ఏదీ ఉండబోదన్నారు. ఇరుదేశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కైలాస - మానస సరోవర్ యాత్ర చాలా విభిన్నమైన సరిహద్దు పాయింట్ల ద్వారా జరుగుతోందని పేర్కొన్నారు. పర్యాటకుల్లో చాలా మిగతా 2లో..



## ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌ను నాశనం చేస్తాం

### సాధ్యమైనంతవరకు చర్చలతోనే సమస్యను పరిష్కరించాలనుకుంటున్నాం

### అణ్వాయుధం తయారు చేయకుండా అడ్డుకుంటున్నాం : ట్రంప్



**వాషింగ్టన్(జనంసాక్షి):** అణ్వాయుధం తయారు చేయకుండా ఇరాన్‌ను అడ్డుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. అది ప్రమాదకరమైన దేశమని.. ఒకవేళ అణ్వాయుధం ఉంటే వాళ్లు ప్రపంచాన్ని నాశనం చేస్తారన్నారు. వాళ్లు వెర్రివాళ్లని వ్యాఖ్యానించారు. చర్చలతో ఈ సమస్యను పరిష్కరించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఓ అంతర్జాతీయ వార్తా ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ట్రంప్.. ఒకవేళ చర్చలు కొలిక్కి రాకపోతే ఆ దేశాన్ని నాశనం చేస్తానని హెచ్చరించారు.ఇరాన్ వద్ద అణ్వాయుధం లేకుండా చేయడం ద్వారా ప్రపంచానికి, అమెరికాకు సేవ చేస్తున్నానని ట్రంప్ పేర్కొన్నారు. తనకు సుదీర్ఘ యుద్ధాలు ఇష్టముండవని.. ఇది కూడా అంతులేని యుద్ధం కాదన్నారు. మూడు నెలలుగా యుద్ధం చేస్తున్నామని, ఇందులో ఎక్కువ భాగం కాల్పుల మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం 08.06.2026

## చురుకుగా కదులుతున్న నైరుతి

కురిసింది. తెలంగాణలో జూన్ పదో తేదీ వరకు అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని పేర్కొంది. ఈ మేరకు 'పసుపు' రంగు (5 సెం.మీలోపు) హెచ్చరికలు జారీ చేసింది.తెలంగాణలో శనివారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఖమ్మంలో సాధారణం కన్నా 3.9 డిగ్రీల సెల్సియస్ పెరిగి 42.4 డిగ్రీలు నమోదు అయింది. హైదరాబాద్ నగరంలో 1.7 డిగ్రీలు అధికంగా 38.8 డిగ్రీలు ఉంది. వచ్చే 3 రోజుల్లో క్రమంగా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీలు తగ్గే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన పడింది. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సుమారు 2 గంటల పాటూ వర్షం పడింది. అత్యధికంగా మియాపూర్‌లో 4.3 సెం.మీ. వర్షపాతం నమోదు అయింది. ఉప్పరపల్లి 190 పిల్లర్ దగ్గర, మాసాబ్‌ట్యాంక్ తదితర లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. దీంతో రాకపోకలు నెమ్మదిగా సాగాయి.ఈదురుగాలులు, వర్షానికి చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆసిఫ్‌నగర్, ఉప్పరపల్లిలో చెట్లు విరిగిపడటంతో విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్ జనచైతన్య కాలనీ, నార్సింగి, కొండాపూర్, మూసాపేట, కేపీహెచ్‌బీ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్తు తీగలపై చెట్ల కొమ్మలు పడటంతో సరఫరాలో సమస్యలు తలెత్తాయి. గాలులకు ఫ్లెక్సీలు విద్యుత్తు తీగలపై పడ్డాయి.

## జహీరాబాద్‌కు ఇస్తామన్న బుల్లెట్‌ట్రైన్ ఏమైంది?

- ఆ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలు ప్రాజెక్టు నివేదికల్లో కనిపించడం లేదు
- ఈ అంశంపై బీజేపీ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారు?
- టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్(జనంసాక్షి):**సంగారెడ్డి ఉద్యమాల గడ్డ అని, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో కూడా ఈ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉందని టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన పార్టీ జెండా పండుగ కార్యక్రమంలో కవిత పాల్గొని, మాట్లాడారు.1930లో జోగిపేటలో జరిగిన చారిత్రక ఉద్యమాలను గుర్తు చేశారు.ఈ సందర్భంగా సంగారెడ్డి గడ్డపై పుట్టడం తన అదృష్టమని చెప్పారు. ఈ ప్రాంత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణకు చరిత్ర లేదని విమర్శలు వచ్చినప్పుడు, శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలను చూపిస్తూ "ఇదిరా మా చరిత్ర" అని నిరూపించామని గుర్తుచేశారు. అలాగే, 1969 తెలంగాణ ఉద్యమంలో సదాశివపేటలో జరిగిన కాల్పులను ప్రస్తావిస్తూ, సంగారెడ్డి జిల్లా ఉద్యమాలకు తొలి అడుగులు వేసిన ప్రాంతమని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, చారిత్రక వారసత్వం, ఉద్యమ స్ఫూర్తికి సంగారెడ్డి ప్రతీకగా నిలిచిందని ఆమె వ్యాఖ్యానించారు.సంగారెడ్డి రాజకీయాల్లో "ఫిక్సింగ్ రాజకీయాలు" నడుస్తున్నాయని కవిత తీవ్ర విమర్శలు చేశారు. జగ్గారెడ్డి, హరీష్ రావు, దామోదర రాజనర్సింహ, చింతా ప్రభాకర్, రఘునందన్ రావు వేర్వేరు పార్టీల్లో ఉన్నట్లు కనిపించినా, స్థానిక రాజకీయాల్లో మాత్రం ఒకే విధంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు.



## అభివృద్ధిని భాజపా అడ్డుకుంటోంది

కేంద్ర మంత్రిగా ఉన్న నేత మెట్రో విస్తరణను దిల్లీలో అడ్డుకుంటున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో సగం వడ్లు మాత్రమే కొంటామని కేంద్రం చెబుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో మొత్తం ధాన్యం కొని, తెలంగాణలో మాత్రం సగం కొంటున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో మొత్తం ధాన్యం ఎందుకు కొనరో చూస్తామన్నారు. కిషన్‌రెడ్డి బీజేపీలో ఉంటారని, ఇతర పార్టీకి సహకరిస్తారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీలో ఉండి కేటీఆర్‌కు సహకరిస్తారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. ఏ పార్టీలో ఉన్నా ప్రజలు కోసం పనిచేస్తానని, ఇతర పార్టీలకు పనిచేయనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 15 తర్వాత తమ కార్యచరణ మారుతుందని తెలిపారు. మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఎందుకు ఇవ్వరో, ట్రిపుల్‌ఆర్‌కు నిధులు ఎందుకివ్వరో, మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తామన్నారు.మంచి పనుల విషయంలో రాజకీయాలు చేయొద్దని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో పనులన్నింటినీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. రెండో విడతలో నాగోల్ నుంచి గౌరెల్లి వరకు మూసీ ప్రక్షాళన చేస్తామని వెల్లడించారు. మూసీ ప్రక్షాళన రెండో విడత కార్యాచరణ వెంటనే చేపట్టాలని ఆయన



అధికారులను ఆదేశించారు. పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం విభజించామని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఓఆర్ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ఉన్నారన్న సీఎం, అంతమంది జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే ఆషామాషీ కాదన్నారు. ప్రజల సౌలభ్యం కోసమే ఉప్పల్‌లో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంపీగా చేయలేని పనులన్నీ ఇప్పుడు సీఎంగా ఉండి చేసేందుకు సిద్ధమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారు రాజిరెడ్డి పేరు పెట్టామని వివరించారు. బండారు రాజిరెడ్డి విగ్రహం కూడా ఏర్పాటు చేద్దామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం, ఉప్పల్‌లో 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణం, ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన సీఎం, క్యూర్-1 మొబైల్ యాప్ ను ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులను చెల్లించే అవకాశం కల్పించారు.

**క్యూర్ యాప్ ఆవిష్కరణ**

ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన వాటిలో.. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం, ఉప్పల్‌లో వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణాలు వంటివి ఉన్నాయి. అదేవిధంగా క్యూర్-1 మొబైల్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారు.

## అందుబాటులోకి నీట్ రీ ఎగ్జామ్ సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు

ప్రకటించింది. అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావడం ద్వారా ఈ వివరాలు పొందవచ్చని తెలిపింది.పేపర్ లీక్ ఆరోపణలతో మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే. జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి కూడా పెన్-పేపర్ విధానంలోనే పరీక్ష ఉంటుందని ఇప్పటికే స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లో 14 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది.

## అంశం ఏదైనా చర్చకు సిద్ధమే

రెచ్చగొట్టినా తొందరపడను. అన్నింటికీ సమయమే సమాధానం చెబుతుంది. ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి. దళితులు, బీసీలు మీ ఇంటికి వచ్చి ధర్నాలు చేస్తారు" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## భూములు తీసుకునే రైతులకు పరిహారం ఇవ్వాల్సిందే

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."భూములు తీసుకునే రైతులకు పరిహారం ఇవ్వాల్సిందే. రైతులు వ్యతిరేకిస్తున్నా.. కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు. రైతులకు పరిహారం ఇచ్చాకే పండ్ల మార్కెట్ పెట్టాలి. కాంగ్రెస్ నేతలు రైతుల భూములు కాజేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయకుండా వారిని ఇబ్బందులు పెడుతున్నారు. కేంద్రం నుంచి రూ.13లక్షల కోట్లు తెలంగాణకు ఇచ్చాం. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై సచివాలయం వద్ద చర్చకు సిద్ధంగా ఉన్నాం" అని రామచందర్‌రావు అన్నారు.

## జూన్ 15న పాఠశాలలు పునః ప్రారంభం

జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు చాలా మంది ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తినకుండానే చదువులకు వస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండేలా అల్పాహారాన్ని అందించాలని నిర్ణయించింది. కొద్దిరోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు జిల్లాల వారీగా ప్రభుత్వ పాఠశాలల సమాచారం, విద్యార్థుల, కళాశాలలు విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలను చూసి గ్రామ, పట్టణ సర్కారీ బడుల్లో ఈ ఏడాది తమ పిల్లల్ని చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండగా ఈ మేరకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.ప్రీ ప్రైమరీ విద్యలో చేరిన వారి నుంచి



జూనియర్ కళాశాలల విద్యార్థుల వరకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఒకేచోట అల్పాహారం తయారు చేయించి అన్ని పాఠశాలలకు పంపేందుకు వీలుగా సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఏపీలో హరే రామ సంస్థ పలు పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండి పంపుతున్నారు. ఈ విధానాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అధికారులు యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఇంటర్ మీడియట్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేలా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి (2026-27) 2,769 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. క్యూర్ (క్యూర్-కోర్ అర్బన్ ఎకానమీ) పరిధిలో 529 చోట్ల యూకేజీ విద్యను అమలు చేయనున్నారు. అత్యధికంగా హైదరాబాద్ నగరంలో 275, మేడ్చల్-మల్కాజిగిరిలో 145 చోట్ల కొత్తగా ప్రవేశపెట్టనున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో శిశు విద్య పాఠశాలల సంఖ్య 4,131కు చేరుకోనుంది. గత విద్యా సంవత్సరంలో 1000 బడుల్లో యూకేజీ తరగతులను ప్రారంభించారు. రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం 2 వేల నుంచి 2,500 పాఠశాలల్లో కొత్తగా పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెడతామని ప్రకటించిన విషయం విదితమే.

## ఇండియా కూటమి కీలక సమావేశానికి టీవీకే?

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయేను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఏర్పాటైన ఇండియా కూటమి సోమవారం కీలక సమావేశం కానుంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిలోని డీఎంకే ఫ్రంట్ చవిచూసిన వేళ ఈ భేటీ జరుగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్ వ్యూహాలు, పార్టీల మధ్య సమన్వయం సాధించడమే ఎజెండాగా ఈ సమావేశం జరగనుంది.దేశ రాజధాని దిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్ వేదికగా సోమవారం జరిగే ఈ సమావేశానికి ఇండియా కూటమి నేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నుంచి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ నుంచి అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నుంచి తేజస్వి యాదవ్, శివసేన (యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే, వామపక్ష పార్టీ నేతలు పాల్గొననున్నారు.23 పార్టీలు 'ఇండియా జన్‌బంధన్' సమావేశానికి హాజరుకానున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ వెల్లడించారు. విపక్ష పార్టీలన్నీ ఐక్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొన్ని పార్టీలు అనివార్య కారణాలతో భేటీకి గైర్హాజరవుతున్నప్పటికీ.. మోదీ ప్రభుత్వ విధానాలు, చర్యలను వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, ఈ భేటీకి డీఎంకే, ఆమ్‌ఆద్మీ పార్టీ దూరంగా ఉండే అవకాశం ఉందని తెలిస్తోంది. ఆప్ గత కొన్నాళ్లుగా ఇండియా కూటమి కార్యక్రమాలకు దూరంగా ఉంటుండగా.. తమిళనాడులో టీవీకే కూటమిలో కాంగ్రెస్ చేరడంపై డీఎంకే గుర్రుగా ఉంది. అదే సమయంలో విజయ్ పార్టీ తమిళ వెట్రిగ కళగం ఈ భేటీకి హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. 2024 ఎన్నికలకు ముందు ఇండియా కూటమి ఏర్పాటు కాగా.. అదే ఏడాది జూన్ 1న కీలక సమావేశం జరిగింది. 2025 ఆగస్టు 7న రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలకు తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఎలాంటి సమావేశాలూ జరగలేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం ఇప్పుడు కూటమి భేటీ అవుతోంది.

## ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌ను నాశనం చేస్తాం

విరమణ కిందే ఉందన్నారు. చాలా విషయాల్లో ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. ఇక ఇరాన్ సుప్రీం నేత గురించి మాట్లాడుతూ.. దాడుల్లో ఆయన తీవ్రంగా గాయపడినట్లు తెలిసిందన్నారు.

## కనురెప్ప కాలం కరెంట్ పోని రాష్ట్రం తెలంగాణ



ఏసీల వాడకం, గృహ అవసరాల కోసం విద్యుత్ వినియోగం పెరగడం దీనికి నిదర్శనమని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ, ఇండస్ట్రియలైజేషన్, ఫార్మా సిటీ, డేటా సెంటర్స్, ఐటీ సెక్టార్ వంటి ప్రాజెక్టుల వల్ల భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కావలసిన విద్యుత్ మౌలిక సదుపాయాలను ఇప్పుటి నుంచే ప్లాన్ చేసుకోవడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సాంప్రదాయేతర ఇంధన వనరుల వైపు ప్రభుత్వం బలమైన అడుగులు వేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగుతోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్ కింద దాదాపు 85 గ్రామాలను సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రెండు మండలాల్లో ఇంటి పైకప్పుల పైన వ్యవసాయ పంపుసెట్లకు 100% సోలరైజేషన్ చేసే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆర్.ఓ.ఎఫ్.ఆర్ యాక్ట్ ద్వారా గిరిజనులకు ఇచ్చిన భూములకు విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల రైతులు పంటలు పండించుకోలేకపోయారని తెలిపారు. వారి కోసం ప్రత్యేకంగా 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా దాదాపు 6 లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ వ్యవస్థను కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని చెప్పారు. అందుకు సంబంధించి హైదరాబాదులో గ్లోబల్ సమిట్‌ను ఏర్పాటు చేసుకుని సమగ్ర ప్రణాళికను కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతి సంవత్సరం మన ఆర్థిక వ్యవస్థ, ఉత్పాదక రంగం దాదాపు 13.5% వృద్ధి రేటును సాధించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వృద్ధికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని కూడా పెంచాలని చెప్పారు.రెండున్నర సంవత్సరాల కాలంలో పీక్ డిమాండ్ 3,500 మెగావాట్లు పెరిగినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా పవర్ కట్ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. ఈ వేసవిలో దేశవ్యాప్తంగా తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడి అన్ని రాష్ట్రాల్లో పవర్ కటింగ్స్ వచ్చినప్పటికీ, తెలంగాణలో మాత్రం ఒక్క నిమిషం కూడా కరెంట్ పోలేదని చెప్పారు. అందుకే ఒక మిత్రుడు తెలంగాణ రాష్ట్రాన్ని (కనురెప్ప కాలం కూడా విద్యుత్ అంతరాయం లేని రాష్ట్రంగా అభివర్ణించారని చెప్పారు. ప్రభుత్వ ముందస్తు ప్రణాళికల వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఖమ్మం నగరం చాలా వేగంగా విస్తరిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక్కడ విద్యుత్ డిమాండ్‌పై పూర్తి స్థాయిలో స్టడీ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇక్కడ 33/11 ఐఎ, లేదా అంతకంటే పెద్ద సబ్‌స్టేషన్లు ఎక్కడ అవసరమున్నా వెంటనే ప్రపోజల్స్ పంపాలని, వాటిని తక్షణమే శాంక్షన్ చేసి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తామని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వ్యవసాయ రంగాన్ని, సంక్షేమాన్ని ప్రభుత్వం వదిలిపెట్టలేదని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఉచిత విద్యుత్ అందించడం కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతి నెల రూ.1,150 కోట్లు రైతుల పక్షాన విద్యుత్ శాఖకు చెల్లిస్తోందని చెప్పారు. ప్రతి రైతు వాడుకునే ప్రతి యూనిట్ కు లెక్క గట్టి, ఆ మొత్తాన్ని ఆర్థిక శాఖ ద్వారా విద్యుత్ శాఖకు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ రంగానికే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 53 లక్షల నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రతి నెల 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఈ 53 లక్షల కుటుంబాలు వాడుకునే విద్యుత్ బిల్లు మొత్తాన్ని కూడా ప్రభుత్వమే ప్రతి నెల లెక్కగట్టి ఆయా శాఖలకు చెల్లిస్తోందన్నారు. నిరంతరాయంగా ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి వినియోగదారునికి చేరే లోపు ఎక్కడా కూడా సరఫరా నష్టాలు లేకుండా చూస్తున్నామని అన్నారు. నష్టాలు ఎక్కువైతే ఆ భారం వినియోగదారులపై పడుతుంది కాబట్టి, అలా జరగకుండా ఉండడానికే విద్యుత్ రంగంలో కొన్ని సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి, రైతాంగానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడడానికి అవసరమైతే ఒక థర్డ్ డిస్కమ్ "రైతు డిస్కమ్" ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## నీట్ సంక్షోభానికి కేంద్రానిదే బాధ్యత

చదివి 520కి పైగా మార్కులు సాధించినా, పేపర్ లీక్ కావడం వల్ల తమ శ్రమ అంతా వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగ్జామ్ హాల్‌లోకి వెళ్లే ముందు తమను అణువణువూ తనిఖీ చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు, పేపర్ లీక్‌ను ఎందుకు అడ్డుకోలేకపోయారని విద్యార్థులు నిలదీశారు. తప్పు ఎన్టీఏ బోర్డు చేసి, విద్యార్థులను మళ్లీ మళ్లీ పరీక్షలకు కూర్చోబెట్టడం ఏ రకంగా న్యాయమని వారు ప్రశ్నించారు. విద్యార్థుల ఆక్రోశంపై కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. "మీ కోపంలో 100 శాతం న్యాయం ఉంది. ఈ పరీక్ష నిర్వహణలో ఇది ప్రభుత్వ అబ్సల్యూట్ ఫెయిల్యూర్. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఎన్టీఏ ఘోరంగా విఫలమైంది. తప్పు చేసిన పెద్దలను వదిలేసి, మిమ్మల్ని మళ్లీ పరీక్షకు కూర్చోబెట్టడం ముమ్మాటికీ అన్యాయమే. కానీ, ఇదొక తాత్కాలిక స్పీడ్ బ్రేకర్ లాంటిది. మీ కసిని, ఎనర్జీని సరైన దిశలో పెట్టి మళ్లీ ఫోకస్ చేయండి" అని విద్యార్థుల్లో ధైర్యం నింపారు.గ్రేస్ మార్కుల వెనుక పెద్ద మాయాజాలం!గతంలో (2024) గ్రేస్ మార్కుల పేరిట జరిగిన అవకతవకలను, కటాఫ్‌లు అసాధారణంగా పెరిగిపోవడాన్ని ఒక విద్యార్థి ప్రస్తావించగా, కేటీఆర్ ఎన్టీఏ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. "గ్రేస్ మార్కులు ఎందుకు కలిపారో చెప్పడానికి ఎన్టీఏ వద్ద ఇప్పటికీ ఎలాంటి తార్కిక సమాధానం లేదు. చాలా ఇర్రెస్పాన్సిబుల్‌గా వ్యవహరించి లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు. కొంతమందికి అడ్డదారిలో మార్కులు కలిపి, కష్టపడ్డ విద్యార్థులకు అన్యాయం చేయడం ఘోరమైన నేరం. ఈ లూప్‌హోల్స్ అన్నింటిపై పార్లమెంట్‌లో, స్టేట్ అసెంబ్లీలో గట్టిగా చర్చిస్తాం. చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చట్టసభ సభ్యులుగా మా బాధ్యత నెరవేరుస్తాం" అని హామీ ఇచ్చారు.పాలకులకు భయం ఉండాలి: కేటీఆర్"మంత్రి రాజీనామా చేస్తే సమస్య పరిష్కారమవుతుందా?" అని ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ వ్యూహాత్మకంగా బదులిచ్చారు. "మంత్రి రాజీనామా ఒక హెచ్చరిక లాగా పనిచేస్తుంది. ప్రధాని గనుక మంత్రిని తొలగిస్తే.. తప్పు జరిగితే బాధ్యత వహించక తప్పదనే భయం అధికారుల్లో, బ్యూరోక్రాట్లలో వస్తుంది. లేకపోతే వ్యవస్థలో నిర్లక్ష్యం పెరుగుతుంది. స్కూల్లో బంక్ కొడితేనే పనిష్మెంట్ ఉన్నప్పుడు, వ్యవస్థను నాశనం చేసిన పెద్దలకు శిక్ష ఉండాలి. కొందరిని డిస్మిస్ చేసి కఠినంగా శిక్షిస్తేనే వ్యవస్థ దారిలోకి వస్తుంది" అని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా రీ-నీట్ నిర్వహించాల్సిందేనా?పేపర్ లీక్ అయిన రాష్ట్రాల్లోనే పరీక్ష పెట్టాలా? లేక దేశవ్యాప్తంగా నిర్వహించాలా? అన్న ప్రశ్నకు కేటీఆర్ బదులిస్తూ.. "ఇవాల్టి కనెక్టెడ్ ప్రపంచంలో లీకైన పేపర్ మిగతా రాష్ట్రాలకు వెళ్లలేదని చెప్పలేం. ఒక కోచింగ్ సెంటర్‌లో పలు రాష్ట్రాల విద్యార్థులు ఉంటారు. ఎక్కడో ఒకచోట 1% లీక్ అయినా అది అందరికీ పాకుతుంది. కాబట్టి లీక్ పరిధిపై 100% స్పష్టత ఉంటే ఆయా రాష్ట్రాలకే పరిమితం చేయవచ్చు, లేదంటే దురదృష్టవశాత్తూ దేశవ్యాప్తంగా మళ్లీ నిర్వహించడం మినహా ప్రత్యామ్నాయం లేదు. అయితే, అసలు లీక్ కాకుండా ఉండేందుకు నేటి ఏఐ సాంకేతికతను వాడుకుని 'ఫూల్ ప్రూఫ్' సిస్టమ్స్ తేవడంపై కేంద్రం దృష్టి పెట్టాలి" అన్నారు.మెరిట్‌ను మింగేస్తున్న మేనేజ్‌మెంట్ కోటాపైసలు ఉన్నవాళ్లు డొనేషన్లు కట్టి సీట్లు కొంటున్నారని, మెరిట్‌కు విలువ లేకుండా పోతోందని విద్యార్థి ఆవేదన వ్యక్తం చేయగా.. కేటీఆర్ స్పందిస్తూ.. "డబ్బులు ఉన్నాయని డాక్టర్లు అయిపోయే ఈ విధానం అత్యంత అన్యాయమైనది. ప్రైవేట్ కాలేజీల దోపిడీని అడ్డుకోవడానికి బలమైన రెగ్యులేటరీ సిస్టమ్ రావాలి. రేపటి రోజున మన కుటుంబ సభ్యులకు బాలేకపోతే డబ్బులు ఉన్న డాక్టరా? మెరిట్ ఉన్న డాక్టరా? ఎవరికి చూపిస్తాం? కాబట్టి మేనేజ్మెంట్ సీట్లను తగ్గించి, మెరిట్ కే ప్రాధాన్యతనిచ్చేలా ఫీజులను, కోటాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. ఒత్తిడిని లోపల దాచుకోవద్దు..తీవ్ర ఒత్తిడి, ఆందోళనలో ఉన్న విద్యార్థులకు కేటీఆర్ ఒక తండ్రిలా, పెద్దన్నలా దిశా నిర్దేశం చేశారు. "నేను ఇద్దరు పిల్లల తండ్రిగా మీ బాధను, హెల్ప్‌లెస్‌నెస్‌ను అర్థం చేసుకోగలను. ఇలాంటి కష్ట సమయాల్లో భావోద్వేగాలను లోపలే దాచుకోవద్దు అది మానసిక ఒత్తిడిని పెంచుతుంది. మీ తల్లిదండ్రులతో, టీచర్లతో, స్నేహితులతో టీచర్లతో, స్నేహితులతో మాట్లాడండి, మీ బాధను పంచుకోండి. లైఫ్ ఇలాంటి బౌన్సర్లు విసురుతున్నప్పుడు బ్యాలెన్స్‌డ్‌గా ఎదుర్కోవడం అలవాటు చేసుకోవాలి" అని హితవు పలికారు.గతంలో కొందరు విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డు లోపాలను ఎండగట్టినట్లుగా, నీట్ లోపాలను కూడా తాము రాజ్యసభ సభ్యుల ద్వారా ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని, విద్యార్థుల తరఫున బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## టీవీకే మూడు నెలలకూడా కొనసాగడం కష్టమే..

విధించడాన్ని నివారించాలనే ఏకైక ఉద్దేశంతోనే టీవీకేకు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని పేర్కొన్నారు. అలా చేయకపోతే తమిళనాడులో భాజపా పాలనకు మార్గం సుగమం అయ్యేదన్నారు. తమ కూటమిలోని పార్టీలు మద్దతు ఇవ్వడం వల్లే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందన్నారు.

## భారత్‌తో సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటాం

మంది నేపాల్ గుండా ప్రయాణిస్తారని.. కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతం ద్వారా భారత్, చైనాల మధ్య ఒప్పందాన్ని పునరుద్ధరించడంపైనే తాము ఆందోళన చెందుతున్నామని అన్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతంలోని భూమి తమదేనని.. నేపాల్ సమ్మతి లేకుండా ఇరు దేశాలు ఆ ఒప్పందాలను చేసుకోలేవని చాలా కాలంగా చెబుతూనే ఉన్నామని ఆ దేశ విదేశాంగ మంత్రి అన్నారు. ఈ విషయాన్ని మరోసారి భారత విదేశాంగ శాఖ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. కాగితంపై చేసిన పాత వాగ్దానాలకు, క్షేత్రస్థాయిలో నెరవేర్చిన వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీపై నెలకొన్న వివాదంపై నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల మాట్లాడుతూ నేపాల్ భూభాగాలను భారత్ ఆక్రమించడమే కాదని, భారత భూభాగాలనూ నేపాల్ ఆక్రమించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ మంత్రి సరిహద్దు సమస్యల గురించి వ్యాఖ్యానించడం గమనార్హం.ప్రపంచ వేదికపై వేగంగా ఎదుగుతోన్న భారత్‌తో కలిసి పని చేయడానికి తాము ఎదురు చూస్తున్నట్లు శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాణిజ్యం, సరిహద్దు అనుసంధానం, ఇంధన భాగస్వామ్యం, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు.

## గల్ఫ్ మిత్ర దేశాల కోసం.. ఇరాన్ ఆస్తులపై అమెరికా కన్ను?

**టెహ్రాన్(జనంసాక్షి):**ప్రత్యక్షంగాయుద్ధంలో పాల్గొనకపోయినా.. అమెరికా- ఇరాన్ మధ్య పోరుతో గల్ఫ్ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. యుద్ధం కారణంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీంతో గల్ఫ్ మిత్రదేశాల పునర్నిర్మాణానికి సాయం అందించాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇరాన్ ఆస్తులను వినియోగించుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ మిత్రదేశాలకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఒక బృందాన్ని ఆదేశించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆ నష్టాన్ని పూడ్చేందుకు ఇరాన్ ఆస్తులను ఉపయోగించడాన్ని వారు పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ఈ ఆస్తులను భవిష్యత్తు పునర్నిర్మాణం, మరమ్మతుల కోసమే కాకుండా.. ఇప్పటికే భాగస్వాములకు జరిగిన నష్టానికి పరిహారంగా అందించాలని భావిస్తున్నట్లు వెల్లడించాయి.

# ముగిసిన అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ శిబిరం




హైదరాబాద్ (జనంసాక్షి) : క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి దామోదర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా చర్లపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ నరసింహులు హాజరై, క్రీడాకారుల ను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు వాహనాలు నడుపుతున్నప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాల్లో ప్రయాణిం చేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. అలాగే మద్యం సేవించకూడదని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సమాజ అభివృద్ధికి యువత ముందుకు రావాలని సూచనలు ఇచ్చారు. ఈ శిబిరంలో బాలబాలికలు మొత్తం 38 మంది పాల్గొన్నారు. 45 రోజులపాటు నిర్వహించిన ఈ కోచింగ్ క్యాంప్ 2026 ఏప్రిల్ 24 నుండి జూన్ 7 వరకు ప్రతి రోజు ఉదయం 6:00 గంటల నుండి 9:00 గంటల వరకు నగరం చర్లపల్లి సరస్సు వద్ద నిర్వహించారు. ఈ శిక్షణలో స్ప్రింట్స్, మధ్య మరియు దీర్ఘదూర పరుగు, లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, హర్డిల్స్ మరియు రేస్ వాక్ వంటి ఈవెంట్లలో క్రీడాకారులకు శిక్షణ అందించబడిందని కోచ్ తిరుమల రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పి. భద్రం, వెంకీ, రాజేష్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు సహకరించారు.

# గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

**వరంగల్ మండలం, జూన్ 07 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్వాడ పోలీస్ స్టేషన్ పోలీసులు గంజాయి చాక్లెట్ల అక్రమ రవాణాను అడ్డుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసి గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 6 న సాయంత్రం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గారి ఆదేశాల మేరకు ఎస్. శివకృష్ణ, ఎస్ఐ ఆఫ్ పోలీస్, మట్వాడ పోలీస్ స్టేషన్, సిబ్బంది డి. నాగరాజు పిసి-3690, బి. సత్యనారాయణ పిసి-2574 మరియు పి. రవి పిసి-1288లతో కలిసి మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎంజీఎం సర్కిల్ వద్ద అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న ఒక వ్యక్తిని గుర్తించి తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న నలుపు రంగు బ్యాగులో చాక్లెట్ల రూపంలో గంజాయి పదార్థం ఉన్నట్లు గుర్తించారు. విచారణలో అతను తన పేరు జనార్ధన్ మాలిక్, తండ్రి ధనేశ్వర్ మాలిక్, వయస్సు 35 సంవత్సరాలు, నివాసం కాన్పాడా, భద్రక్ జిల్లా, ఒడిశా రాష్ట్రం అని తెలిపాడు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి పంచులను మరియు క్లూస్ టీంను సంఘటనా స్థలానికి రప్పించి చట్టపరమైన ప్రక్రియను చేపట్టారు. పంచుల సమక్షంలో విచారించగా నిందితుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన తన పరిచయస్తుడు అంకిత్ పాణిగ్రహి వద్ద నుండి గంజాయి మిశ్రమం తో తయారు చేసిన చాక్లెట్లను కొనుగోలు చేసి వాటిని మహారాష్ట్ర రాష్ట్రంలోని సోలాపూర్ ప్రాంతంలో అధిక ధరకు విక్రయించి లాభం పొందాలనే ఉద్దేశ్యంతో తీసుకెళ్తున్నట్లు స్వచ్ఛందంగా ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద లభించిన గోల్డ్ కలర్ కవర్లలో సెవెన్ వాటి" పేరుతో ఉన్న మొత్తం 72 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకోగా వాటిపై ముద్రించిన వివరాల ప్రకారం కానాబీస్ సతీవ సహా పలు పదార్థాలతో తయారు చేసినట్లు గుర్తించారు. పంచులు మరియు పోలీసు సిబ్బంది సమక్షంలో పరిశీలించగా చాక్లెట్ల నుండి గంజాయికి ప్రత్యేకమైన ఘాటైన వాసన వస్తుండటంతో అవి గంజాయి మిశ్రమంతో తయారైనవి గా గుర్తించారు. ఈ క్రమంలో మీ ఇంటి తరపున అరెస్టు చేశారు.

# బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేష్ సూర్యవంశం



**హైదరాబాద్ (జనం సాక్షి) :** బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేష్ సూర్యవంశంను నియమించినట్లు బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, బీసీ చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు. హైదరాబాదులోని బీసీసాధికారత సంస్థ భవన్లో బీసీ చైతన్య వేదిక జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగేష్ సూర్యవం శం మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థులకు గొడ్డలిపెట్టుగా ఉన్న జీ.వో నెంబర్ 07ను రద్దు చేయాలి. జీవో నెంబర్ 07ను అదునుగా చేసుకొని, ఈ మధ్యకాలంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సాకుగా చూపుతూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ముందుగానే ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని, దీనికి అదనంగా పుస్తకాల ఫీజులని, అడ్మిషన్ ఫీజు అని వేలకు వేలు ముక్కు పిండి మరీ వసూలు చేసుకుంటున్నా యన్నారు. ప్రైవేటు యాజమాన్యాల ఫీజు ఫీజు దోపిడీలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక పటిష్టమైన "ఫీ రెగ్యులేటరీ కమిటీ" లేకపోవడం దురదృష్టకరమన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి ప్రైవేటు యాజమాన్యాల ఫీజు దోపిడీకి కళ్లెం వేయాలని, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు భవిష్యత్తు, ఆందోళనలతో ముడిపడి ఉన్న అత్యంత సున్నితమైన అంశం. ఇప్పటివరకు ఒత్తిడికి లోనై నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమైన విషయం అన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి పరీక్షలో లోపాలు జరగడం, లక్షలాది మంది విద్యార్థుల శ్రమ వృథా కావడం విద్యాశాఖ వైఫల్యమే.. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ వర్గాల ఆర్థిక, విద్యా ప్రగతికి అడ్డుగా ఉన్న ఉన్న క్రిమిలేయర్ నిబంధనను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నగేష్ సూర్యవంశం, ఉపాధ్యక్షులుగా మేడిపల్లి గౌతమ్, ప్రధాన కార్యదర్శిగా బైకిని రమేష్, అధికార ప్రతినిధిగా నాతి శివరాజ్, కార్యదర్శిగా రెడ్డ మోని శ్రీశైలం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు టి. వినోద్ కుమార్, సలహాదారు మాదాసు రంగనాయకులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బి.సి చైతన్య వేదిక జాతీయ సలహాదారు అక్కల బాబుగౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు సీమల శంకర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం వెంకటేశ్వరరావు. మహిళ కార్యనిర్వాహక అధ్యక్షురాలు రేణుక దీదీ వాసం రాజేష్, పగిళ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కారుపై కాంట్రాక్టర్ల పోరుబాట

- కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- 18న 'చలో హైదరాబాద్' మహాసభను విజయవంతం చేద్దాం
- బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకుల పిలుపు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 07 (జనంసాక్షి) :** రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న (రూ. 27 వేల కోట్లకు పైగా) బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఈ డిమాండ్ సాధన కోసం జూన్ 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్" మహాసభను విజయవంతం చేయాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరీంనగర్ సెంటర్ ఆధ్వర్యంలో నగరంలోని శ్వేత హోటల్లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో బీఏఐ జాతీయ ఉపాధ్యక్షుడు వేముల సత్యమూర్తి, మాజీ రాష్ట్ర చైర్మన్లు బి.సుగుణాకర్ రావు, కటుకూరి దేవేందర్ రెడ్డి, యు.సురేందర్, రాష్ట్ర సలహాదారు కె.ప్రభాకర్ రెడ్డి, జనగామ సెంటర్ మాజీ చైర్మన్ ఇమ్మడి దేవేందర్ రెడ్డి, కరీంనగర్ సెంటర్ చైర్మన్ వి.జితేందర్ రావుతో కలిసి మాట్లాడుతూ 1941లో స్థాపించబడిన బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా దేశంలోని అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక నిర్మాణ రంగ సంస్థలలో ఒకటని తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందే ఏర్పడిన ఈ సంస్థ గత 85 ఏళ్లుగా నిర్మాణ రంగ అభివృద్ధి, కాంట్రాక్టర్ల హక్కుల పరిరక్షణ, దేశ మౌలిక సదుపాయాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుతం డ్రెయినేజీ పనుల నుంచి భారీ డ్యామ్‌ల నిర్మాణం వరకు వివిధ ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల్లో పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బిల్లుల చెల్లింపుల్లో నెలకొన్న జాప్యం, అనిశ్చితి కారణంగా కాంట్రాక్టర్లు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌కు అనుగుణంగా ప్రాధాన్య పనులను కొనసాగిస్తూ, ఇతర పనులను తాత్కాలికంగా నిలిపివేసి కాంట్రాక్టర్ల డిపాజిట్లను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదని విమర్శించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా అనేక మంది కాంట్రాక్టర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడగా మరికొందరు గుండెపోట్లతో మృతి చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితి నిర్మాణ రంగ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంట్రాక్టర్లతో పాటు నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు, అకౌంటెంట్లు, యంత్రాల ఆపరేటర్లు, డ్రైవర్లు, కార్మికులు, నిర్మాణ సామగ్రి సరఫరాదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బిల్లులు అందకపోవడంతో జీతాలు, బకాయిలు చెల్లించలేని పరిస్థితి నెలకొని, లక్షలాది కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. ఇది కేవలం కాంట్రాక్టర్ల సమస్య మాత్రమే కాదని, నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాల మనుగడకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని నాయకులు స్పష్టం చేశారు. కాంట్రాక్టర్ల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం జూన్ 18న హైదరాబాద్‌లో నిర్వహించే "చలో హైదరాబాద్" మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములమని పేర్కొన్న నాయకులు, రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు సహా మౌలిక సదుపాయాల నిర్మాణంలో కాంట్రాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్న నిర్మాణ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులను క్రమ సంఖ్య ప్రకారం పారదర్శకంగా విడుదల చేసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వైద్యుల నిర్లక్ష్యానికి మరో ప్రాణం బలి

- ఆసుపత్రి ఎదుట తల్లిదండ్రుల ఆందోళన





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 7( జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రిలో అపెండిక్స్ (కడుపునొప్పి) ఆపరేషన్ వికటించి ఇందు (17 ఏళ్లు) అనే యువతి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని ఆగ్రహిస్తూ శనివారం రాత్రి, ఆదివారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆసుపత్రి ఎదుట భారీ ఆందోళనకు దిగారు. బాధితుల వివరా ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవెల్లి గ్రామానికి చెందిన ఇందు (17)ను తీవ్రమైన అపెండిక్స్ కడుపునొప్పితో బాధపడుతుంటే కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆపరేషన్ కోసం థియేటర్‌కు తీసుకెళ్లారు. సర్జరీ విజయవంతమైందని మొదట చెప్పిన వైద్యులు, ఆ తర్వాత బీపీ పెరుగుతోందనే సాకులతో కాలయాపన చేశారు. చివరకు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బాలిక మృతి చెందినట్లు ప్రకటించారు.

## ఆసుపత్రి సిబ్బందిపై ఆరోపణలు

బాలిక మరణించిన వెంటనే విషయాన్ని బయటకు పొక్కకుండా ఆసుపత్రి సిబ్బంది జాగ్రత్తపడ్డారు. రాత్రి 8 గంటలకే మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కించి కుటుంబ సభ్యులకు సర్దిచెప్పి ఎర్రవల్లి చౌరస్తాకు పంపించే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారం గమనించిన ఎర్రవల్లి గ్రామ స్థులు, యువకులు అంబులెన్స్‌ను అడ్డుకొ ని, తిరిగి గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి శవాన్ని తరలించారు. వైద్యుల నిర్లక్ష్యమే ఇందు ప్రాణాలు తీసిందని ఆరోపిస్తూ శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఆసుపత్రి ముందున్న ప్రధాన రహదారిపై బాధితులు ఆందోళన చేపట్టారు. దీనివల్ల అక్కడ వాహనాల రాకపోకలు నిలిచిపోయి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాసం ఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలని, బాధిత కుటుం బానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని గద్వాల ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఇందు కుటుంబానికి ఎక్స్ గ్రేషియో ఇవ్వాలి : సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్

ఆస్పత్రిపై పర్యవేక్షణ కొరవడిన కారణంగా గతంలో కూడా అనేక సంఘటనలు జరిగాయని చాలామంది చావుకు గద్వాల ప్రభుత్వ వైద్యులు కారణమవుతున్నారని వారి నిర్లక్ష్యం కారణంగా మరణాలు సంభవిస్తున్నాయని వీటన్నింటికీ బాధ్యత వహిస్తూ హాస్పిటల్స్ సూపర్డెంట్ ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. విద్యార్థిని ఇందు కుటుంబానికి ఎక్స్ గ్రేషియో ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు, ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి, ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు ఎర్రవల్లి గ్రామస్తులు ఆసుపత్రి ముందు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న సందర్భంగా వారికి మద్దతుగా పాల్గొని మాట్లాడారు.



## నిందితులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా గద్వాల జిల్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన నీట్ విద్యార్థిని ఇందు మృతి చెందదాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఖండించారు. వైద్యుల తప్పును కప్పిపుచ్చుకోవడానికి పోస్టుమార్టం నిర్వహించకుండా, దొడ్డిదారిన అంబులెన్స్ లో శవాన్ని తరలించడం ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టమవుతోందని పేర్కొన్నారు. కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చిన విద్యార్థినిని శవంగా మార్చి కుటుంబ సభ్యులకు అప్పగించడం పై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నా రు. ప్రభుత్వం ఈ ఘటనపై తక్షణమే స్పందించి విద్యార్థిని ఇందు మృతికి కారణమైన నిర్లక్ష్యపు డాక్టర్లను వెంటనే డిస్మిస్ చేయాలని, ఆసుపత్రి పర్యవేక్షణ, తదితర అంశాలలో గతంలో కూడా విఫలమై ఇలాంటి అనేక మరణాలకు కారణమైన గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం డెంటెంట్ ను వెంటనే విధుల నుండి సస్పెండ్ చేయాలని, ఇందు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఎక్స్ గ్రేషియో ప్రకటించా లని, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించి ప్రభుత్వం ఆదుకోవా లని డిమాండ్ చేశారు. తమ బిడ్డను కోల్పోయి న్యాయం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులను, ఎర్రవల్లి గ్రామస్తులకు మద్దతుగా నిలిచిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, ప్రజాసం ఘాల నాయ కులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయ డాన్ని తీవ్రంగా ఖండించారు. ధరూర్, గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్లలో ఉంచిన నాయకులను, బాధితులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## కార్మికుల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే..

- స్పష్టం చేసిన జలమండలి ఫలితాలు
- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ఫలితాలు కార్మికులు, ఉద్యోగుల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని స్పష్టం చేస్తున్నాయని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా ఘన విజయం సాధించిన మొగుళ్ల రాజిరెడ్డికి ఆదివారం గాంధీభవన్ లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జలమండలి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో పాల్గొని, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కు ఓటు వేసి గెలిపించిన కార్మిక సోదరిసోదరులందరికీ అభినందనలు తెలిపారు. జలమండలి ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన మొగుళ్ల రాజిరెడ్డికి వారి బృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఐఎన్‌టీయూసీ ద్వారా కాంగ్రెస్ జెండాను ఎగరేశామని, రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయపతాకం ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు



**ఝరాసంగం (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామంలో ఆదివారం ఒక పిచ్చికుక్క తీవ్ర అలజడి సృష్టించింది. గ్రామంలోని జనావాసాల్లోకి చొరబడి ఒక్కసారిగా ప్రజలపై విరుచుకుపడింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన రిజ్వానా బేగం, చంటయ్య, యేసయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి సహా మొత్తం ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ముక్కు, నోరు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బాధితులను ఝరాసంగం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు వారిని జహీరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం బాధితులను హైదరాబాద్‌కు తరలించారు.

అంతకుముందు శనివారం బొజ్జానాయక్ తండాకు చెందిన విశాల్ అనే యువకుడిపై ఇదే కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. మండలంలో పిచ్చికుక్కల దాడులు నిత్యకృత్యంగా మారాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ బర్దిపూర్, ఝరాసంగం, బొజ్జానాయక్ తండా, కుప్పానగర్ తదితర గ్రామాల్లో కుక్కలు దాడులు చేసి పలువురిని గాయపరిచిన సంబంధిత అధికారులు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

# చర్లపల్లి నుంచి అరుణాచలానికి నేరుగా రైళ్లు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని అరుణాచలం భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. ఇటీవల ఆధునీకరించిన చర్లపల్లి శాటిలైట్ రైల్వే టెర్మినల్ నుంచి అరుణాచలం (తిరువణ్ణామలై) మీదుగా వెళ్లే పలు ప్రత్యక్ష రైలు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడంతో భక్తుల ప్రయాణం మరింత సులభంగా మారింది. ముఖ్యంగా ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ కోసం అరుణాచలం వెళ్లే వేలాది మంది భక్తులకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి అరుణాచలం వెళ్లాలంటే భక్తులు సికింద్రాబాద్, కాచిగూడ లేదా నాంపల్లి స్టేషన్ల నుంచి ప్రయాణించి తిరుపతి, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు చేరుకుని అక్కడి నుంచి బస్సులు లేదా కనెక్టింగ్ రైళ్లను ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో ప్రయాణ సమయం పెరగడంతో పాటు అదనపు ఖర్చులు కూడా భరించాల్సి వచ్చేది. పౌర్ణమి రోజుల్లో రద్దీ కారణంగా కన్ఫార్మ్ టికెట్లు పొందడం కూడా కష్టసాధ్యంగా మారేది.

# 12 కిలోల ఎండుగంజాయి స్వాధీనం

- ఇద్దరు మహిళలను అరెస్టు చేసిన పోలీసులు



**వరంగల్ మండలం, జూన్ 07 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యలలో భాగంగా, ఆదివారం మట్వాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వరంగల్ హంటర్ రోడ్డులోని ఏడు మోరీల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా రెండు సూట్‌కేసులతో వెళ్తున్న ఇద్దరు మహిళలను గుర్తించి తనిఖీ చేయగా, వారు పోలీసు వాహనాన్ని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకొని విచారించినారు. 1) త్రివేణి రామనాథ్ ఘోడ్కే, వయస్సు 26 సంవత్సరాలు, నివాసం పూణే, మహారాష్ట్ర మరియు 2) అంజలి రామ్ సాథే, వయస్సు 25 సంవత్సరాలు, నివాసం పూణే, మహారాష్ట్రగా తెలియజేసినారు. అనంతరం పై అధికారుల ఆదేశాల మేరకు వరంగల్ మున్సిపల్ కార్యాలయం నుండి పంచులను పిలిపించి, క్లూస్ టీం సిబ్బందిని సంఘటనా స్థలానికి రప్పించి, పంచుల సమక్షంలో చట్టబద్ధంగా తనిఖీ నిర్వహించగా, వారి వద్ద ఉన్న రెండు సూట్‌కేసులలో మొత్తం ఆరు ప్యాకెట్లలో నిల్వ ఉంచిన 12 కిలోల ఎండు గంజాయి లభించినది. ప్రతి ప్యాకెట్‌ను విడిగా పరిశీలించి, డిజిటల్ త్రాసు సహాయంతో తూకం వేయగా ఒక్కో ప్యాకెట్ సుమారు 2 కిలోల చొప్పున ఉండగా, మొత్తం 12 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు నిర్ధారించబడినది. పంచుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకొని, నమూనాలు సేకరించి, సీజ్ ప్రక్రియ పూర్తి చేయబడినది. విచారణలో నిందితురాళ్లు పూణే, మహారాష్ట్ర నుండి ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే బీజేష్ వ్యవన్ సోనీ మానిష్ సహూ వద్ద రూ.60,000/- చెల్లించి 12 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేసి, పూణేకు తరలించే క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గమనించి భయపడి రైలులో నుండి దిగిపోయి, రైల్వే స్టేషన్ వెనుక మార్గం ద్వారా తప్పించుకొని కాజీపేట వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా మట్వాడ పోలీసులకు పట్టుబడినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితురాళ్ల వద్ద నుండి గంజాయి కొనుగోలు, రవాణాకు ఉపయోగించిన రెండు మొబైల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు.

సంపాదకీయం

# యువత పిడికిలి బిగిసింది..!

జంతర్ మంతర్ వద్ద ఆకాశానికి ఎగిసిన పిడికిలి కేవలం ఒక నిరసన కాదు.. అది భారత రాజకీయ వ్యవస్థకు పట్టిన తుప్పును వదిలించే యువతరపు హెచ్చరిక. బంగ్లాదేశ్ కోటా వ్యతిరేక ఉద్యమ స్ఫూర్తితో, దశాబ్దాల నిరాశ, అణచివేత, రాజకీయ మోసాలపై సామూహికంగా ఎగిరిన స్వరం ఇది.

అధికార గణం తమ ప్రత్యర్థులను అణచడానికి వాడిన 'కాక్రోచ్', 'పారాసైట్' వంటి విషపూరిత పదాలను, ఆ యువత గర్వంగా తమ బ్యానర్లపై ధరించారు. అణగారిన వర్గాలు తమను అవమానించడానికి వాడిన పదాలనే తమ అస్తిత్వంగా మార్చుకోవడం ద్వారా, రాజకీయ దుర్మార్గానికి వారు ఇచ్చిన బలమైన సాంస్కృతిక సమాధానం ఇది. 'మతాన్ని రెచ్చగొడితే ప్రజలు చీకటిలో ఉంటారు' అనేది దశాబ్దాలుగా పాలకులు నమ్మిన ఫార్ములా. కానీ ఢిల్లీ వీధుల్లో కనిపించింది హిందువు, ముస్లింల విభజన కాదు, 'నిరుద్యోగి' అనే ఏకైక గుర్తింపుతో ఆశించే పౌరులు. మతపు పుస్తకాలను పక్కనపెట్టి, రాజ్యాంగం అందించిన అర్హత, సమానత్వం, హక్కుల కోసం వారు నిలబడ్డారు. పాలకుల అత్యంత నమ్మకమైన 'విభజన వ్యూహం' ఇక్కడ బోల్తా కొట్టింది.

ఈ ఉద్యమానికి నాయకుడు లేడు, పార్టీ లేదు. అదే దీని అత్యంత శక్తివంతమైన అస్త్రం. నాయకుడిని అరెస్ట్ చేయలేరు, సిద్ధాంతాన్ని తప్పుపట్టలేరు. పార్టీని స్వార్థపూరితమని ముద్ర వేయలేరు. సోషల్ మీడియా వెన్నెముకగా, వికేంద్రీకృత చైతన్యంతో సాగుతున్న ఈ పోరాటం, 21వ శతాబ్దపు ప్రజాస్వామ్యానికి సరికొత్త పాఠం. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశం. కానీ వారికి కావాల్సింది మతం కాదు; పారదర్శకమైన రిక్రూట్‌మెంట్, నాణ్యమైన విద్య, ఉద్యోగాలు. తలుపులు మూసివేసిన వ్యవస్థపై పేరుకుపోయిన ఆ నిరాశ, జంతర్ మంతర్ వేదికగా బయటకు వచ్చింది. యువత వినాశకర మార్గం పట్టకుండా, ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడం భారత ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప వరం.

నిరసనని అణచివేయడం అంటే, అగ్నిపర్వతంపైన మూతపెట్టడం మాత్రమే. అది మరింత తీవ్రమైన విస్ఫోటానికి దారితీస్తుంది. న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం అడిగిన వారిని 'దేశద్రోహులు' అనడం ప్రభుత్వాల దివాళాకోరుతనానికి నిదర్శనం. నిజమైన సమస్యలు పోలీసు లాఠీలతో కాదు, విధాన మార్పులతోనే పరిష్కారమవుతాయి. జంతర్ మంతర్ కేవలం ఒక చారిత్రక ఛాయాచిత్రంగా మిగిలిపోకూడదు. నిరాశ నుండి పుట్టిన ఈ నిరసన, నిర్ణయంగా మారి, నిర్మాణాత్మక మార్పుకు నాంది పలకాలి. యువత మేల్కొంది, విభజనను దాటి ఐక్యత వైపు, భయాన్ని దాటి న్యాయంవైపు అడుగులు వేస్తోంది. భారతదేశపు అసలైన బలం పాలకుల చేతుల్లో లేదు.. మేల్కొంటున్న ఆ ప్రజల పిడికిలిలోనే ఉంది. ఆ పిడికిలి ఇప్పుడు మాట్లాడుతోంది. రేపు అది ఓటుగా, విధానంగా, మార్పుగా మారాలి. అదే భావి భారతానికి పునాది.

# భారత్ -బర్మా: సరిహద్దులను దాటి సాగిన సంబంధాలు



భారత్‌కు తూర్పు ద్వారంగా, ఆగ్నేయాసియాకు ప్రవేశ మార్గంగా నిలిచిన బర్మా (ప్రస్తుతం మయన్మార్ )తో భారతదేశానికి ఉన్న సంబంధాలు కేవలం దౌత్యపరమైనవే కావు. చరిత్ర, సంస్కృతి, మతం, వాణిజ్యం, భద్రత, ప్రజల జీవన విధానాలతో ముడిపడిన బహుముఖ సంబంధాలు ఇవి. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ అనుబంధం నేటి అంతర్జాతీయ రాజకీయాల్లో కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది.
ప్రాచీన కాలం నుంచే భారతీయ సంస్కృతి బర్మాపై గాఢ ప్రభావం చూపింది. ముఖ్యంగా బౌద్ధమతం వ్యాప్తి ద్వారా రెండు ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలు బలపడ్డాయి. బర్మాలోని అనేక దేవాలయాలు, శిల్పకళ, సాహిత్యం, సంప్రదాయాల్లో భారతీయ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. బౌద్ధ ధర్మాన్ని అనుసరించే ప్రజల్లో భారతదేశం పట్ల ప్రత్యేక గౌరవం ఇప్పటికీ కొనసాగుతోంది. గౌతమ బుద్ధుని జన్మభూమి భారత ఉపఖండమే కావడం ఈ అనుబంధానికి మరింత బలం చేకూర్చింది.
బ్రిటిష్ పాలన కాలంలో బర్మా చాలా కాలం వరకు బ్రిటిష్ ఇండియాలో భాగంగా ఉండేది. 1937లో బర్మాను భారతదేశం నుంచి పరిపాలనా పరంగా వేరు చేశారు. ఈ కాలంలో వేలాది మంది భారతీయులు బర్మాకు వలస వెళ్లి అక్కడ వ్యాపారాలు, ఉద్యోగాలు చేసేవారు. ఫలితంగా రెండు దేశాల ప్రజల మధ్య సామాజిక, ఆర్థిక సంబంధాలు ఏర్పడ్డాయి. అయితే రెండో ప్రపంచ యుద్ధం, తరువాతి రాజకీయ పరిణామాల కారణంగా ఈ సంబంధాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.
1948లో బర్మా స్వాతంత్ర్యం పొందిన తర్వాత భారత్ వెంటనే దానిని గుర్తించి స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించింది. కోల్డ్ వార్ సమయంలో రెండు దేశాలు తటస్థ విధానాలకు ప్రాధాన్యత ఇచ్చాయి. అయితే బర్మాలో సైనిక పాలన బలపడటం, ప్రజాస్వామ్య ఉద్యమాల అణచివేత కారణంగా కొంతకాలం ఇరు దేశాల మధ్య సంబంధాలు సంక్లిష్టంగా మారాయి. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న భారత్, ఒకవైపు ప్రజాస్వామ్య ఉద్యమాలకు మద్దతు తెలుపుతూనే మరోవైపు భౌగోళిక, వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా బర్మా ప్రభుత్వంతో సంబంధాలను కొనసాగించింది. ప్రస్తుతం భారత్ - బర్మా సంబంధాల్లో భద్రతా అంశం అత్యంత కీలకమైనది. రెండు దేశాల మధ్య సుమారు 1,600 కిలోమీటర్లకు పైగా భూసరిహద్దు ఉంది. ఈ సరిహద్దు భారత ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం ప్రాంతాల మీదుగా విస్తరించింది. ఈ ప్రాంతాల్లో తిరుగుబాటు గ్రూపులు, అక్రమ రవాణా, ఆయుధాల చలామణి వంటి సమస్యలు రెండు దేశాలకు సవాలుగా మారాయి. అందువల్ల సరిహద్దు భద్రత విషయంలో భారత్, బర్మా పరస్పర సహకారాన్ని కోరుకుంటున్నాయి.
భారత్ అమలు చేస్తున్న "యాక్ట్ ఈస్ట్ పాలసీ"లో బర్మాకు ప్రత్యేక స్థానం ఉంది. ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య, రవాణా, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయాలంటే బర్మా కీలక వారధిగా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో కలాదాన్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ప్రాజెక్టు, ఇండియా-మయన్మార్-థాయిలాండ్ హైవే వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇవి పూర్తిగా అమలులోకి వస్తే భారత ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తాయి.
ఆర్థిక రంగంలో కూడా రెండు దేశాల మధ్య సహకారం పెరుగుతోంది. వ్యవసాయం, ఇంధనం, మౌలిక సదుపాయాలు, సమాచార సాంకేతిక రంగాల్లో భారత పెట్టుబడులు పెరుగుతున్నాయి. సహజ వాయువు నిల్వలు ఉన్న బర్మా, భారత ఇంధన భద్రతకు ఉపయోగపడే దేశంగా పరిగణించబడుతోంది. అదే సమయంలో భారత ఔషధాలు, విద్యా సేవలు, సాంకేతిక పరిజ్ఞానానికి బర్మాలో మంచి డిమాండ్ ఉంది.
అయితే ఇరు దేశాల మధ్య సవాళ్లు కూడా లేకపోలేదు. 2021లో బర్మాలో జరిగిన సైనిక తిరుగుబాటు తర్వాత అక్కడ రాజకీయ అస్థిరత మరింత పెరిగింది. సైన్యం, ప్రజాస్వామ్య వర్గాల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. దీనివల్ల వేలాది మంది శరణార్థులు భారత సరిహద్దు రాష్ట్రాలకు చేరుకున్నారు. మానవతా దృక్పథం, భద్రతా అవసరాల మధ్య సమతుల్యత పాటించడం భారత్‌కు ఒక క్లిష్టమైన సవాలుగా మారింది.
అంతేకాకుండా, బర్మాలో చైనా ప్రభావం పెరుగుతుండటం కూడా భారత వ్యూహాత్మక ఆందోళనల్లో ఒకటి. నౌకాశ్రయాలు, రహదారులు, ఇంధన ప్రాజెక్టుల ద్వారా చైనా తన ఉనికిని విస్తరిస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా భారత్ తన అభివృద్ధి ప్రాజెక్టులు, దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తోంది.
మొత్తంగా చూస్తే, భారత్ - బర్మా సంబంధాలు కేవలం రెండు పొరుగు దేశాల మధ్య ఉన్న సంబంధాలు మాత్రమే కావు. అవి చరిత్ర, సంస్కృతి, భద్రత, ఆర్థికాభివృద్ధి, అంతర్జాతీయ వ్యూహాల సమ్మేళనం. భవిష్యత్తులో ఆగ్నేయాసియాలో భారత ప్రభావం ఎంత మేర పెరుగుతుందో అనేది చాలా వరకు బర్మాతో ఏర్పడే సంబంధాలపై ఆధారపడి ఉంటుంది. పరస్పర గౌరవం, స్థిరత్వం, అభివృద్ధి లక్ష్యాలతో ఈ సంబంధాలు మరింత బలపడితే, రెండు దేశాలకే కాకుండా మొత్తం ప్రాంతీయ శాంతి, అభివృద్ధికి కూడా అది ఉపయోగకరంగా మారుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## ప్రయోగం!

ఇంకా ఎందుకు
నాశనం చేస్తారు?
యుగయుగాలు
మీ అవతారాలు
ఎంత వెనక్కివెళ్లినా
ఎక్కడైనాధర్మంఉందా?
రవ్వంతైనా జనానికి
న్యాయం చేశారా?
అంతా వినాశనం!
కులాలన్నారు
మతాలన్నారు
జన్మలన్నారు
కర్మలన్నారు
దేవుళ్ళన్నారు
దెయ్యాలన్నారు
నరకమన్నారు
స్వర్గమన్నారు
అంతాకల్పన!
అబద్ధాలు చెప్పి చెప్పి
ఎన్నాళ్ళు చెపుతారు!
చెప్పినవన్నీ నమ్మి జనం
సర్వ నాశనమయ్యారు!
పైలోకాలంటారు
క్రింది లోకాలంటారు
ఆధ్యాత్మికమంటారు
కామిగాక మోక్షగామి
కాదని మీరే అంటారు!
భౌతికం లేకుండా
ఆధ్యాత్మికం ఎందుకు?
ప్రపంచాన్ని చెడగొట్టి
దిక్కులేకుండా చేసి
వాళ్లకష్టం మీద మీరు
జల్సా చేస్తున్నారు!
ఎందుకురా!ఈ మోసం
వాళ్లకష్టం వాళ్ళకు
దక్కనివ్వండి!
మీరు ఏ స్వర్గాలూ
ఇవ్వక్కరలేదు!
వాళ్ల బతుకు వాళ్ళను
బ్రతకనిస్తే చాలు!
మీపాండిత్యాలు
మీ సంస్కృతాలు
మీబ్రమ్మరాతలు
మీమాయకూతలు
మానేయండి!
మీరైనా మేమైనా
అందరం మనుషులం!
కనీసావసరాలు తీరి
విద్యా వైద్యం చాలు!
మీరు పెద్ద మేదావులు!
గొప్ప పరిపాలకులు!
కాస్త మంచిమనసు
సహకార గుణంచాలు!
ఏ స్వర్గాలు వద్దు!
ఇంకా అస్పృశ్యులమా!
మమ్మల్ని కలుపుకోండి!
అందరం మనుషులం
ఈ భావాన్ని పెంచండి!
ప్రజలు మంచోళ్ళు
మీరు చెపితే వింటారు!
ఇన్నాళ్లు మీరు చెప్పినవి
నమ్మి 'ఇలా' అయ్యారు!
కాస్త'మంచి' బోధించండి!
జనానికి 'పని' ఇచ్చి
వచ్చిన లాభాలు
మీ'బొక్కసాల్లో'కాదు!
ఏడంతస్తుల మేడలు
ఖరీదైనసూట్లు బూట్లు
పడవల్లాంటికార్లు
దేవుడిచ్చాడని చెప్పి
ఇంకావాళ్ళను దరిద్రం
లోకి తొయ్యకండి!
పోనీ పెట్టుబడిదారీ
వ్యాపారమే చేసి
సోషలిస్టు జీవనాన్ని
ప్రజలకు అందివ్వండి!
దేశం సౌభాగ్యవంతం
కావటం ఖాయం!



ఈ 'ప్రయోగం' చేసి
గొప్పపేరుతెచ్చుకోండి
మహా నాయకులారా!!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# భిన్నత్వంలో ఏకత్వం

## దేశ ప్రగతిలో భారతీయ ముస్లింల పాత్ర



ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి టీవీలో వార్తలు చూస్తున్నప్పుడు, ఉగ్రవాది అనే పదం వినగానే మనలో చాలామంది మనసులో ఒక నిర్దిష్టమైన ముఖం, ఒక నిర్దిష్టమైన మతం మెదులుతుంది. ఆ ముఖం ఎవరిది? ఆ ఊహ ఎప్పుడు, ఎలా మొదలైంది? ఈ ప్రశ్నకు జవాబు మీ మనసులో సిద్ధంగా ఉంటే మీరు ఇప్పటికే ఒక పెద్ద అంతర్జాతీయ మేధో వలలో చిక్కుకున్నారని అర్థం.ఉగ్రవాదం అనేది ప్రాథమికంగా మతానికి సంబంధించిన సమస్య కాదు. ఇది కేవలం ఒక వర్గానికో, దేశానికో పరిమితమైనది కాదు. ఇది అధికారానికి, అణచివేతకు సంబంధించిన సమస్య. ఇది వ్యవస్థాగత అన్యాయానికి, నిరాశకు, తీవ్రమైన వివక్షకు సంబంధించిన సామాజిక విపరిణామం. కానీ అంతర్జాతీయ, జాతీయ మీడియా ప్రతిసారి దీనిని ఒకే కోణంలో, ఒకే రంగులో ఎందుకు చూపిస్తుంది? ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నదా? ఖచ్చితంగా కాదు. దీని వెనుక బలమైన రాజకీయ వ్యూహాలు, ప్రయోజనాలు దాగి ఉన్నాయి.
మనం చరిత్రను నిష్పక్షపాతంగా తిరిగి చదివితే అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. ఇరవయ్యో శతాబ్దంలో మానవ చరిత్రలోనే అతిపెద్ద మారణకాండలు జరిగాయి. నాజీ జర్మనీలో హిట్లర్ జరిపిన యూదుల సంహారం, స్టాలిన్ హయాంలో రష్యాలో జరిగిన రాజకీయ హత్యాకాండలు, కంబోడియాలో పోల్ పాట్ సాగించిన నరమేధం, లేదా రువాండాలో జరిగిన తెగల యుద్ధాలు వీటన్నింటికీ కారణమైన హంతకులు ఎవరూ ముస్లిమ్స్ కారు.
స్టాలిన్ ఒక క్రైస్తవ సంస్కృతి గల దేశంలో పుట్టి, కోట్ల మంది స్వదేశీయులను చంపాడు అతడిని ఏ మీడియా అయినా క్రైస్తవ ఉగ్రవాది అని పిలిచిందా? హిట్లర్ క్రూరత్వాన్ని ప్రస్తావించినప్పుడు ఎవరైనా క్రైస్తవ మతాన్ని నిందించారా? లేదు. అయితే, విచారకరమైన విషయం ఏమిటంటే, ప్రపంచంలో ఎక్కడో ఒక ముస్లిం పేరు గల వ్యక్తి తప్పు చేయగానే, ఇస్లాం మతం మొత్తం ప్రశ్నార్థకం అవుతుంది. ఇది ఎంతవరకు న్యాయమో సమాజం ఆలోచించాలి.
భారతదేశ చరిత్రను పరిశీలిస్తే, 1984 లో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో వేలమంది నిర్దోషులు ఊచకోతకు గురయ్యారు. అలాగే 2002 గుజరాత్ అల్లర్లలో వందలాది మంది అమాయకులు సజీవదహనమయ్యారు. ఆయా హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్న హంతకులు ఏ మతానికి చెందినవారు? వారిని ఏనాడైనా ఉగ్రవాదులు అని పిలిచారా? ఇటువంటి ద్వంద్వ ప్రమాణాలకు సమాధానం చెప్పవలసిన బాధ్యత నేటి వ్యవస్థపై ఉంది.
ప్రపంచ గణాంకాలు కూడా ఇందుకు భిన్నంగా లేవు. అమెరికాలో ప్రతి సంవత్సరం జరిగే మాస్ షూటింగ్స్ లో (సామూహిక కాల్పులు) 90% కంటే ఎక్కువ నేరస్తులు శ్వేత జాతీయులే ఉంటారు. కానీ వైట్ క్రిస్టియన్ టెర్రరిజం అని హెడ్‌లైన్ ఏ ప్రముఖ న్యూస్ ఛానెల్ కూడా వేయదు. నిజాన్ని నిరూపించడానికి కళ్ళు మాత్రమే కాదు, నిష్పక్షపాతమైన మనసు కూడా అవసరం.ప్రపంచంలో ఇస్లాం పేరు మీద జరిగే ఏ రకమైన హింసనైనా ఎవరూ సమర్థించకూడదు. అది చట్టరీత్యా నేరం, మానవీయంగా తప్పు, మరియు ఇస్లాం యొక్క మూల బోధనలకు పూర్తిగా వ్యతిరేకం. కానీ కొందరు యువకులు ఎందుకు ఉగ్రవాదం వైపు మళ్ళుతున్నారు? అనే మూల కారణాన్ని వెతకకుండా కేవలం ఆ మతమే అంత అని తేల్చేయడం మేధోపరమైన దివాలాకోరితనం అవుతుంది. దీని వెనుక ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి.
అఫ్ఘానిస్తాన్, ఇరాక్, సిరియా, మరియు ఫిలస్తీన్ వంటి దేశాలలో దశాబ్దాల పాటు జరిగిన యుద్ధాలు, సామూహిక హననాలు, శరణార్థి శిబిరాల్లోని నరకయాతన అక్కడ ఒక తరాన్ని తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేశాయి. వ్యవస్థలపై, పశ్చిమ దేశాల ఆధిపత్యంపై వారిలో పెరిగిన ఆగ్రహాన్ని ఐసిస్ వంటి ఉగ్రవాద సంస్థలు మతపరమైన రంగు పూసి తమ స్వార్థానికి వాడుకున్నాయి.భారతదేశంలోని అనేక ముస్లిం సమాజాలలో సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తుంది. 2006 నాటి సచార్ కమిటీ నివేదిక ప్రకారం, ముస్లింల సగటు జీవన ప్రమాణాలు కొన్ని ప్రాంతాల్లో అత్యంత వెనుకబడిన వర్గాల కంటే తక్కువగా ఉన్నాయి. ఒక యువకుడికి సరైన విద్య, ఉపాధి, సమాజంలో గౌరవం లేనప్పుడు, వారిని తప్పుదోవ పట్టించడం తీవ్రవాద శక్తులకు చాలా సులభం అవుతుంది. ఉగ్రవాదాన్ని సృష్టించి, పెంచి పోషించింది ముఠాలు కాదు, కొన్ని దేశాల ప్రభుత్వాలే. సోవియట్ యూనియన్‌ను అడ్డుకోవడానికి అఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్‌కు అమెరికా ఆర్థిక, సైనిక సహాయం అందించింది. అలాగే భారతదేశాన్ని అస్థిరపరచడానికి పాకిస్తాన్ అనేక ఉగ్రవాద సంస్థలను ప్రోత్సహించింది. ఇవి మతపరమైన చర్యలు కావు, కేవలం జియోపొలిటికల్ గేమ్స్ మాత్రమే.
భారతదేశంలో 20 కోట్లకు పైగా ముస్లిం జనాభా ఉన్నారు. వారంతా ఈ దేశ పౌరులు. ఈ మట్టిలోనే పుట్టి, ఈ మట్టిలోనే కలిసిపోయే దేశభక్తులు. వారి శ్రమ, రక్తం కూడా ఈ దేశ రక్షణ, ప్రగతి కోసం ధారపోశారు. భారతదేశాన్ని అంతరిక్ష, అణుశక్తి కేంద్రంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారికి దక్కుతుంది. పారిశ్రామికవేత్త అజీమ్ ప్రేమ్‌జీ వంటి వారు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. ఉస్తాద్ జాకీర్ హుసేన్ నుండి ఎ.ఆర్. రెహమాన్ వరకు ఎందరో మహానుభావులు భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తం చేశారు. భారతదేశంలోని ముస్లిం జనాభా లో 99.99% మంది శాంతిప్రియులు, సామాన్య పౌరులు. కొద్దిమంది చేసిన తప్పులకు మొత్తం సమాజాన్ని నిందించడం గణాంకపరంగా తప్పు, నైతికంగా అన్యాయం.
మన దేశానికి అసలైన ముప్పు పొరుగు దేశాల నుండి లేదా మరే ఇతర మతం నుండి రావడం లేదు,అది సమాజంలో పెరుగుతున్న మతవిద్వేషం నుండి వస్తోంది. పేద ప్రజలను కులాలు, మతాల పేరుతో విడగొట్టి, వారి అసలైన సమస్యల నుండి దృష్టి మళ్లించే రాజకీయ వ్యూహాల వల్ల దేశానికి నష్టం జరుగుతోంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి, విద్యా రాహిత్యం ఇవే దేశానికి అసలైన శత్రువులు.ఒక హిందూ నిరుద్యోగి పడే బాధకు, ఒక ముస్లిం నిరుద్యోగి అనుభవించే ఆవేదనకు ఏమాత్రం తేడా లేదు. ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబంలో మిగిలే కన్నీరు మతాన్ని బట్టి మారదు. ఈ సమస్యలను కేవలం మంచి పాలన ద్వారానే పరిష్కరించగలం కానీ పరమత దూషణ ద్వారా కాదు
ప్రతి భారతీయుడు తనను తాను ఒక ప్రశ్న వేసుకోవాలి.నా నిజమైన శత్రువు నా పక్క ఇంట్లో ఉండే ముస్లిం సోదరుడా? లేక నా పిల్లలకు మంచి చదువు, ఉద్యోగం, ఆరోగ్యం ఇవ్వలేకపోతున్న ప్రస్తుత వ్యవస్థా? మన శత్రువు పొరుగువాడు కాదు, మన హక్కులను కాలరాస్తున్న అసమానత మాత్రమే. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటే కేవలం ఆయుధాలు సరిపోవు, ఆ తీవ్రవాద ఆలోచనలు పుట్టడానికి కారణమవుతున్న సామాజిక పరిస్థితులను మార్చాలి. అన్యాయాన్ని అరికట్టాలి, నాణ్యమైన విద్యను అందరికీ అందించాలి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. మతాన్ని రాజకీయం చేసే శక్తులను పౌరులుగా మనం నిలదీయాలి. భారతదేశ బలం దాని భిన్నత్వంలో ఏకత్వంలోనే ఉంది. మనం కలిసికట్టుగా ఉంటేనే దేశం సురక్షితంగా మరియు శక్తివంతంగా ఉంటుంది.

డా .సూర్యదేవర రామకృష్ణ,
jaikisan999@gmail.com

# బొద్దింకల తిరుగుబాటు

## ఢిల్లీ నుంచి దేశానికి యువత సందేశం

***నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, ప్రభుత్వ వైఫల్యాలపై యువత ఆవేదన ఈరోజు ఢిల్లీ జంతర్ మంతర్‌ను ఉప్పెనగా మార్చింది. సోషల్ మీడియాలో 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) పేరుతో వ్యంగ్య ఉద్యమంగా మొదలైన నిరసన, ఇప్పుడు వేలాది మంది యువకులు పాల్గొన్న భారీ వీధి ఉద్యమంగా రూపాంతరం చెందింది. అమెరికా నుంచి ఢిల్లీ చేరుకున్న ఉద్యమ నాయకుడు అభిజీత్ దిప్కే నేతృత్వంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో యువత హోరెత్తింది.***



జూన్ 6, 2026న ఢిల్లీలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన దేశ రాజకీయాల్లో, సోషల్ మీడియాలో, యువత చర్చల్లో ఒక ముఖ్యమైన ఘటనగా మారింది. కొన్ని వారాల క్రితం సోషల్ మీడియాలో వ్యంగ్య ఉద్యమంగా ప్రారంభమైన ఈ ప్రచారం, ఇప్పుడు వేలాది మంది యువకులు ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యమంగా రూపాంతరం చెందింది. నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, ప్రభుత్వ బాధ్యత, యువత భవిష్యత్తు వంటి అంశాలపై దేశవ్యాప్తంగా పేరుకుపోయిన అసంతృప్తి ఈ నిరసనలో స్పష్టంగా కనిపించింది.
ఈ ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే అమెరికా నుంచి ఈరోజు ఢిల్లీకి చేరుకున్నారు. మొదట ఆయన అనుచరులను విమానాశ్రయానికి రావాలని పిలుపునిచ్చినా, తర్వాత భారీ జనసందోహం ఏర్పడే అవకాశం ఉందని భావించి విమానాశ్రయానికి రావద్దని కోరారు. ప్రజలకు, భద్రతా సిబ్బందికి ఇబ్బందులు కలగకూడదని ఆయన చేసిన విజ్ఞప్తి సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు వచ్చింది.
అయినప్పటికీ, ఢిల్లీ విమానాశ్రయం నుంచి జంతర్ మంతర్ వరకు భద్రతా ఏర్పాట్లు అసాధారణంగా కనిపించాయి. ఢిల్లీ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. విమానాశ్రయం నుంచి దిప్కే కదలికలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగింది. కొన్ని రోజులుగా ఆయన అరెస్టు కావచ్చనే ప్రచారం జరిగినప్పటికీ, ఆయన ఢిల్లీ చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.
మొదట సోషల్ మీడియాలో "ఇండియా గేట్ నిరసన"గా ప్రచారం జరిగినప్పటికీ, అధికారికంగా అనుమతి పొందిన ప్రదేశం జంతర్ మంతర్. ఉదయం నుంచి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ సమీపంలో యువత గుమికూడడం ప్రారంభమైంది. తరువాత వారు జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ మళ్లింపులు చేశారు. రాజధానిలోని అనేక రహదారులపై ప్రత్యేక ఆంక్షలు విధించబడ్డాయి.
ఈ సభలో ప్రధానంగా వినిపించిన డిమాండ్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనేదే. నీట్ సహా పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీలు, నియామక ప్రక్రియల్లో పారదర్శకత లేకపోవడం, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ నియామక వ్యవస్థను పారదర్శకంగా మార్చాలని డిమాండ్ చేశారు.
సభలో పాల్గొన్న యువకులు తమ చేతుల్లో జాతీయ జెండాలు, పుస్తకాలు, డాక్టర్.బీ.ఆర్. అంబేద్కర్ ఫొటోతో ఉన్న ప్లకార్డులు పట్టుకుని కనిపించారు. కొందరు బొద్దింకల ముసుగులు ధరించి వ్యంగ్య నిరసన చేపట్టారు. "మాకు ఉద్యోగాలు కావాలి", "పరీక్షల్లో న్యాయం కావాలి", "యువత చెప్పేది వినండి", "ప్రశ్నించడం నేరం కాదు" వంటి నినాదాలు వినిపించాయి. ఉద్యమ నాయకత్వం మొత్తం కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని పదేపదే పిలుపునిచ్చింది.
ఈరోజు సభకు పర్యావరణ కార్యకర్త సోను వాంగ్ చుక్ మద్దతు ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో యువత స్వరం వినిపించడం ఆరోగ్యకరమైన పరిణామమని వ్యాఖ్యానించినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి.
సభలో అభిజీత్ దిప్కే చేసిన ప్రసంగం కూడా చర్చనీయాంశమైంది. "అవసరమైతే నా స్వేచ్ఛను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని ఆయన ప్రకటించారు. సోషల్ మీడియా ఖాతాలు నిలిపివేయడం, ఒత్తిళ్లు తేవడం, విమర్శలు చేయడం ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని ఆయన అన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తి ఉద్యమం కాదని, లక్షలాది మంది యువత ఆవేదనకు ప్రతీక అని పేర్కొన్నారు.
మీడియా కవరేజీ పరంగా చూస్తే, దేశీయ మీడియా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రసారం చేసింది. కొన్ని మీడియా సంస్థలు దీనిని యువత అసంతృప్తికి ప్రతీకగా చిత్రీకరించగా, మరికొన్ని దీనిని సోషల్ మీడియా ఆధారిత వ్యంగ్య రాజకీయ ప్రయోగంగా అభివర్ణించాయి. అధికార పక్షానికి అనుకూలంగా భావించే కొన్ని వేదికలు (గోదీ మీడియా) ఉద్యమ ప్రాముఖ్యతను తగ్గించి చూపడానికి ప్రయత్నించగా, స్వతంత్ర మీడియా సంస్థలు దీనిని యువత ఆవేదన ప్రతిబింబంగా విశ్లేషించాయి.
అంతర్జాతీయ మీడియా స్పందన కూడా గమనించదగ్గది. అంతర్జాతీయ సంస్థలు ఈ ఉద్యమాన్ని ప్రత్యేక కథనాలుగా ప్రచురించాయి. సోషల్ మీడియా వ్యంగ్య ప్రచారం ఎలా వీధి నిరసనగా మారిందో అవి వివరించాయి. భారత యువతలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థపై అసంతృప్తి, రాజకీయ నిరాశ వంటి అంశాల నేపథ్యంలో ఈ ఉద్యమాన్ని విశ్లేషించాయి.
ప్రభుత్వ వర్గాలు, భారతీయ జనతా పార్టీ నాయకులు మాత్రం ఈ ఉద్యమ రాజకీయ ప్రభావాన్ని తక్కువ చేసి చూపేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ కావడం ఒకటి, వాస్తవ రాజకీయ శక్తిగా మారడం మరోటి అని పేర్కొన్నారు. అయితే రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ ఉద్యమం ఎన్నికల రాజకీయాలను వెంటనే ప్రభావితం చేయకపోయినా, యువత అసంతృప్తిని బహిర్గతం చేయడంలో విజయవంతమైంది.
ఈరోజు జంతర్ మంతర్ సభ ముగిసే సమయానికి ఒక విషయం స్పష్టమైంది. కాక్రోచ్ జనతా పార్టీ భవిష్యత్తులో రాజకీయ పార్టీగా మారుతుందా లేదా అనేది పక్కన పెడితే, యువతలో పేరుకుపోయిన ఆవేదనను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకురావడంలో మాత్రం ఇది సఫలమైంది. బొద్దింక అనే అవమానకర పదాన్ని నిరసన చిహ్నంగా మార్చి, సోషల్ మీడియా మీమ్స్‌ను వీధి ఉద్యమంగా మలిచిన ఈ ప్రయోగం భారత ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయంగా నిలవవచ్చు. జంతర్ మంతర్‌లో వినిపించిన నినాదాల వెనుక అసలు సందేశం ఒక్కటే – "యువతను వినండి, వారి భవిష్యత్తును నిర్లక్ష్యం చేయవద్దు."



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## సర్ విజయానికి బూత్‌స్థాయిలో సమన్వయంతో పనిచేయాలి




**రాజేంద్రనగర్, జూన్ 7 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ డివిజన్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం అమలుపై బీఎల్ఏ-2లు, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోల్కొండ జిల్లా ఇన్‌చార్జ్ వై. శ్రీధర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బిఎల్ఏ 1 పి. మల్లేష్ యాదవ్, జిల్లా కన్వీనర్ ఎన్. మల్లారెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ సోల్కర్ రెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయ్ కుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు రవి, సాధానంద్, బీసీ మోర్చా నాయకుడు హరికిషన్, రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సదాల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, ఓటరు జాబితాల సవరణలో బీఎల్ఏ-2ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు పూర్తి అంకితభావంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునివ్వగా, సమావేశంలో పెద్ద సంఖ్యలో బీఎల్ఏ-2లు, బూత్ స్థాయి కార్యకర్తలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బండరావిరాలలో 494 ఎకరాల డంపింగ్ యార్డ్ ప్రాజెక్ట్‌ను వెంటనే రద్దు చేయాలి

- 'జీవో 20' ఉపసంహరణ వరకు పోరాటం ఆగదు
- గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ హెచ్చరిక
- ఎమ్మెల్యే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- వాస్తవాలను దాచిపెడుతున్నారని మండిపాటు
- జీవో 20 వెంటనే రద్దు చేయాలి
- 15 గ్రామాల ప్రజల ఐక్య హెచ్చరిక
- ముఖ్యమంత్రి మౌనం వెనుక మర్మమేంటి?
- సభకు ముందు దొంగచాటుగా వచ్చిన అధికారులు ఎందుకు పారిపోయారు?
- క్రషర్ల కాలుష్యంతోనే ప్రజలు నరకయాతన
- ఇప్పుడు చెత్త డంపింగ్ యార్డా..?



అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 7 (జనం సాక్షి) : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలోని సర్వే నెంబర్ 268లో ప్రతిపాదించిన 494 ఎకరాల భారీ డంపింగ్ యార్డ్ (ఎకో టౌన్) ప్రాజెక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం బండరావిరాల సర్పంచ్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ, కోహెడ అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన సభలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.కోహెడలో జరిగిన ముఖ్యమంత్రి సభలో ఎమ్మెల్యే బండరావిరాల గ్రామం పేరు కూడా ప్రస్తావించకుండా, డంపింగ్ యార్డ్ అంశాన్ని ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంగా చిత్రీకరించడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. అధికారిక ఉత్తర్వుల ప్రకారం బండరావిరాల సర్వే నెంబర్ 268లో 494 ఎకరాల విస్తీర్ణంలో ప్రాజెక్ట్ ప్రతిపాదించబడిందని స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.నిజంగా ప్రజల సంక్షేమమే లక్ష్యమైతే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే ఈ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేయాల్సిందని సర్పంచ్ ప్రశ్నించారు. వేదికపై మాట్లాడే అవకాశం ఉన్నప్పటికీ ప్రజల ఆందోళనలను ప్రస్తావించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.“ఇంకా ఏమీ కాలేదు... ప్రజలు అధైర్యపడొద్దు” అని ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని విజయ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి సభ ప్రారంభానికి కొన్ని గంటల ముందే టీజీఐఐసీ అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించారని చెప్పారు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు వారితో మాట్లాడేందుకు వెళ్లగా, అధికారులు ప్రజలను చూసి దొడ్డి దారిలో వెళ్లిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.ప్రభుత్వం ఇప్పటికే జీవో నెంబర్ 20 జారీ చేయడంతో పాటు జపాన్‌కు చెందిన కిటాక్యుషు సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకున్న దృశ్యాలు, ఫోటోలు ప్రజల ముందే ఉన్నాయని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాజెక్ట్‌పై ఎలాంటి చర్యలు జరగలేదని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని మండిపడ్డారు.బండరావిరాల ప్రజలు ఇప్పటికే పరిసర ప్రాంతాల్లోని క్రషర్ల వల్ల తీవ్రమైన ధూళి, శబ్ద కాలుష్యాన్ని భరిస్తున్నారని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్ నగరంలోని చెత్తను తీసుకొచ్చి గ్రామ పరిసరాల్లో డంప్ చేయడం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడటమేనన్నారు.ఇంత పెద్ద వివాదాస్పద ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం వెనుక కారణం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తే తీవ్ర ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యేకు చట్టాలు, నిబంధనలపై పూర్తి అవగాహన ఉన్నందున నిజంగా ప్రజల పక్షాన ఉంటే వెంటనే జీవో నెంబర్ 20ను రద్దు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతానికి చెందిన 15 గ్రామాల ప్రజలంతా కలిసి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం గ్రామాల భవిష్యత్తును బలి చేయవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్‌తో పాటు ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, యువ నాయకులు గుండ్ల సతీష్ యాదవ్, ఏర్పుల నరేష్, ఒంగూరి రమేష్, కొత్త శ్రీకాంత్ గౌడ్, నేమురగోముల కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాసింగ్ అకాడమి కృషి అభినందనీయం

- 40 మంది అగ్నివీర్‌లుగా ఎంపిక
- బాపన్‌పల్లిలో ఘన సన్మానం



**నారాయణపేట జూన్ 7 (జనం సాక్షి) :** మల్కాసింగ్ అకాడమీ కృషి అభినందనీయమని 40 మంది అగ్నివీర్ లను దేశానికి అందించిందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్ అన్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం బాపన్ పల్లి గ్రామం లో మిల్క సింగ్ అకాడమీ - పల్లె పల్లె కు అట ఆధ్వర్యంలో మొన్న జరిగిన భారత ఆర్మీ ఎంపిక లో అకాడమీ నుండి 40 మంది అగ్నివీర్ లుగా ఎంపిక కావడం జరిగింది వీరందరిని ఆదివారం బాప న్ పల్లి గ్రామం లో గ్రామ సర్పంచ్ గవి నో ళ్ల శ్రీనివాస్ అధ్యక్ష తన జరిగిన కార్యక్రమం లో భారత అథ్లెటిక్స్ కోచ్, ద్రోణచార్య అవార్డు గ్రహీత రమేష్ చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేశారు, ఈ సందర్బంగా రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం లో యిలా అకాడమీ ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ యిచ్చి ఆర్మీ కి ఎంపిక చేయడం గొప్ప విషయం అన్నారు అదే విధంగా ఈ అకాడమీ డైరెక్టర్ కావలి మహేష్ సభ్యులు ఉదయ్ కిరణ్ లను అభినందించారు. దేశ సేవ చేయడం గొప్ప విష యం అన్నారు ఈ అకాడమీ అభివృద్ధి సహాయం అందిస్తా ను అన్నారు, అదే విధంగా ఈ కార్యక్రమం లో బాపన్ పల్లి గ్రామ సర్పంచ్. తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణ పేట్ జిల్లా అధ్యక్షులు గవి నో ళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మా గ్రామానికి ఈరోజు ఇండియా అథ్లెటిక్స్ కోచ్, ద్రోణచార్య అవార్డు గ్రహీత రమేష్ రావడం గర్వకారణం అన్నారు.రమేష్ , పుల్లెల గోపీచంద్, సానియా మీర్జా, పీవీ సింధు లకు కోచ్ గా శిక్షణ యిచ్చారన్నారు. దేశం తరపున ఓలంపిక్స్ లో పథకాలు వచ్చుటకు కృషి చేశారన్నారు. గ్రామీణ ప్రాంతం లో ఎంతో మందిని గుర్తించి వారిని క్రీడాకారు లగా తయారు చేసారనీ అన్నారు. ధన్యవాదములు తెలిపారు, మా గ్రామం లో ఈ అకాడమీ ద్వారా ఇప్పటి వరకు 100 మంది ఎంపిక కావడం జరిగిందనీ దీనికి కృషి చేసిన మహేష్, ఉదయ్ లను అభినందించారు. గ్రామీణ ప్రాంతం లో ఉన్న వారికీ శిక్షణ యిచ్చి సహా యం చేయడం గొప్ప విష యం అన్నారు, ఈ అకాడమీ కి పూర్తి సహాయం అందిస్తా మనీ అన్నారు, ఈ కార్య క్రమం లో ఈనాడు లక్ష్య సంస్థ ప్రతి నిధులు దామర్ గిద్ద సర్పంచ్ కనికి రెడ్డి,పి ఈ టి.రమణ,రఘూవేంద్ర రెడ్డి మాజి సర్పంచ్ దేశాయ్ పల్లి సత్యనారాయణ రెడ్డి, నాగేందర్, సంస్థ ఫాకల్టీ ప్రభాకర్ సార్, కృష్ణా ఆర్ ఎంపీ వైద్యులు వెంకట్రాములు, ముంకన్ పల్లి మజి సర్పంచ్ మొగుళప్ప ఆర్మీ కి ఎంపిక అయినా 40 మంది అగ్నివీర్ లు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి



**నిజాంపేట్, జూన్ 7 (జనం సాక్షి) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో అయితే చాలా కాలంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించబడటం లేదని ఈనెల జూన్ 9వ తేదీన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ (సిఐటియు )ఆధ్వర్యంలో ధర్మ నిర్వహించే కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో ఈ మేరకు ఆదివారం ధర్నా కరపత్రాలు కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే సైబరాబాద్ కార్పొరేషన్ జిహెచ్ఎంసి మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో వేలాది మంది మున్సిపల్ కార్మికులు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్సెడ్పే, డైలీవేజ్ తదితర పద్ధతుల్లో పారిశుద్ధ్యం, పార్కులు, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైటింగ్ విభాగాల్లో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, ఎలక్ట్రిషియన్లు, పంపు ఆపరేటర్స్, సూపర్వైజర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, శానిటరీ జవాన్లు, ఎఫ్ఎస్ఎలుగా పనిచేస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాల అభివృద్ధిని చెప్పుకుంటున్నారు. కానీ పట్టణ పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ప్రజా ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకంగా ఉంది. వీరి శ్రమను ప్రభుత్వం గుర్తించాలి. హైదరాబాద్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న కార్మికులందరికి జీహెచ్ఎంసీలో చెల్లిస్తున్న వేతనాలను సమానంగా చెల్లించాలని, ఢిల్లీ, హర్యాణ ప్రభుత్వాల వలే ఈ కార్పొరేషన్లలోని కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26,000/-లుగా నిర్ణయించి అమలు చేయాలని, డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ అండ్ ఈనెల జూన్ 9న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల హెడ్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలలో మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.ఈ ప్రాంతాలను సుందరీకరణగా తీర్చిదిద్దుతూ ఆహ్లాదకరమైన పార్కులు, రోడ్లు, డ్రైనేజ్, మంచినీటి సరఫరా లాంటి సౌరర్యాలను కల్పించడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర, వారి శ్రమ వెలకట్టలేనిది. కార్మికుల కృషి, శ్రమ ఫలితంగానే జాతీయ స్థాయిలో ప్రభుత్వానికి, అధికారులకు అవార్డులు, రివార్డులు వచ్చాయి. ఇంతటి అభివృద్ధిలో కీలకమైన మున్సిపల్ కార్మికుల సేవలకు ఎ గుర్తింపు లేదు. సం॥రాలు గడిచిన ఉద్యోగ భద్రత లేక, ఏ సంక్షేమం అందక అత్యంత పేదరికంలో బతుకుతున్నారు, పర్మినేంట్ లేదు, కనీస వేతనాలు అమలు కావు, పనిచేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగి మరణించిన కార్మికులకు మట్టి ఖర్చులు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులిపేసుకుంటున్నది. ప్రభుత్వ విధానాల వలన మున్సిపల్ కార్మికుల బతుకులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ నాయకులు పెంటయ్య, చెన్నయ్య, బాలస్వామి,ఈశ్వరయ్య, మద్దిలేటి నరసింహ, శీను, లక్ష్మి, లింగమ్మ, నాగలక్ష్మి, అలివేలు, నరసింహ, అంజి, మనీ, లక్ష్మి, నాగరాజు సిఐటియు నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా సాగుతున్న నెట్టెంపాడు 100 ప్యాకేజీ పనులు

- వానకాలం పంటలకు సాగునీరు లక్ష్యం



**ఇటిక్యాల, జూన్ 7 (జనంసాక్షి) :** వానకాలం పంటలకు సాగునీరు అందించాలని లక్ష్యంతో రెట్టింపు 100 ప్యాకేజీ కాలువ పనులు చురుకుగా సాగుతున్నాయి. 36 కిలోమీటర్ల నుంచి 70 కిలోమీటర్ల వరకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో సంబంధిత అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్ర ధాన కాలువ పనులు పూర్తికాగా గత కొన్ని నెలల నుంచి పనులు ఆగిపోవడంతో ప్రధాన కాలువలను, డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో ముళ్లపొదలు పెరిగిపోవడం అడ్డంకిగా మారింది. ప్రధానంగా కొండపల్లి దగ్గర పనుల జాప్యం కావడం, ఆలస్యానికి కారణమైంది. ఈసారి పెండింగ్ పనులు, సేల్ట్ పనులు చేసి సాగునీరు అందించాలని లక్ష్యంతో కొండపల్లి నుంచి వెంకటాపురం వరకు 40 కిలోమీటర్ల పరిధిలో పనులు చేసింది గాను ప్రభుత్వం రూ.67 కోట్లు మంజూరు చేయడం జరిగిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఇటిక్యాల మండల పరిధిలో గోపాలదిన్నె శివారు నుంచి షాబాద్ వరకు పది కిలోమీటర్ల పరిధిలో పనులు చురుకుగా సాగుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. కాలువలో పెరిగిన ముళ్ళపొదలు, రాళ్ల తొలగింపు పనులు జరుగుతున్నాయి. ప్రధాన కాలువ వెంట ఉండే మట్టిని కొందరు ట్రాక్టర్ల ద్వారా సొంత పనులకు వాడుకోవడంతో మట్టి లేకుండా పోయిందని కాంట్రాక్టర్లు తెలుపుతున్నారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పనులు చేపడుతున్నాం

గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నుంచి వచ్చే వర్షాకాలం నాటికి 100 ప్యాకేజీ పరిధిలోని పంటలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పెండింగ్ పనులు చేపడుతున్నాం. ఇప్పటికే సగం వరకు పూర్తయ్యాయి. ప్యాకేజీల వారీగా పనులు జరుగుతున్నాయి. వానకాలం నాటికి పూర్తి చేసి సాగునీరు అందించే లక్ష్యంతో పనులు చేపడుతున్నాం.

**పరమేశ్వర్, డీఈ**

## బూత్‌స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్



**మహేశ్వరం, జూన్ 7 (జనంసాక్షి) :** బీజేపీ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు.ఆదివారం మహేశ్వరం మండలం బీజేపీ అధ్యక్షుడు యాదిష్ అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా అందెల శ్రీరాములు యాదవ్,బొక్క నర్సింహ రెడ్డి, బీజేపీ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. యువత, మహిళలు, నూతన కార్యకర్తలను పార్టీ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలన్నారు.సోషల్ మీడియా వేదికల ద్వారా పార్టీ సిద్ధాంతాలు,ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాపయ్య గౌడ్, కడారి జంగయ్య యాదవ్, దేవేందర్ రెడ్డి, మిద్దె సుదర్శన్ రెడ్డి, అనంతయ్య గౌడ్, పోతర్ల సుదర్శన్ యాదవ్,పంతు నాయక్,పాండు నాయక్, మాధవచారి, వెంకటేష్ గౌడ్, కుందే కుమార్, అంబోజి శ్రీనివాస్, వనంపల్లి శ్రావణ్, ఉపేందర్, మోతే యాదయ్య, పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీరన్నగుట్టను అద్భుతమైన దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దుతా..

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, జూన్ 7 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్, ప్రస్తుత లెక్చరర్స్ కాలనీ పరిధిలోని వీరన్నగుట్ట భద్రకాళి రామ లింగేశ్వరస్వామి క్షేత్రం అభివృద్ధి పనులపై భారస యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లోని దాదాపు పది నుండి పన్నెండు కాలనీల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొని, క్షేత్ర అభివృద్ధికి, కాలనీ సమస్యలపై సంబంధించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. కాలనీ లో పలు సమస్యలు, ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, రహదారులు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్ దీపాలు, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చించారు. కొన్ని కాలనీల లో రోడ్లు, డ్రైన్స్,మంచినీటి వ్యవస్థ మెరుగుపరచాలని కోరారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలని అభివృద్ధిలో భాగంగా కాలనీ అసోసియేషన్ పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. మొదటగా భూగర్భ వ్యవస్థ పూర్తి అయ్యాక మిగిలిన అభివృద్ధి కార్యక్రమలు చేయడం జరుగుతుందని అన్నారు. దానిలో భాగంగా ముందుగా ట్రంక్ లైన్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొన్ని కాలనీల లో నూతన డ్రైన్స్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో కొంత ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అధికారులకు మీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అతి త్వరలోనే అన్ని కాలనీవాసులకు డ్రైన్స్, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశాక రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని హామీ ఇచ్చారు. వీరన్నగుట్ట క్షేత్రం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన పుణ్యక్షేత్రమని, భక్తులకు అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. దాదాపు పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ దేవాలయం నందు గతంలో అప్పటి దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ని పిలిపించి దేవాలయ అభివృద్ధికి దాదాపు 18 కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది. దానిలో భాగంగా మొదటి విడతగా అయిదు కోట్ల రూపాయలతో దేవాలయం చుట్టు కాంపౌండ్ వాల్ నిర్మించాము. ప్రస్తుతం దేవాలయ అభివృద్ధి మందకోడిగా సాగుతున్న నేపథ్యంలో దేవాలయం అభివృద్ధి విషయంలో ఎలాంటి వెనకడుగు వేసేది లేదని పేర్కొన్నారు. ఆరు నూరైనా దేవాలయం అభివృద్ధి విషయంలో వీరన్నగుట్టను అద్భుతమైన దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో క్షేత్ర అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, చెన్నగోని శ్రీధర్ గౌడ్, నక్కరవీందర్ గౌడ్, కళ్లెం రవీందర్ రెడ్డి, శంకర్ రెడ్డి, సింగిరెడ్డి మల్లీశ్వరిరెడ్డి, ధనలక్ష్మి, రమేష్ గౌడ్, కాలనీవాసులు నాగభూషణం, యాదగిరి, సీతారాం, సీమ సోమనాథ్, వెంకన్న, సత్యం, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, రఘునాథరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక స్వావలంబన వైపు హైదరాబాద్ మహిళలు

- విజయవంతంగా ముగిసిన 'ఆర్‌బీ ఫర్ ఉమెన్' 15వ ఎడిషన్



**ఖైరతాబాద్, జూన్ 7 (జనం సాక్షి) :** మహిళా సాధికారత, స్వేచ్ఛాయుత రవాణాను ప్రోత్సహిం చే లక్ష్యంతో రాయల్ బ్రదర్స్, ఎంబీఎస్ఐ మోటో బిజినెస్ సర్వీస్ ఇండియా-యమహా మోటార్ కంపెనీ జపాన్ అనుబంధ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'ఆర్‌బీ ఫర్ ఉమెన్' 15వ ఎడిషన్ విజయవంతంగా ముగిసింది. పిట్‌స్టాప్ గోకార్టింగ్ జోన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100 మందికిపైగా మహిళలు పాల్గొని స్కూటర్లు, గేర్ బైక్‌ల నిర్వహణ, రహదారి భద్రతపై ప్రాయోగిక శిక్షణ పొందారు. గత నాలుగేళ్లలో వెయ్యికిపైగా మహిళలకు శిక్షణ అందించిన ఈ కార్యక్రమం మహిళల్లో ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాయల్ బ్రదర్స్ సహవ్యవస్థాపకుడు, సీఈవో అభిషేక్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు చూపిన ఉత్సాహం తమకు ప్రేరణనిచ్చిందని, సురక్షిత రవాణా అవకాశాలను మరింత విస్తరించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఎంబీఎస్ఐ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ కొబయాషి మసహారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం మహిళలు తమపై ఉన్న పరిమితులను అధిగమించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వేదికగా నిలుస్తోందన్నారు. గిగ్ ఎకానమీ, లాజిస్టిక్స్, లాస్ట్‌మైల్ డెలివరీ వంటి రంగాల్లో మహిళలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

# బడి బస్సులు భద్రమేనా..?



- నిబంధనలను పాటించని యాజమాన్యాలు
- ఫీజులు అధికం..వసతులు అధ్వానం
- తనిఖీల్లో వెలుగులోకి వచ్చినా చర్యలు శూన్యం
- ఫిట్‌నెస్‌కు దూరంగా బడి బస్సులు
- తూతూ మంత్రంగానే నిబంధనలు అమలు
- నిర్లక్ష్యంతో చిన్నారుల ప్రాణాలతో చెలగాటం

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 7 (జనం సాక్షి) :** జిల్లాలో పాఠశాలల బస్సులు చాలా వరకూ నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్సు ముందు విద్యా సంస్థల పేరు, ఫోన్ నెంబరు సహా పూర్తి చిరునామా స్పష్టంగా కనిపించేలా రాయాలి. ఈ నిబంధనలను చాలా యాజమాన్యాలు పెద్దగా పట్టించుకోవడంలేదు. బస్సుడ్రైవర్ గా పనిచేసే వ్యక్తి వయస్సు 60 ఏళ్లకు మించ కూడదు. డ్రైవర్ ఆరోగ్య పట్టికను నిర్వహించాలి. రక్తపో టు, మధుమేహం, కంటి పరీక్షలు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు ప్రతి మూడునెలలకోసారి యాజమాన్యాలే చేయించాలి. ఆ రికార్డును జాగ్రత్తగా భద్రపరచాలి. ఈ నిబంధనను పాటిస్తున్న యాజమాన్యాలను వేళ్ల మీద లెక్కించవచ్చు. కొందరు మద్యం తాగి బస్సు నడిపిన సందర్భాలున్నాయి. ఈమధ్య న్యాల్కల్ మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ప్రమాదానికి గురైంది. డ్రైవర్‌ను నియమించేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, నిజానిజాలను తెలుసుకునేందుకు ఆర్టీఏ కార్యాలయాన్ని సంప్రదించాలి. ఇది ఎక్కడా అమలు కావడంలేదు. బస్సుకు సంబంధించిన బాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, వైపర్స్ లైటింగ్ తదితర భాగాల పరిస్థితిని, పనిచేసే తీరును తెలుసుకునేందుకు నెలకోసారి ప్రిన్సిపల్, తల్లిదండ్రుల కమిటీ బస్సును తనిఖీ చేయాలి. ఈ వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలి. ఈ నిబంధనలు ఉన్నాయని చాలావరకూ తల్లి దండ్రుల కమిటీలకే తెలియదు. ఫిర్యాదుల పుస్తకాలన్నీ ప్రతి వాహనంలోనూ అందుబాటులో ఉంచాలి. అందులో నమోదు చేసిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలి. ఇందుకు ప్రతీ నెలకోసారి పాఠశాల ప్రిన్సిపల్ పుస్తకాన్ని తనిఖీ చేయాలి. బస్సుల పార్కింగ్ కోసం విద్యాసంస్థ ఆవరణలోనే స్థలం కేటాయించాలి. జిల్లాలో చాలా పాఠశాలలకు మైదానాలే లేవు. దీంతో రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. బస్సుల్లో నిర్వహణా లోపాలు బాహాటంగానే కనిపిస్తున్నాయి. చిన్నారులు కూర్చున్న చోట కిటికీలకు అద్దాలు, గ్రిల్స్ లేకపోవడం వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బస్సుల్లో పిల్లలు ఎక్కేందుకు మెట్లు కూడా అనుగుణంగా ఉండడంలేదు. ప్రథమ చికిత్స పెట్టెలను విస్మరిస్తున్నారు. అనుభవం లేని డ్రైవర్లు, పరిమితి మించి విద్యార్థులను ఎక్కించడం కూడా ప్రమాదాలకు తావిస్తోంది. ప్రైవేటు విద్యాసంస్థల్లోని బస్సులను ఎప్పటికప్పుడు ఫిట్నెస్‌గా ఉంచాలని, పిల్లలను ప్రమాదాల బారిన పడకుండా రక్షించాల్సిన బాధ్యత ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలదేనని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

### నిబంధనలు పాటించని యాజమాన్యాలు..

విద్యా సంస్థల యాజమాన్యాలు బస్సుల నిబంధనలు పాటించకుండానే నడుపుతున్న వైనం విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసినా సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు శూన్యమంటున్నారు ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు. విద్యార్థుల నుంచి ప్రైవేట్ విద్యా సంస్థలు ముక్కుపిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ఆ మేర సౌకర్యాలు కల్పించే విషయంలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్సులో సీట్లకు మించి విద్యార్థులను ఎక్కించడంతో పాటు సరైన కండిషన్ లేకపోవడం ఆ బస్సులు ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి ఉందంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం నాలుగు రోజుల పాటు మొక్కుబడిగా పాలకులు, అధికారులు హడావుడి చేయడమే తప్ప ఆ తర్వాత నిబంధనలు పాటించని స్కూల్ బస్సు యాజమాన్యా లపై చట్టపరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపిం చడం లేదు.

### కాలం చెల్లిన బస్సులకు పైపై మెరుగులు

జిల్లాలోని అనేక విద్యాసంస్థలు కళాశాల, పాఠశాలల్లో అధికబాగం కాలం చెల్లిన బస్సులే ఎక్కువ ఉన్నట్లు సమాచారం. కొన్ని విద్యాసంస్థలు కాలం చెల్లిన బస్సులకు పైపై మెరుగులు దిద్ది నడుపుతున్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎక్కువ భాగం 15 ఏళ్లు దాటినవే. అయినా వాటికి మరింత గడువు తీసుకోని నడుపుతున్నారని తెలుస్తోంది. చాలా పాఠశాలలు విద్యార్థుల రవాణాకు వాడుతున్న బస్సులను సెకండ్ హాండ్ లో తక్కువ ధరకు కొన్నవే. వీటిలో ఎక్కువ ఢిల్లీ, హైదరబాద్, బెంగుళూరు, కలకత్త, విజయవాడ, తిరుపతి నుంచి తీసుకువచ్చినవే. ఇందులో అధికబాగం ఢిల్లీ నుంచి తెచ్చినవే. సాదారణంగా ఢిల్లీలో 15 ఏండ్లు దాటిన బస్సులను రోడ్లమీద నడపడానికి అక్కడి ఆర్టీఏ అధికారులు అనుమతించరు. దీంతో వేలం వేసిన ఈ బస్సులను ఇక్కడి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్టు సమాచారం.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



**అల్లాదుర్గం, జూన్ 7 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి అన్నారు. ఆదివారం అల్లాదుర్గం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.13 43,500 విలువ గల సిఎం రీలీఫ్ ఫండ్ చెక్కులను వారికి అందజేశారు. పార్టీలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని శేషారెడ్డి అన్నారు. కార్యక్రమంలో డి సీసీ ప్రధాన కార్యదర్శి బాలకిషన్,జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు బలరాం,సర్పంచులు మన్య నాయక్, శంకర్ నాయక్ ,శశిధర్ రెడ్డి ,వీరప్ప ,శ్రీనివాస్ రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు బాలరాజ్ , సురేష్ గుప్త , శ్రీ కాంత్, ఆంజనేయులు ,అంజాగౌడ్, జైపాల్ , పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సైకిల్ ను వినియోగించాలి



**గద్వాల నడిగడ్డ, జూన్ 7 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు తక్కువ దూరాలకు వెళ్లే సమయంలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులుగా సైకిల్ వినియోగించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ఆదివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా నిర్వహించిన "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమంను గద్వాల ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగ్ రావు ఇండోర్ స్టేడియం వద్ద జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం సైకిల్ ర్యాలీ ఇండోర్ స్టేడియం నుండి ప్రారంభమై పాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి ఇండోర్ స్టేడియం వరకు సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో సైక్లింగ్ మరియు వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం మరియు ఫిట్ ఇండియా ఉద్యమం లక్ష్యాలను ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, కరాటే కోచ్ శ్రీహరి, ఫుట్‌బాల్ కోచ్ విజయ్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు,యువత, క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం తగదు

- డాక్టర్ ప్రేమ్ కుమార్



**గద్వాల నడిగడ్డ, జూన్ 7 (జనం సాక్షి) :** గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం గా వ్యవహరించి ఒక నిండు ప్రాణం బలితిసుకున్న వ్యవహారం పై సామజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రవల్లికి చెందిన యువతి కడుపునొప్పితో హాస్పిటల్ లో జాయిన్ ఐతే అపెండిక్స్ ఆపరేషన్ వికటింటించి యువతి మృతి చెందటన్ని డాక్టర్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును తప్పుబట్టారు.ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న యువతి అకస్మాత్తు గా ఎలా మృతి చెందిందని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ , ప్రజా ప్రతినిధిలు స్పందించి తక్షణమే భాదిత కుటుంబాన్నీ ఆదుకోవాలని 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియేశారు.

# జూన్ 20న జాతీయ లోక్ అదాలత్

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



**గద్వాల నడిగడ్డ, జూన్ 7 (జనం సాక్షి) :** జిల్లా ప్రజలకు సత్వర, సులభ, తక్కువ ఖర్చుతో కూడిన న్యాయ పరిష్కారం అందించేందుకు జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులు, ట్రాఫిక్ చలానాలు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, సివిల్ వివాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం పొందడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా ముగించేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదికగా నిలుస్తుందని అన్నారు. ప్రజలు తమ కేసులకు సంబంధించిన వివరాలను సంబంధిత కోర్టులు, న్యాయవాదులు లేదా పోలీసు అధికారులను సంప్రదించి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అవగాహనతో తమ వివాదాలను ముగించుకోవాలని ఎస్పీ కోరారు.

## క్రేజీ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభం

- చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు, జూన్ 7 (జనం సాక్షి) :** పట్టణంలోని చిన్నారి బాల బాలికలకు నాణ్యమైన, విద్యను అందించేందుకు 'క్రేజీ కిడ్స్ ప్లే వే స్కూల్' ఎంతగానో దోహదపడుతుందని స్థానిక మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం పెబ్బేరు పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రేజీ కిడ్స్ ప్లే వే స్కూల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... నేటి ఆధునిక కాలంలో పిల్లలకు కేవలం పుస్తక పఠనమే కాకుండా, ఆటపాటలతో కూడిన విద్యాబోధన ఎంతో అవసరమన్నారు. చిన్న వయసులోనే పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి ప్లే స్కూల్స్ చక్కని వేదికలని కొనియాడారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కూల్ నిర్వాహకులు పిల్లలకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ, సురక్షితమైన వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. ఆధునిక పద్ధతుల్లో, డిజిటల్ స్క్రీన్స్ మరియు ఆట వస్తువులతో కూడిన తరగతి గదులను చైర్మన్ పరిశీలించి అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ బీరం గీతా రాజశేఖర్ రెడ్డిని సన్మానించారు. కరస్పాండెంట్ బీరం గీతా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్రేజీ కిడ్స్ ప్లే వే స్కూల్ ప్రారంభోత్సవానికి విచ్చేసి తమను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ జములమ్మ, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, శేరుపల్లి సర్పంచ్ వెంకటయ్య యాదవ్, రణధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ట్రాఫిక్ సమస్యకు మహర్దశ
- వచ్చే ఆదివారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వనపర్తి సంత
- వ్యాపారస్తులకు అవగాహన కల్పించిన
- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి టౌన్, జూన్ 7 (జనంసాక్షి) :** కొన్ని దశాబ్దాల కాలం నుంచి వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రతినిత్యం ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్న ప్రజలకు వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఊరట కల్పించింది. జిల్లా కేంద్రంలోని శంకర్ గంజ్, కమాన్ చౌరస్తా, ఎన్టీఆర్ విగ్రహం వరకు ఎన్నో సంవత్సరాల నుంచి ప్రతి వారాంతపు సంత ఆదివారం కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసినప్పటికీ ఆ ప్రాంతంలో సంత జరగడం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు రద్దీగా ప్రజలు రాకపోకలు కొనసాగించలేని పరిస్థితులు ఎదుర్కొంటున్న సందర్భంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచనలు ఆదేశాల మేరకు వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ ఏది ఏమైనా గత కొన్ని సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి తెచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలోనీ పాత వ్యవసాయ మార్కెట్ యాడ్ సమీపంలో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మార్కెట్ ఇటీవల అందుబాటులోకి తెస్తూ పారదర్శకంగా టెండర్ల ద్వారా వ్యాపారస్తులకు షాపులను కేటాయించారు. ప్రతి ఆదివారం జరిగే సంత లో కూరగాయల వ్యాపారస్తులు ఇతర వ్యాపారస్తులు పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న సందర్భంగా ఈరోజు గాంధీ చౌరస్తా, కమాన్, ఎన్టీఆర్ విగ్రహం, శంకర్ గంజ్ తదితర ప్రాంతాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు వనపర్తి టౌన్ ఎస్ఐ హరిప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ వనపర్తి టౌన్ ప్లానింగ్ అధికారి సుమన్, సంతలో పర్యటించి వ్యాపారస్తులకు సూచనలు సలహాలు ఇస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు వచ్చే ఆదివారం జరిగే సంత ఇప్పటినుంచి వనపర్తి కొత్త బస్టాండ్ పాత మార్కెట్ యార్డ్ పక్కల నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌లో కూరగాయల సంత ఇతర వ్యాపారస్తులు జరుపుకోవాలని



సూచించారు. అంతేకాక వనపర్తి జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీల ప్రజలు కొత్త కాలనీల ప్రజలు వచ్చే ఆదివారం నుంచి వారాంతపు సంత ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ దగ్గర జరుపుకోవాలని చైర్మన్ సూచించారు.ఈ విషయం ప్రతి ఒక్కరు గమనించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో వారాంతపు ఆదివారం సంత పెట్టుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

## పత్తి విత్తనాలు ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

- తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**బిజినేపల్లి, జూన్ 7 (జనం సాక్షి) :** పంట పొలంలోకి అక్రమంగా ప్రవేశించి పత్తి విత్తనాలు ధ్వంసం చేసి తన పైన తన కుటుంబం పైన దాడికి పాల్పడిన వ్యక్తుల పైన చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ నాయక్ అనే వ్యక్తి ఆదివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు మండల పరిధిలోని వట్టెం గ్రామపంచాయతీ పరిధిలో గల కల్వకుంట తండాకు చెందిన పాత్యావత్ లక్ష్మణ్ నాయక్ జాత్రు అనే వ్యక్తులు వట్టెం శివారులోని 123 సర్వే నెంబర్లు 39 గుంటల భూమి తమ పేరు మీద రిజిస్టర్ అయి ఉన్నదని అట్టి భూమిలో గత రెండు సంవత్సరాలుగా వారే మోక మీద ఉంటూ పంటను సాగు చేశారని ఇదే క్రమంలో శనివారం ఉదయం తమ పొలంలో పత్తి విత్తనాలను నాటుతున్న క్రమంలో తమ పొలంలోకి అక్రమంగా ప్రవేశించిన పాత్యావత్ రాజు పాత్యావత్ రవి అదేవిధంగా శత్రు అనే ముగ్గురు వ్యక్తులు అకారణంగా మా పంట విత్తనాలను ధ్వంసం చేసి మాపై దాడి చేసినారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు రాజు అనే వ్యక్తి రైస్ మిల్లు నిర్మాణం చేస్తున్నాడని రైస్ మిల్లుకు అడ్డుగా తన పొలం వస్తుందని ఎలాగైనా తన పొలాన్ని లాక్కోవాలని దురుద్దేశంతో మాపై దుర్గ ప్రవర్తించి దౌర్జన్యానికి పాల్పడ్డాడని బాధితుడు వాపోయాడు గ్రామ పెద్దల సమక్షంలో మాకు భూమిని కొలిచిహద్దులు ఏర్పాటు చేసి ఇచ్చిన భూమిలోనే సాగు చేసుకుంటున్నామని అడ్డురాలను సైతం దౌర్జన్యంగా కూలగొట్టి మాపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

# టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

- సంగారెడ్డిలో ఫిక్సింగ్ రాజకీయాలు మానుకోండి
- సంగారెడ్డి ఒక చరిత్ర గల ఉద్యమ గడ్డ
- ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాళ్లతో కొట్టండి
- టిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**సంగారెడ్డి టౌన్, జూన్ 7 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సమితి రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఉచిత వైద్యం ఉచిత విద్య, యువతి యువకులకు ఏకధాటిగా 4 లక్షల ఉద్యోగాలు, వ్యవసాయ సంక్షేమ పథకాలు, ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ అభ్యున్నతకై పాటుపడతామని టిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం టిఆర్ఎస్ జండా పండుగ ఆవిష్కరణ, కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి టిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా ఉద్యమ గడ్డ అని సంగారెడ్డికి ఒక చరిత్ర ఉందని అన్నారు. టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే పాంచ జన్యం పేరుతో ఉచిత వైద్యం, విద్య వ్యవసాయ పథకాలు ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ నిధులు, యువతి యువకులకు 4 లక్షల ఏకధాటి ఉద్యోగాలు, రెండు లక్ష ల నుండి 20 కోట్ల వరకు బ్యాంకు సంబంధం లేకుండా సహాయం అందిస్తామని, సామాజిక న్యాయం పాటిస్తామని కవిత హామీ ఇచ్చారు. ప్రైవేట్లో ఫీజుల మోత, సర్కారు బడుల్లో ఉపాధ్యాయుడు ఉంటే బడి ఉండదు, బడి ఉంటే ఉపాధ్యాయుడు ఉండదని, సర్కారు దవాఖాన్లలో సోది ఉంటే దూది ఉండదని, దూది ఉంటే సూది ఉండదని పేర్కొన్నారు. పేదవాడికి వైద్యం అందనంత దూరానికి వెళ్లింది అని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఒక అమ్మకి తన పిల్లలు పడే కష్టం తెలుస్తుందని. నేను ఇచ్చిన మాట తప్పితే తెల్లాపూర్ శిలాశాసనం వద్ద కట్టేసి రాళ్లతో కొట్టండి అని కవిత సవాల్ విసిరారు.

### ఫిక్సింగ్ రాజకీయాలు మానుకోండి

సంగారెడ్డి ఫిక్సింగ్ రాజకీయాలని కవిత తీవ్ర విమర్శలు చేశారు. జగ్గారెడ్డి, హరీష్ రావు, దామోదర్, చింతా ప్రభాకర్, రఘునందన్రావులు చూడడానికి వేరువేరు పార్టీలలో ఉన్నా అందరూ ఒకటేనిని, 30 ఏళ్లుగా ఇక్కడ రాజ్యమేలుతున్న రాజకీయ పార్టీలు ఏం చేశాయో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం. సింగూరు ప్రాజెక్టు 15 సంవత్సరాలుగా కుంగిపోతోందని, హైదరాబాద్ నీరు అందిస్తూ 60 వేల ఎకరాలకు నీరు అందించే



ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదని, తెలంగాణ మొట్టమొదటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీష్ రావు ఇక్కడ నుండే ప్రాతినిధ్యం వహిస్తున్నా పట్టించుకోలేదు అని ఆరోపించారు. దామోదర రాజనర్సింహ బావమరిది 200 ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ కు బుల్లెట్ ట్రైన్ ఇస్తామని ప్రకటించిన కేంద్రం ఇప్పుడు డీపీఆర్లో ఆ ఊసే లేదని అన్నారు. రఘునందన్ రావు ఎందుకు మౌనం పాటిస్తున్నారని అన్నారు. ఇతర పార్టీలు సైతం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో దయాకర్ రెడ్డి, సంఘమిత్ర, శ్రీనివాస్ రెడ్డి, శివశంకర్ పాటిల్ , కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు





- ఉదయం నుంచి క్యూ కట్టిన రైతులు..

**బజార్‌హత్నూర్/ ఇచ్చోడ, జూన్ 07 (జనంసాక్షి) :** యూరియా బస్తాల కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలంలోని కోరమండల్ వద్ద ఆదివారం తెల్లవారుజామున నుండి యూరియా ఫర్టిలైజర్ ఆప్‌లో బుక్ చేసినప్పటికీగాను కోరమండల్ సిబ్బంది వెరిఫికేషన్ చేసి టోకెన్లు ప్రాసెసింగ్‌లో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. కోరమండల్ అధికారి రంజిత్..వివరాలు అడగగా రెండు రోజుల క్రితం 2200 యూరియా బస్తాల లోడ్ గోదాం చేరిందని తెలిపారు అలాగే ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఎవరైనా బుక్ చేసిన వారికి వెరిఫికేషన్ ప్రాసెస్ ద్వారా గుర్తించి వారికి యాప్ లో ఎన్ని కేటాయించారు చూచి అన్ని జారీ చేస్తున్నామని తెలిపారు.

**కొకస్ మన్నూర్ యువరైతు..**

ఇచ్చోడ మండలం లోని కొకస్ మన్నూర్ గ్రామానికి చెందిన లండిగే మారుతి అను వ్యక్తి కి 5 ఎకరాల భూమి ఉండి దానికి యాప్ ద్వారా బుకింగ్ చేయగా 5 యూరియా బస్తాలు బుకింగ్ అయ్యాయని వాటికోసం పొలం పనులు పక్కనపెట్టి గత రెండు రోజులుగా బస్తాల కోసం తిరుగుతున్నానని ఎవరైతే తన బాధను వ్యక్తం చేశాడు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రైతులకు ఎలాంటి తిప్పలు లేకుండా పరిష్కారం చూపాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



## ప్రతి గింజను కొనుగోలు చేయాలి

- రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఇంకెప్పుడు కొంటారని మాజీ మంత్రి ఎర్రబెల్లి ధ్వజం

**పాలకుర్తి, జూన్ 07(జనం సాక్షి) :** కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఈరవెన్నులో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల నుంచి ఈరవెన్ను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయలేక జాప్యం చేస్తున్నారని విమర్శించారు. వర్షాకాలం ప్రారంభమైందని అకాల వర్షం కురిస్తే రైతుల కష్టం నీటిపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకుండా పాలన చేస్తోందని అన్నారు. రైతు బందులేదు. పండిన పంటకు మద్దతు ధర ఇవ్వకుండా రైతు వ్యతిరేక ప్రభుత్వంలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే దాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు పసునూరి నవీన్, నల్ల నాగిరెడ్డి, ముస్కు రాంబాబు, కత్తి సైదులు, మాచెర్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారం అందుకున్న నిర్మల్ కవి డా. బి. వెంకట్



**నిర్మల్ టౌన్, జూన్7 (జనంసాక్షి) :** ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, సంస్కృత భాషా ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా. బి. వెంకట్ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేం ద్రవరంలో ఆదివారం నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో చైతన్య సారస్వత పరిషత్, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మహాసభల్లో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. తెలుగు భాషా వైభవంపై పద్యపఠనం, సాహిత్య సేవలు, మహాసభల నిర్వహణలో సమన్వయకర్తగా చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా సాహితీవేత్తలు, ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ ప్రతినిధులు డా. వెంకట్‌ను అభినందించారు.





## పేదలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య

**గోవిందరావుపేట, జూన్ 7 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను విస్మరిస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అన్నారు. మండలంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారులు వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కి ఈరోజు హామీలను తుంగలో తొక్కుతున్న పరిస్థితులు కనబడుతుంది. అందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ ఇస్తానని ఆచరణలో ఎలాంటి హామీలను నెరవేర్చలేదు. అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను విస్మరిస్తే భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం చేస్తామని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా ములుగు జిల్లాలో భూ పోరాటాలు ఉధృతం చేయాలని అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసి గిరిజనులకు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఇంటి స్థలాలకు ఉత్సవాసులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వ భూములపై ఎర్రజెండాలు ఎగురవేసి విస్తృతంగా భూ పోరాటాలు నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగింది ములుగు ఏజెన్సీ ప్రాంతంలో గిజిరేతర పేదలకు కాస్త కబ్జాలో ఉన్న రైతులకు ప్రభుత్వపరంగా కనీసం పహాని అన్న మంజూరు చేయాలని అదేవిధంగా ప్రభుత్వం పేదలకు ఇస్తానన్న సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని ఇందిరమ్మ ఇండ్లు గ్రామసభల ద్వారానే మంజూరు చేసి పారదర్శకంగా ప్రభుత్వం నడవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం ములుగు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.


## రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సోమనర్సయ్య మృతి



- నివాళులు అర్పించిన మాజీ మంత్రి దయాకర్ రావు

**పాలకుర్తి, జూన్ 07(జనంసాక్షి) :** మండలంలోని వావిలాలకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గంటా సోమనర్సయ్య (80) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సందర్శించి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణకు మారుపేరుగా సోమనర్సయ్య నిలిచారని అన్నారు. అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిని సోమనర్సయ్య సేవలు మరువలేనివని అన్నారు. ఆయన మృతి తీరనిలోటన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు. కుమారులు గంటా భాస్కర్, గంట రవీందర్, గంట శ్యామ్ లను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పసునూరి నవీన్, నల్ల నాగిరెడ్డి, మాచర్ల ఎల్లయ్య, కారు పోతుల.వేణు, మాంకాలి శ్రీనివాస్, నల్లపు అశోక్. పాము శ్రీనివాస్. కుమార్, శీల లింగయ్య, ఉపాధ్యాయులు సందర్శించి నివాళ్లర్పించారు.

## ఆహార భద్రతా నిబంధనలు పాటించాలి



- జిల్లా ఆహార భద్రత అధికారి జి.మహేష్

**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 7 (జనంసాక్షి) :** జిల్లాలోని హోటళ్ళు, స్వీట్ షాపులు, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఆహార సంబంధిత వ్యాపార నిర్వహకులు ఆహార భద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారి జి.మహేష్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హోటల్ లో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా హోటళ్ళు, స్వీట్ షాపులు, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆహార భద్రత శాఖ డిజిగ్నేటెడ్ అధికారి బి. వాసు రామ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి మాట్లాడుతూ... ఆహార సంబంధిత వ్యాపారం చేసే వారందరూ భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార ఉత్పత్తులను తయారు చేయకూడదని, ఆహార ఉత్పత్తుల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, తాజా నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం జరిగిందని, ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని తెలిపారు. ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో సంస్థల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 65 మంది ఎఫ్ బి ఓ లు, జిల్లా కేంద్రంలోని హోటళ్ళు, స్వీట్ షాపులు, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## గిరిజన హాస్టల్స్ వర్కర్లు కొమురం భీం పోరాట స్ఫూర్తితో వర్కర్ల హక్కుల కోసం ఉద్యమించాలి



- సీఐటీయూ జిల్లా జాయింట్ సెక్రెటరీ వెలిశాల క్రిష్ణమాచారి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 07(జనంసాక్షి):** తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్ డైలీవేజ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు కెరమెరి మండలం కమిటీ సమావేశం ఈరోజు మండల కేంద్రం హట్టి పాఠశాలలో ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుష్ప అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ కొమరం భీమ్ వారసులైన గిరిజన హాస్టల్ వర్కర్లు కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో వర్కర్ల సమస్యలపై పోరాడి హక్కులు సాధించాలని అన్నారు. వర్కర్లకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గారు 44 రోజుల సమ్మె సందర్భంగా హాస్టల్స్ డైలీవేజ్, ఔట్సోర్సింగ్ పార్ట్ టైం, కాంటిజెంట్ వర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం టైమ్ స్కేల్ వేతనాలు వెంటనే చెల్లించాలని 5 సంవత్సరాల సర్వీసు ఉన్న వర్కర్సుని పర్మినెంట్ చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్ డైలీవేజ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు జంగుబాయి, సురేఖ,సంపత్, బిజులబాయి, లక్ష్మీ, జారుబాయి,లలిత తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మగూడలో కార్డన్ అండ్ సెర్చ్




- ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్

**బజార్‌హత్నూర్ / ఇచ్చోడ, జూన్ 07 (జనం సాక్షి):** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ఎల్లమ్మగూడ గ్రామంలో ఆదివారం రోజు ఉదయం 5 గంటలకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించినట్లు ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 47 వాహనాలను తనిఖీ చేయడం జరిగిందని అందులో 45 ద్విచక్ర వాహనాలు రెండు ఆటోలు ఉన్నట్లు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలను తాత్కాలికంగా సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అక్రమంగా నిలువ ఉంచిన రూ.10 వేల విలువ గల కలపను స్వాధీనం చేసుకుని, షేక్ రషీద్ తండ్రి అబ్దుల్ ఖాదర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాలను నివారించుకోవాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాల్లో నేర నియంత్రణ, భద్రత కోసం ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్ర తల పరిరక్షణ సాధ్యమవుతుందని, పోలీసు-ప్రజల సమన్వ యంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ ఎస్సై విక్రం, ఎస్సై లీలాకృష్ణ, ఇచ్చోడ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఏఆర్ ఫోర్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన డాక్టర్ చేపూరి వినోద్

**స్టేషన్ ఘన్పూర్, జూన్ 07 (జనం సాక్షి) :** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ( టీపీసీసీ )ఎస్సీ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన డాక్టర్ చేపూరి వినోద్ శనివారం హనుమకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరిని, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ని మర్యాద పూర్వకముగా కలవడం జరిగింది. తన కు సహకరించిన కడియం శ్రీహరికి,కడియం కావ్య కు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమి తులైన డాక్టర్ చేపూరి వినోద్ కుమార్ కు అభినం దనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం తో పాటు ఎస్సీ డిపార్ట్మెంట్ బలోపేతానికి కృషి చేస్తానని చేపూరి వినోద్ తెలిపారు.

## కారు ద్విచక్ర వాహనం ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు





**చెన్నారావుపేట, జూన్ 7 ( జనం సాక్షి):** కారు ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీ: కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తిమ్మరాయిని పహాడ్ పాపయ్య పేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో జోజిపేట గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన బాదావత్ హరి సింగ్ తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం చెన్నారావుపేటకు వచ్చి తిరిగి గుండెగకు వెళుతున్నాడు. మదనాపురం గ్రామానికి చెందిన కారు రెండు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాధావత్ హరి సింగ్ కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా 108 పైలట్ వైనాల నాగరాజు, ఈఎంటి అనితలు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర గాయాల పాలైన హరి సింగ్ ను చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనాలు రెండు దెబ్బతిన్నాయి.

## అభివృద్ధి పనులు గడువు లోగా పూర్తి చేయాలి

- రూ. 3.15 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం
- ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

**ముదిగొండ, జూన్ 7 (జనం సాక్షి) :** క్షేత్ర స్థాయిలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో గడువులోగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముదిగొండ మండలంలోని యడవల్లి గ్రామంలో రూ.3.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, ముదిగొండ మండల కేంద్రంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈఆర్‌వో కార్యాలయ భవనానికి, మండలంలో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.33 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు రహదారుల అభివృద్ధి పనులకు కూడా ఉప ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. అనంతరం యడవల్లి లక్ష్మీపురం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ముదిగొండ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లిఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా పరిసర గ్రామాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని, గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ భవనం భవనం ఉపయోగపడనుందని తెలిపారు. ప్రజలకు విద్యుత్ సంబంధిత సేవలు మరింత సులభంగా అందించేందుకు ఈఆర్ఓ భవనం దోహదపడనుందని అన్నారు. ముదిగొండ మండలంలో 33 కోట్లతో చేపట్టిన రహదారుల నిర్మాణం పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు జాతీయ రహదారులతో అనుసంధానం బలోపేతం కానుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణ అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పనుల పురోగతిపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా ఛైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కల్లూరు మండలంలో ఆరుప్రీ ప్రైమరీ పాఠశాలు మంజూరు

- ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం



**కల్లూరు, జూన్ 7 (జనం సాక్షి) :** కల్లూరు మండలంలో కల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ,ఎంపీయుపిఎస్ అంబేద్కర్ నగర్, ఎంపీపీ ఎస్ నారాయణపురం, ఎంపీ యుపిఎస్ మరల పాడు, ఎంపీపీ ఎస్ చిన్న కోరుకొండి, ఎంపీపీ ఎస్ కొత్త బోడిమల్లి పాఠశాలలందు ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభం అవుతుందని ఎంఈఓ పత్తిపాటి నియోజకవర్గం తెలిపారు. నూతనంగా ప్రారంభించనున్న ఆరు పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్ , ఆయాల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆయాల విద్యార్హత స్థానికులై ఉండాలి కనీసం ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి ఇన్స్ట్రక్టర్లకు కనీస విద్యార్హత ఇంటర్ పాస్ స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఈ నెల 8,9 తేదీలలో మండల విద్యా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరించబడతాయి. అవకాశాన్ని అర్హులైన వారందరూ ఉపయోగించుకోవలసిందిగా మండల విద్యాశాఖ అధికారి కోరారు.

## తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**భూదాన్ పోచంపల్లి, జూన్ 7 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ కు చెందిన గీత కార్మికుడు దుబ్బాక యాదయ్య శనివారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పరీక్షల్లో యాదయ్యకు రెండు పక్కటెముకలు విరిగి లోపలి భాగంలో గుచ్చుకున్నట్లు వైద్యులు గుర్తించారు. అత్యవసర శస్త్రచికిత్స అవసరమని తెలపడంతో, వైద్య ఖర్చులు భరించలేక తాము ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని, ప్రభుత్వం లేదా దాతలు ఆదుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## పునః ప్రారంభమైన ప్రభుత్వ బాలికల పాఠశాల



**నాగార్జునసాగర్ జూన్ 7 (జనంసాక్షి) :** ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, హిల్ కాలనీలోని నాగార్జున సాగర్ నందు తిరిగి పున ః ప్రారంభించామని మండల విద్యాధికారి రాము తెలిపారు. గత మూడు సంవత్సరములుగా మూతబడిన ఈ ఉన్నత పాఠశాల హిల్ కాలనీ నందు తిరిగి ,ఈ విద్యా సంవత్సరం 2026 – 27 గాను జిల్లా కలెక్టర్, డీఈవో, ఆదేశానుసారము ఈ విద్యా సంవత్సరం నుండి తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన జరుపుతున్నామని అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాటలో భాగంగా సోమవారం నుండి పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి ఇంటికి వచ్చి పాఠశాలలొ మెరుగైన నాణ్యమైన విద్యా గురించి తల్లి తండ్రులకు మరియు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని అన్నారు.గతంలో చదివిన విద్యార్థులు ,ఈ సంవత్సర కొత్తగా చేరే విద్యార్థినీలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తల్లితండ్రులు ఆలోచన చేసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించవలసిందిగా మండల విద్యాధికారి టీ. రాములు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలొ స్కూల్ కంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి.శేషు ,బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ధనము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

- రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్
- అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలే శరణ్యం అంటున్న బాధితులు



**మణుగూరు, జూన్ 7 (జనంసాక్షి) :** అనుమతి లేని ప్రైవేట్ చిట్టి వ్యాపారుల వల్ల పేద మధ్యతరగతి ప్రజలకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతోందని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ అన్నారు. ఆదివారం రేణుక అక్షర మహిళా మండలి కార్యాలయంలో బాధితుల సమస్యలను వివరించారని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోజు రోజుకు మణుగూరు మండలంలో అమాయకులను ఆసరాగా చేసుకొని చిట్టీ వ్యాపారుల, అక్రమ వడ్డీ వ్యాపారుల దందా పెచ్చు మీరుతోంది. రెక్కాడితే కానీ డొక్కాడని వ్యాపారులను, నిరుపేదలను, సామాన్యులకు మోయలేని అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కొందరు వ్యాపారులు చెక్కులు తీసుకుని అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి మానసికంగా ఇబ్బందికి గురిచేస్తున్నారు. ఆన్లైన్ బిజినెస్ వల్ల వ్యాపారాలు మందగించడంతో చిరు వ్యాపారులు కుదేలు అవుతున్నారు. రెంట్ కరెంట్ వర్కర్ల జీతాలు చెల్లించలేక బతుకుదెరువు కోసం వలసలు వెళ్ళిపోతున్నారు. ముఖ్యంగా ల్యాబ్‌లను ఆసుపత్రుల వారి నుంచి చెక్కులు తీసుకొని అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ తమ దందా కొనసాగిస్తున్నారు. ఏజన్సీ ఏరియాలో చట్ట విరుద్ధం అయినప్పటికీ యదేచ్ఛగా దందా కొనసాగుతోంది. అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలే శరణ్యం అంటున్న బాధితులు. కూలీ నాలి చేసుకునే వారు చిరు వ్యాపారాలు కష్టపడి నెల నెల కూడబెట్టుకున్న సొమ్మును చిట్టి కడితే తీరా చీటి పాడుకునే సమయంలో సకాలంలో డబ్బులు అందకపోవడం నిర్వాహకులు బోర్డు తిప్పేయటం లేదా డబ్బులు ఎగ్గొట్టడం వంటి మోసాలకు చేయడం వల్ల బాధితులు బలైపోతున్నారు. కొంతమంది నిర్వాహకులు చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకొని బాధితులు డబ్బులు అడిగితే ఐ పి పెట్టుకొని చేతులెత్తేస్తున్నారు. కూతురు పెళ్లి కోసం దాచుకున్న డబ్బు పిల్లల చదువు కోసం సొంత ఇంటి నిర్మాణం కోసం చిరు వ్యాపారం కోసం చీటి వేస్తే వాడుకునే సమయంలో ఐపీ పెట్టి బాధితులను మానసికంగా ఆర్థికంగా కుంగదీసి ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తున్నారు.సంబధిత అధికారులు స్పందించి నష్ట పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మహిళా సీనియర్ నాయకురాలు ఎండీ షబానా, కోరి శ్యామల బొడ్డు సౌజన్య, దేరంగుల సుజాత, రెడ్డీబోయిన రేణుక,బడిశా పార్వతి, హేమలత, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి డబుల్ బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ రాస్తారోకో



**మోత్కూరు, జూన్ 7 (జనం సాక్షి) :** మోత్కూరు మున్సిపల్ కేంద్రం నుంచి రాజన్నగూడెం వరకు అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ కృషితో మోత్కూరు – రాజన్నగూడెం డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.80 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ అదే పనులకు మళ్లీ శంకుస్థాపన చేసి ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. రెండున్నరేళ్లు గడిచినా రోడ్డు పనులు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఈ రహదారిపైనే ప్రయాణించే ఎమ్మెల్యేకు ప్రజల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పనులను పునఃప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, మున్సిపల్ అధ్యక్షులు జంగా శీను, మాజీ మార్కెట్ చైర్మన్ కొనతం యాకుబ్ రెడ్డి, రైతుబంధు మాజీ అధ్యక్షులు కొండ సోమల్లు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, మాజీ సర్పంచ్ భయాని పిచ్చయ్య, రాంపాక నాగయ్య, కౌన్సిలర్ సుల్తాన్ స్వామి, దాసరి తిరుమలేష్, సామ పద్మారెడ్డి, కంచర్ల కాంత్ కుమార్ రెడ్డి, కూరెళ్ల పరమేష్, జంగా శివ, మొరిగాల శ్రీను, బొడిగ శ్రీను, వెంకన్న, కోక బిక్షం, చేతరాశి చంద్రయ్య, లోతుకుంట స్వామి, అన్నందాస్ విద్యాసాగర్, తాటి లక్ష్మణ్, పొన్నెబోయిన మచ్చగిరి, జంగా నరేష్, కూరెళ్ల రమేష్, చుక్క అశోక్, దాసరి నవీన్, కొంపెల్లి మల్లేష్, బొడిగ మల్లేష్, పసునూరి యాదయ్య, చెడిపల్లి ఆనందు, నాగరాజు, బోడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బూర్గంపహాడ్, జూన్ 7 (జనంసాక్షి) : సుదీర్ఘ కాలం తర్వాత ఏడవ తరగతి పూర్వ విద్యార్థులు ఒక్కటై వారిది కాలం కూడా మార్చలేని బంధం అని నిరూపించారు. 22 ఏళ్ల వీరి జీవిత ప్రయాణంలో ఎన్నో మలుపులు వచ్చినా, బాల్య స్నేహం మాత్రం ఎప్పటికీ పదిలంగానే ఉంటుందనే విషయాన్ని న్యూస్కాలర్ కాన్వెంట్ స్కూల్, మొరంపల్లిబంజర్‌కు చెందిన 2004 ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు మరోసారి చాటిచెప్పారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత పాములేరులో నిర్వహించిన గెట్ టు గెదర్‌లో పాల్గొని చిన్ననాటి అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు పాఠశాల ఆవరణలో కలిసి ఆడిపాడిన స్నేహితులు, నేడు ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో బిజీ జీవితాలు గడుపుతున్నప్పటికీ, పాత జ్ఞాపకాల పిలుపుతో ఒకేచోట చేరి భావోద్వేగ క్షణాలను పంచుకున్నారు. పాఠశాల రోజుల సరదా సంఘటనలు, గురువుల జ్ఞాపకాలు, సహచరులతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా పరస్పరం కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుని, భవిష్యత్తులోనూ ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తూ స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాలం గడిచినా స్నేహానికి వయస్సు ఉండదని ఈ కలయిక మరోసారి నిరూపించింది. స్నేహం, ఆత్మీయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచిన ఈ సమావేశం అందరికీ మధుర జ్ఞాపకంగా మిగిలింది.ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, సంధ్యారాణి, చంద్రశేఖర్ రెడ్డి, మౌనిక, శైలజ, అనంత్, శ్రవణ్, చంటి, రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి, హేమంత్, రాజశేఖర్ రెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ముకుందారెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్వాడి వ్యాపారులకు వ్యతిరేఖంగా నిరసన




**శివ్వంపేట, జూన్ 7 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన శివంపేటలో వర్తక వ్యాపార వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేపట్టి గ్రామపంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన శివంపేటలో కొత్తగా మార్వాడి వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయకూడదంటూ గతంలో తీర్మానం చేసి గ్రామపంచాయతీలో అందించడం జరిగింది. అయినప్పటికీ సదరు మార్వాడి వ్యాపారులు అనుమతులు తీసుకుంటున్నామంటూ కొత్తగా వ్యాపారాలు నెలకొల్పేందుకు ఏర్పాటు చేస్తున్నందుకు స్థానిక వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామంలో ఏర్పాటు చేసిన మార్వాడి దుకాణాల ద్వారా స్థానిక వ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డుమీదికి వచ్చిన పరిస్థితి నెలపొందన్నారు. సదరు మార్వాడి వ్యాపారులకు కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేయకూడదని గతంలో విజ్ఞప్తి చేసినప్పటికీ అవేవీ పట్టించుకోకుండా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఫర్నిచర్ పనులు చేస్తున్నారని వాపోయారు. మార్వాడి దుకాణాలు ఏర్పాటు చేస్తే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వర్తక వ్యాపార వాణిజ్య సంఘం అధ్యక్షుడు యాదగిరి గౌడ్ అన్నారు. స్థానిక వ్యాపారుల పొట్టకూడదంటూ మార్వాడి గో బ్యాక్ అంటూ గ్రామంలో నిరసన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ వ్యాపార దుకాణ యజమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీఎం పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకుల హౌస్ అరెస్ట్



**ఉప్పల్, జూన్ 7 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ భగాయత్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో బీజేపీ నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. రామంతాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తాతో పాటు ఉప్పల్ బీజేపీ అధ్యక్షుడు ఫణీంద్రను పోలీసులు వారి నివాసాల వద్దే గృహ నిర్బంధం చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగిస్తోందని ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే తమను ముందస్తుగా నిర్బంధించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలలో అనేకం ఇప్పటికీ అమలు కాలేదని, నిరుద్యోగం, మౌలిక సదుపాయాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. అలాంటి అంశాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతుండగా తమను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని అన్నారు. కేవలం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పర్యటనలతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై మాత్రం స్పష్టత ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను లేవనెత్తే ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలు దాచిపెట్టలేరని పేర్కొన్నారు. ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలతో ప్రజాస్వామ్య స్వరాన్ని అణిచివేయడం సాధ్యం కాదని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ప్రతిపక్షాలపై ఆంక్షలు విధించడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్తామని, ప్రజల తరఫున పోరాటం మరింత ఉద్ధృతం చేస్తామని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు హెచ్చరించారు. సీఎం పర్యటన నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# పూసలపాడులో ఫోర్జరీ కలకలం

- నకిలీ మాజీ సర్పంచ్ ఖాతాలోకి పంచాయతీ నిధులు
- రూ. 85,762 దారి మళ్లింపుపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన ప్రస్తుత సర్పంచ్
- ప్రాథమిక దర్యాప్తులో తేలిన బండారం ఏప్రిల్ 20న అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్
- ఫిర్యాదును ఉన్నతాధికారులకు ఫార్వర్డ్ చేసిన ఎంపీడీఓ కార్యాలయం
- ఆదివారం కావడంతో ఫోన్ ద్వారా సమాచార సేకరణకు ప్రయత్నించగా స్పందించని అధికారి




**మాడుగులపల్లి, జూన్ 7 (జనం సాక్షి) :** మండల పరిధిలోని పూసలపాడు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది ఏకంగా ప్రస్తుత సర్పంచ్ సంతకాన్నే ఫోర్జరీ చేసి, ప్రభుత్వ నిధులను కొల్లగొట్టిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది పల్లె ప్రగతికి, గ్రామ అవసరాలకు ఉపయోగపడాల్సిన రూ. 85,762 నిధులను నకిలీ సంతకాలతో దారిమళ్లించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది గ్రామ పంచాయతీ ఖాతా నుండి తన ప్రమేయం లేకుండానే పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా అయినట్లు ప్రస్తుత సర్పంచ్ గుర్తించారు దీనిపై నివ్వెరపోయిన ఆయన, రికార్డులను పరిశీలించగా తన సంతకాన్ని నకిలీ పద్ధతిలో (ఫోర్జరీ) ఉపయోగించి నిధులు విత్‌డ్రా చేసినట్లు స్పష్టమైంది. ప్రభుత్వ సొమ్మును అక్రమంగా దారిమళ్లించిన సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రస్తుత సర్పంచ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి (ఎంపీడీఓ) రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు సర్పంచ్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు, ఆ నిధులు ఏ అకౌంట్‌కు వెళ్లాయనే కోణంలో బ్యాంక్ లావాదేవీలను జల్లెడ పట్టారు ఈ దర్యాప్తులో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి గత ఏప్రిల్ 20, 2026 (20.04.2026)న ఈ రూ. 85,762 నగదు మొత్తం అదే గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలోకి నేరుగా ట్రాన్స్‌ఫర్ అయినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. గ్రామ ప్రథమ పౌరుడిగా ఉండి నిధుల రక్షణ చూసుకోవాల్సిన మాజీ ప్రజాప్రతినిధే, ఇలా ఫోర్జరీ అక్రమాలకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి ఈ వ్యవహారంలో స్థానిక సర్పంచ్ ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన ఎంపీడీఓ కార్యాలయం నిబంధనల ప్రకారం ఆ ఫిర్యాదును తదుపరి చర్యల నిమిత్తం జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫార్వర్డ్ చేసింది అధికారికంగా వారు చేయాల్సిన విచారణ ప్రక్రియను యథావిధిగా కొనసాగిస్తున్నారు అయితే, ఈ కేసు తదుపరి పురోగతి మరియు మరిన్ని వివరాల సంచలనాత్మక సమాచారం కోసం నేడు (ఆదివారం) స్థానిక ఎంపీడీఓ వంశీధర్ గారిని ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా, ఆయన ఫోన్ అందుబాటులోకి రాలేదు నేడు సెలవు దినం కావడంతో ఫోన్ ద్వారా సమాచారం లభించలేదని తెలుస్తోంది ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసిన సదరు మాజీ సర్పంచ్‌పై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఫోర్జరీ సొమ్మును రికవరీ చేయాలని పూసలపాడు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని కోరుతున్నారు.




ఆరంకెల జీతం.. వీకెండ్స్‌లో బైక్ ట్యాక్సీ డ్రైవింగ్!

సాధారణంగా ఐటీ ఉద్యోగం అంటేనే రూ.లక్షల్లో జీతం.. విలాసవంతమైన జీవితం.. వారాంతాల్లో పార్టీలు.. సాధారణంగా ఇవే గుర్తొస్తాయి. కానీ, ఇదంతా నాణేనికి ఒకవైపే. ఎంత జీతం వచ్చినా పెద్ద పెద్ద నగరాల్లో జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో అదనపు ఆదాయం కోసం కొందరు అదనంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కూడా వీకెండ్స్‌లో బైక్ డ్రైవర్ అవతారం ఎత్తాడు. దీనికి సంబంధించి ఓ వ్యక్తి చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.బెంగళూరులోని బన్నెరఘట్టకు వెళ్లడానికి షాబాజ్ ఇటీవల బైక్ ట్యాక్సీ బుక్ చేసుకున్నాడు. ర్యాపిడో డ్రైవర్‌తో మాటలు కలపగా.. అతడు తొలుత కన్నడలో మాట్లాడాడు. అయితే, షాబాజ్‌కు కన్నడ రాకపోవడం గమనించి వెంటనే ఇంగ్లిష్‌లో సంభాషణను కొనసాగించాడు. 'మీరేం చేస్తుంటారని షాబాజ్‌ని అడగ్గానే.. సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీ' అంటూ సమాధానం ఇచ్చాడు. 'మరి మీరు?' అని అడగ్గానే.. 'నేను కూడా' అనే సమాధానం వచ్చింది. 'ఎంఎన్‌సీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నా. ఆరెంకల జీతం. కానీ, వారం చివరిరోజుల్లో బైక్ ట్యాక్సీ నడుపుతా. నాకు పెళ్లయ్యింది. పిల్లలున్నారు. కుటుంబాన్ని పోషించాలంటే అదనపు ఆదాయం కావాలి కదా!' అంటూ ఆ వ్యక్తి నుంచి సమాధానం వచ్చింది.అతడి మాటలు తనను ఆలోచనలో పడేశాయంటూ షాబాజ్ ఎక్స్ వేదికగా చెప్పుకొచ్చాడు. ఇంత జీతం ఉంటూ ఇలా కష్టపడుతున్నారంటే.. బెంగళూరు వంటి నగరాల్లో జీవించడం ఎంత కష్టంగా మారిందో కదా!' అంటూ పోస్ట్ పెట్టాడు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. హైదరాబాద్ నగరంలోనూ చాలా మంది పరిస్థితి ఇదేనంటూ పేర్కొన్నారు. అదనపు ఆదాయం కోసం ఇలా బైక్ డ్రైవర్‌గా అవతారమెత్తే బదులు.. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం ద్వారా అధికాదాయం పొందొచ్చంటూ మరికొందరు సలహా ఇచ్చారు.

## వెండికి తప్పనిసరి హాల్‌మార్కింగ్ ఎలా?

### ఎదురయ్యే సవాళ్లపై బీఐఎస్ అధ్యయనం

**న్యూఢిల్లీ:**వెండి ఆభరణాలకూ తప్పనిసరి హాల్‌మార్కింగ్ అమలు చేసేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు దేశీయంగా ఉన్నాయా.. నిబంధనావళి ఎలా ఉండాలి.. అనే అంశాన్ని భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) పరిశీలిస్తోంది. 2005 నుంచే వెండికి హాల్‌మార్కింగ్ స్వచ్ఛందంగా అమల్లో ఉండగా, 2025 సెప్టెంబరు నుంచి వీటిపై హాల్‌మార్క్ యునీక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యూఐడీ) సంఖ్య ముద్రిస్తున్నట్లు బీఐఎస్ డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ చెప్పారు. మారుమూల ప్రాంతాల్లోని చిన్న దుకాణాల్లోనూ వెండి ఆభరణాలు విక్రయిస్తున్న దశలో.. వీటికి హాల్‌మార్క్ అమలు చేయడం సవాలుతో కూడుకున్నదని వివరించారు. బీఐఎస్‌లో హాల్‌మార్క్ ప్రక్రియను అయిదుగురు మాత్రమే పర్యవేక్షిస్తున్నారని, మిగిలినవారు ప్రైవేటు/అవుట్ సోర్సింగ్ వ్యక్తులని వెల్లడించారు. అందుకే వెండికి తప్పనిసరి హాల్‌మార్కింగ్ అమలు చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులు పరిశీలించి, తప్పులు జరగకుండా వ్యవహరించేందుకు నిబంధనావళి రూపొందిస్తున్నట్లు చెప్పారు. 2024-25లో 32 లక్షల వెండి ఆభరణాలకు హాల్‌మార్క్ వేయగా, 2025-26లో ఈ సంఖ్య 59 లక్షలకు పెరిగినట్లు తెలిపారు.

# రుణగ్రహీతలపై వడ్డీ భారం పెరుగుతోంది!

### ఆర్‌బీఐ రెపోరేటు సవరించకున్నా ఇదీ పరిస్థితి డిపాజిట్ల వ్యయాలు అధికమవుతున్నందునే

**న్యూఢిల్లీ:**భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తన తాజా పరపతి విధాన సమీక్షలో రెపో రేటును 5.25% వద్దే స్థిరంగా ఉంచింది. అంతర్జాతీయ అనిశ్చితులు, ఇంధన ధరల వల్ల దేశీయంగా ద్రవ్యోల్బణం పెరుగుతున్న దృష్ట్యా ఆర్‌బీఐ తటస్థ వైఖరి అవలంబించినా, సామాన్య రుణగ్రహీతలకు మాత్రం వడ్డీ భారం పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలసీ రేట్లు మారకపోయినా, బ్యాంకులు తమ అంతర్గత విధానాల ద్వారా రుణాలపై వడ్డీరేట్లు పెంచుతున్నాయి. డిపాజిట్లు ఆకర్షించేందుకు ఆ వడ్డీరేట్లు పెంచాల్సి రావడానికి తోడు, రుణాలకు క్రెడిట్ స్కోరుతో ముడిపడి ఉన్న రిస్కు ఆధారిత ధరల నిర్ణయమే దీనికి ప్రధాన కారణం.ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రధాన సమస్య డిపాజిట్లు-రుణ వృద్ధి మధ్య ఉన్న అసమతుల్యత. రుణాలు తీసుకునే వారి సంఖ్య బాగా పెరిగినా, బ్యాంకుల వద్దకు వస్తున్న డిపాజిట్లు ఆ స్థాయిలో పెరగడం లేదు. ప్రజలు తమ పొదుపు మొత్తాన్ని బ్యాంకు డిపాజిట్ల కంటే ఈక్విటీ మార్కెట్లు, ఇతర ఆర్థిక సాధనాల వైపు మళ్లిస్తుండటమే ఇందుకు కారణం. నిధుల లభ్యత కోసం డిపాజిట్లపై అధిక వడ్డీ ఇవ్వాల్సిన పరిస్థితి బ్యాంకులకు వస్తోంది. డిపాజిట్ల సమీకరణ ఖరీదుగా మారినప్పుడు, బ్యాంకులు తమ లాభదాయకత/నికర వడ్డీ మార్జిన్ (నిమ్) కాపాడుకోవడానికి రుణాలపై వడ్డీ రేట్లు



పెంచుతుంటాయి. ప్రస్తుత పరిస్థితి ఇదే. రెపో ఆధారిత వడ్డీ రేట్ల (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) విధానాన్ని పాటిస్తూనే, రుణాలపై వడ్డీరేటు నిర్ణయించేందుకు క్రెడిట్ స్కోరును బ్యాంకులు ప్రధానంగా చూస్తున్నాయి. గృహ, వాహన రుణాల మంజూరులో క్రెడిట్ స్కోరుపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నాయి. దీన్నే రిస్కు ఆధారిత ధరల నిర్ణయంగా పిలుస్తుంటారు. రుణగ్రహీత క్రెడిట్ స్కోరు 800 కంటే ఎక్కువగా ఉంటే, సురక్షితమని బ్యాంకులు భావిస్తున్నాయి. వీరికి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాయి.క్రెడిట్ స్కోరు 750 కన్నా తక్కువగా ఉంటే.. అదనంగా వడ్డీ రేటును 'రిస్క్ ప్రీమియం' పేరుతో వసూలు చేస్తున్నాయి. సాధారణ వడ్డీ కంటే ఎక్కువ భారం పడుతుంది. క్రెడిట్‌స్కోర్ 650-699 మధ్య ఉన్న వారు రుణం తీసుకోవాలంటే, రెపో రేటుపైన 4 శాతానికి పైగానే బ్యాంకులు వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఉదాహరణకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)నే తీసుకుంటే.. ఈబీఎల్‌ఆర్ 7.90% ఉంది. గృహరుణాలపై వడ్డీ రేటు 7.25-9.55% మధ్యలో ఉంది. మంచి స్కోరున్న వారికి 7.25 శాతానికే రుణం ఇస్తోంది. స్కోరు తగ్గుతున్న కొద్దీ.. వడ్డీ రేటు పెరుగుతూ ఉంటుంది. పాత రుణగ్రహీతలకూ ఈ క్రెడిట్ స్కోరు ఆధారిత వడ్డీ రేటును వర్తింపజేసేందుకు బ్యాంకులు ప్రయత్నిస్తున్నాయి.

ఎంసీఎల్‌ఆర్ పెంపు దిశగా అడుగులు రెపో రేటుతో నేరుగా ముడిపడి ఉన్న ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ కాకుండా, బ్యాంకులు ఇప్పుడు తమ అంతర్గత బెంచ్‌మార్క్ ఎంసీఎల్‌ఆర్ (నిధుల వ్యయం ఆధారిత వడ్డీరేటు)ను పెంచే అవకాశం కనిపిస్తోంది. అంటే నిధుల సమీకరణకు తమకు అవుతున్న వ్యయం ఆధారంగా ఈ రేటును నిర్ణయిస్తాయి. డిపాజిట్ల సేకరణ ఖరీదైతే, బ్యాంకులు ఎంసీఎల్‌ఆర్ శాతాలను సవరిస్తాయి. దీనివల్ల పాత రుణగ్రహీతలపైనా వడ్డీ భారం పెరుగుతుంది.

డిపాజిటర్లకు మేలు..

ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీపై ఆధారపడే వారికి ఇప్పుడు మంచి కాలమే అని చెప్పొచ్చు. డిపాజిట్లపై ఒకప్పుడు 6 శాతానికి దిగువన ఉన్న వడ్డీ రేట్లు, మళ్లీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 8.10% పైగానే వడ్డీ ఇస్తున్నట్లు ప్రకటిస్తున్నాయి. పెట్టుబడిపై ఎలాంటి నష్టభయం లేకుండా, హామీతో కూడిన రాబడి కావాలనుకున్న వారికి, ఇప్పుడున్న పరిస్థితుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు మంచి అవకాశమే అని చెప్పొచ్చు. స్కోరుపై దృష్టి: రుణం తీసుకోవడానికి కనీసం 3-6 నెలల ముందు నుంచే క్రెడిట్ కార్డ్ బిల్లులు, ఈఎంఐలు సకాలంలో చెల్లించాలి.

## విదేశీ భాగస్వామ్యాలను ఆకర్షించడమే లక్ష్యం

తైవాన్ టెక్ ట్రేడ్ కార్యక్రమంలో పాల్గొన్న సహస్ర, జోహో

తైపి: విదేశీ విపణుల్లో వినియోగదార్లతో పాటు భాగస్వాములను ఆకర్షించే లక్ష్యంతో, తైవాన్ రాజధాని తైపీలో జరిగిన కంప్యూటెక్స్ 2026లో భారతీయ కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమంలో 33 దేశాల నుంచి 1,500 మంది దాదాపు 6,000 స్టాళ్లు ఏర్పాటు చేశారు. భారతీయ వినియోగదారులూ పెద్దసంఖ్యలో ఈ ప్రదర్శనను తిలకించారు. ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ సహస్ర, తన మైక్రోఎస్‌డీ కార్డులను ప్రదర్శించింది. 'మాకు చైనా, అమెరికా, ఐరోపా, యూకేల్లో వినియోగదార్లు ఉన్నారు. కొత్త వారూ ఆకర్షితులయ్యారు' అని సహస్రలో స్ట్రాటజిక్ అకౌంట్ మేనేజర్‌గా ఉన్న అంకుర్ ద్వివేది తెలిపారు. కొత్త భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారాలు, సంయుక్త సంస్థల ఏర్పాటు అవకాశాలను అన్వేషించడానికి ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటున్నట్లు వివరించారు. తమ కంపెనీకి ఒక ముఖ్యమైన విపణిగా తైవాన్ అవతరిస్తోందని క్లౌడ్ ఆధారిత బిజినెస్ సాఫ్ట్‌వేర్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ అప్లికేషన్లను అందించే జోహో కార్పొరేషన్ తెలిపింది.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |
|---|---|
| ₹ 1,45,800 | ₹ 1,59,060 |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

## మ్యాక్సీ స్కూటర్లకు పెరుగుతున్న పోటీ.. టీవీఎస్ కూడా రెడీ

స్కూటర్.. అంటే ఒకప్పుడు ఫ్యామిలీ టూవీలర్ మాత్రమే. ఇటీవల కాలంలో వీటి రూపు మారుతోంది. సామర్థ్యమూ పెరుగుతోంది. కుర్రకారును ఆకట్టుకోవడానికి కంపెనీలు స్టైలిష్ లుక్‌లో పవర్‌ఫుల్ ఇంజిన్‌తో మ్యాక్సీ స్కూటర్లను లాంచ్ చేస్తున్నాయి. ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే యమహా ఏరోక్స్ 155, హీరో జూమ్ 160 మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. త్వరలో హోండా కూడా 160 పేరిట కొత్త స్కూటర్‌ను లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. దీంతో ప్రీమియం స్కూటర్ సెగ్మెంట్‌లో గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉంది.ప్రస్తుతం టీవీఎస్ కంపెనీ జూపిటర్, ఎన్‌టార్క్ పేరిట స్కూటర్లను విక్రయిస్తోంది. ఇందులో స్పోర్టీ లుక్‌లో ఉండే ఎన్‌టార్క్ కుర్రకారును ఆకట్టుకుంటోంది. దీంతో ఎన్‌టార్క్ 150 సీసీని సైతం కంపెనీ లాంచ్ చేసింది. ఇప్పుడు మరింత పవర్‌ఫుల్ ఇంజిన్‌తో 160 సీసీ మ్యాక్సీ స్కూటర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్కూటర్‌ను పూర్తి కొత్త ప్లాట్‌ఫామ్‌పై రూపొందుతున్నట్లు సమాచారం. లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌తో టీవీఎస్ పోర్ట్‌ఫోలియోలోనే అత్యంత అధునాతన స్కూటర్‌గా కాబోతోందని తెలుస్తోంది. యమహా ఏరోక్స్ 155, హీరో జూమ్‌కు పోటీగా ఇదే సామర్థ్యంలో టీవీఎస్ మ్యాక్సీ స్కూటర్ రాబోతోందని తెలుస్తోంది. అధిక వీల్ బేస్, బ్లూటూత్ కనెక్టివిటీ, నావిగేషన్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, డిస్క్ బ్రేక్స్‌తో వచ్చే ఏడాది లాంచ్ కాబోతోందని సమాచారం.



# సముద్రం అడుగునా సొరంగమే..

- సొరంగాల అద్భుతం ఐరోపా రైల్వే!
- ఆల్ప్స్ పర్వతాల కింద దాదాపు 7500 అడుగుల లోతులో నిర్మించిన గొథార్డ్ బేస్ సొరంగం



**న్యూఢిల్లీ:**ఐరోపా రైల్వే చిత్రపటం సమూలంగా మారిపోతోంది. పర్వతాల్ని, భూగర్భాన్ని తొలిచేస్తూ భారీ సొరంగాల్ని ఐరోపా నిర్మిస్తోంది. తద్వారా ప్రధాన నగరాల మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గించే సాహసోపేత ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దీనిపేరు ట్రాన్స్-యూరోపియన్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ (టీఈఎన్-టీ). ఐరోపా వ్యాప్తంగా ప్రధాన నగరాలు, ప్రాంతాలు, ఓడరేవులను కలుపుతూ.. 10,850 మైళ్ల రైలు మార్గాలను నవీకరించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అననుకూల భౌగోళిక పరిస్థితుల్ని అధిగమించి.. అధునాతన రైల్వే నెట్‌వర్క్‌ను సృష్టించడం దీని ఉద్దేశం. దీనివల్ల రాబోయే దశాబ్ద కాలంలో ఉత్తర ఐరోపా-ఉత్తర ఇటలీలోని పారిశ్రామిక కేంద్రాల మధ్య రైలు అనుసంధానంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ప్రాజెక్టులో భాగంగా ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీల్లో ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగాల్ని నిర్మిస్తున్నారు.చాలాకాలంగా సముద్ర రవాణాపై ఆధారపడిన డెన్మార్క్- ఇప్పుడు రైలు, రోడ్డు రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తోంది. ఇందుకోసం అనేక సొరంగాల్ని తవ్వుతోంది. కృత్రిమ ద్వీపాలు సృష్టిస్తోంది. తన రెండు అతిపెద్ద ద్వీపాల్ని ఐరోపా ప్రధాన భూభాగం, స్వీడన్‌లతో అనుసంధానించేలా వంతెనలు నిర్మిస్తోంది. జర్మనీని కలిపేలా బాల్టిస్ సముద్రం అడుగున చేపట్టిన రోడ్డు, రైలు లింక్‌ను 2030 కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల కోపెన్‌హాగన్, హాంబర్గ్, బెర్లిన్ మధ్య ప్రయాణ సమయాలు గణనీయంగా తగ్గుతాయి. గల్ఫ్ ఆఫ్ ఫిన్లాండ్ కింద 50-మైళ్ల సొరంగం ద్వారా హెల్సింకీని ఎస్తోనియాలోని టలిన్, ఇతర బాల్టిక్ దేశాలతో అనుసంధానించే మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. ఆల్ప్స్ పర్వతాలు ఉత్తర, దక్షిణ ఐరోపాలను వేరుచేసే సహజ సరిహద్దుగా ఉన్నాయి. ఇక్కడ ప్రపంచంలోనే అత్యంత పొడవైన రైలు సొరంగాలను నిర్మించడం సాంకేతికంగా సవాలుతో కూడుకున్న పనే. పైపెచ్చు అత్యంత ఖరీదైన వ్యవహారం. 8 ప్రధాన ప్రాజెక్టులను పూర్తిచేయడానికి అయ్యే ఖర్చులు వాటి ప్రారంభ అంచనాల కంటే సగటున 82 శాతం పెరిగాయి. పనుల్లో విపరీతమైన జాప్యం జరుగుతోంది. 5 ప్రాజెక్టుల్లో సగటు ఆలస్యం 17 సంవత్సరాలుగా ఉంది.

**అద్భుతమైన సొరంగాలు:**ఇప్పటిదాకా పర్వతాలు, సముద్రాలతో వేరుపడిన ప్రాంతాలు, దేశాలను ఈ కొత్త మెగా-టన్నెల్స్ ద్వారా కలుపుతున్నారు. బ్రెన్నర్ బేస్ టన్నెల్, లియోన్-టురిన్, ఫెమర్న్ బెల్ట్ వంటి మెగా-ప్రాజెక్టులు ఐరోపా రైలు రంగానికి గేమ్‌ఛేంజర్‌లాగా మారగలవని అంచనావేస్తున్నారు. తక్కువ ఎత్తులో నిర్మిస్తున్న బేస్ టన్నెల్స్ వంకరటింకరగా ఉండే పర్వత మార్గాలను తప్పించి, ఎక్కువ రైళ్లు వేగంగా ప్రయాణించడానికి వీలు కల్పిస్తాయి. ఈ జాబితాలో స్విట్జర్లాండ్‌లోని గొథార్డ్ బేస్ టన్నెల్ ముందుంది. ఇది 2016లో ప్రారంభమయింది. టిసినో-యూరి కాంటన్‌లను కలుపుతూ.. రద్దీగా ఉండే జ్యూరిక్-మిలన్ మార్గంలోని ఈ 11.3 బిలియన్ల ప్రాజెక్టులోని ప్రతి అంశమూ మహాద్భుతమే. ఇది ఆల్పైన్ శిఖరాల కంటే 7,500 అడుగుల లోతులో ఉంది. దీని నిర్మాణం వల్ల రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం రెండున్నర గంటలకు తగ్గింది. అందుకుముందు నాలుగు గంటలు పట్టేది. ప్రపంచంలోనే అత్యంత పొడవైన రైలు సొరంగం 2032లో ప్రారంభం కానున్న బ్రెన్నర్ బేస్ టన్నెల్. ఇటలీలోని దక్షిణ టైరోల్ ప్రాంతంలో ఉన్న ఇన్స్‌బ్రూక్ శివార్ల నుంచి ఫ్రాంజెన్‌ఫెస్టే వరకు ఆల్ప్స్ పర్వాతల కింద రెండు సమాంతర 34-మైళ్ల పొడవైన రైలు సొరంగాలు నిర్మిస్తున్నారు.

ఆల్ప్స్ పర్వతశ్రేణుల్లో 1921లో సొరంగ నిర్మాణం

శతాబ్దాలుగా ఐరోపా వాసులు ఒకచోటి నుంచి మరోచోటికి వెళ్లడానికి ఆల్ప్స్ పర్వతాలను చుట్టివస్తున్నారు. ఆల్పైన్ కనుమలను దాటడానికి పల్లకీలను, స్థానిక గైడ్‌లను అద్దెకు తీసుకునేవారు. క్రమంగా ఆ కాలిబాటలు రహదారులుగా మారాయి. మంచు కారణంగా చాలా రోజులు ఇవి మూతబడేవి. 1921లో సింప్లాన్ రైలు సొరంగం తవ్వకంతో ప్రయాణం కొంత సులువయింది. నేటికీ, రైలు పట్టాలు పర్వతాల గుండా అల్లుకుపోతూ, భూభాగాల వాలులను అనుసరిస్తూ, అద్భుతమైన వంతెనలపై లోయలను దాటుతూ, తమంతట తామే పర్యాటక ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. రైలు కంపెనీలకు వీటి నిర్వహణ ఎప్పుడూ కష్టం, ఖరీదైన వ్యవహారమే. కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ప్రధాన అవరోధం. అందుకే కొత్త సొరంగ మార్గాలు నిర్మిస్తున్నారు.

# మోదీ ఇచ్చిన వజ్రాన్ని కొనాలనుకున్నా: జిల్ బైడెన్



జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోదీ బహూకరించిన 7.5 క్యారెట్ల సింథటిక్ వజ్రాన్ని అమెరికా మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్ (ఏతిశ్రీశ్రీ ఃతిటవని) గుర్తు చేసుకున్నారు. మోదీ బహుమతిగా ఇచ్చిన వజ్రాన్ని తనవద్దే ఉంచుకోవాలని తొలుత అనుకున్నానని.. కానీ, అమెరికా అధికారులు దానికి ఎక్కువ విలువ కట్టడంతో ఆ డైమండ్‌ను ఫెడరల్ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసినట్లు 'వ్యూ ఫ్రమ్ ది ఈస్ట్ వింగ్: ఎ మెమోయిర్' అనే తన ఆత్మకథలో రాసుకొచ్చారు. ఈ పుస్తకంలో వైట్ హౌస్‌లోని తెరవెనుక జీవితం గురించి.. అధ్యక్షుడి కుటుంబం అందుకునే బహుమతులకు ఉన్న నిబంధనల గురించి జిల్ బైడెన్ వివరించారు. 2023, జూన్‌లో అమెరికా అధ్యక్ష భవనం ఇచ్చిన అధికారిక విందులో మోదీ అతిథిగా పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన బహూకరించిన వజ్రం తనను ఎంతో ఆకర్షించిందని.. చాలా అద్భుతంగా ఉందని జిల్ బైడెన్ పేర్కొన్నారు. అయితే బైడెన్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత అమెరికా నియమాల ప్రకారం.. ఆ బహుమతిని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి వచ్చిందని తెలిపారు. దానికి అప్పట్లో ఉన్న మార్కెట్ విలువను చెల్లించి కొనుగోలు చేయడానికి అధికారులు అనుమతిస్తారని అన్నారు. దీంతో ఆ డైమండ్‌ను కొనుగోలు చేయాలని తాను అనుకున్నట్లు తెలిపారు.విదేశాంగ శాఖ వజ్రం విలువను 20 వేల డాలర్లుగా అంచనా వేయడంతో దానిని కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు.



అందుకు బదులుగా ఆ వజ్రాన్ని అరువుగా తీసుకుని అధికారిక కార్యక్రమాల్లో ధరించడానికి అధికారులు తనకు అనుమతి ఇచ్చారని అన్నారు. దీంతో ఆ డైమండ్‌ను ఓ ఉంగానికి పొదిగించి ధరించినట్లు తెలిపారు. ఫ్రాన్స్ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్ తనకు ఇచ్చిన బ్రాస్‌లెట్‌ను అమెరికా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా 2023లో జిల్ బైడెన్‌కు ప్రపంచ దేశాధినేతల నుంచి అందిన బహుమతుల్లో అతి ఖరీదైనది మోదీ బహూకరించిన వజ్రమే అని అప్పట్లో అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది.

## సంక్షోభాన్ని అధిగమించి వృద్ధి సాధించాలి

### ఈఏసీ సభ్యులతో ప్రధాని మోదీ చర్చలు



దిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం ఇబ్బంది పెడుతున్నా, మన దేశ ఆర్థిక వృద్ధిని మరింతగా పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆర్థిక సలహా మండలి (ఈఏసీ) సభ్యులతో చర్చించారు. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం మన దేశంతో పాటు ప్రపంచంపై ఎలా పడుతోందనే విషయమై తమ అంచనాలను ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) సభ్యులు వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక అభివృద్ధికి అనుసరించాల్సిన ప్రాధాన్యతలపైనా చర్చించారు. సంస్కరణలకు మరింత ఊపునివ్వడం, ప్రజల జీవన - వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడంపైనా సభ్యులు తమ అభిప్రాయాలు పంచుకున్నారని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు. ఈఏసీ అనేది భారత ప్రభుత్వానికి, ముఖ్యంగా ప్రధానికి ఆర్థిక, సంబంధిత సమస్యలపై సలహాలు ఇచ్చే ఒక స్వతంత్ర సంస్థ. ఈఏసీ సభ్యులతో పాటు ప్రధానికి ఇద్దరు ముఖ్య కార్యదర్శులైన పీకే మిశ్రా, శక్తికాంత దాస్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం ఈఏసీలో ఛైర్మన్, ముగ్గురు పూర్తికాల సభ్యులు, 11 మంది తాత్కాలిక సభ్యులు ఉన్నారు. ఎస్.మహేంద్ర దేవ్ ఛైర్మన్‌గా ఉండగా, సంజయ్ కుమార్ మిశ్రా, సంజీవ్ సన్యాల్, షమికా రావి పూర్తి కాల సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. 11 మంది తాత్కాలిక సభ్యులు వీరే: రాకేశ్ మోహన్, సజ్జిద్ జెడ్ చినోయ్, నీల్‌కాంత్ మిశ్రా, నీలేశ్ షా, టీటీ రామ్మోహన్, సౌమ్య కాంతి ఘోష్, కేవీ రాజు, చేతన్ ఘాటే, పామి దువా, పులక్ ఘోష్, గౌరవ్ వల్లభ్.ప్రధాని సూచించిన ఆర్థిక లేదా ఇతర అంశాన్ని విశ్లేషించి.. ఆయనకు సలహా ఇవ్వడం, స్థూల ఆర్థిక ప్రాముఖ్యత కలిగిన సమస్యల పరిష్కారానికి ప్రధానికి అభిప్రాయాలను సమర్పించడం వంటివీ ఈఏసీ విధులే. కొన్ని అంశాలపై వీరు నేరుగా స్పందిస్తారు.. లేదా ముఖ్యుల సిఫారసు మేరకూ ముందడుగు వేస్తారు.

## గురుగ్రామ్‌లో దేశంలోనే అత్యంత ఎత్తైన భవంతి

### 620 - 700 మీటర్ల నిర్మాణానికి సన్నాహాలు

జనంసాక్షి:ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే సమీపంలో, గురుగ్రామ్‌లో హరియాణా ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్ఠాత్మక గ్లోబల్ సిటీ ప్రాజెక్టులో భాగంగా దేశంలోనే అత్యంత ఎత్తైన భవనాన్నీ నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వాణిజ్య, కార్యాలయాలతో పాటు నివాస సముదాయాలతో 1000 ఎకరాల విస్తీర్ణంలో గ్లోబల్ సిటీని హరియాణా స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్‌ఎస్ఐఐడీసీ) అభివృద్ధి చేస్తోంది. ఇందులో 6.7 ఎకరాల స్థలంలో 620- 700 మీటర్ల ఎత్తున ఒక టవర్ నిర్మించాలన్నది హెచ్‌ఎస్ఐఐడీసీ ప్రణాళికగా ఒక ఆంగ్లపత్రిక తెలిపింది. ఇది కార్యరూపం దాల్చితే.. ప్రస్తుతం భారతదేశంలో అత్యంత ఎత్తైన భవనంగా ఉన్న ముంబయిలోని పాలస్ రాయల్ (ఎత్తు 320 మీటర్లు)ను వెనక్కి నెడుతుంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తు కలిగిన భవనాల్లో ఒకటిగానూ ఉంటుంది. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా (828 మీటర్లు) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనంగా ఉంది. ప్రస్తుతం దిల్లీ- ఎన్‌సీఆర్ ప్రాంతంలో అత్యంత ఎత్తైన భవనంగా నోయిడాలోని సైబర్‌థమ్ టవర్ ఎ (213.70 మీటర్లు) ఉంది.

**భారత్ సహా పలు దేశాల్లో డెలివరీ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్న విద్యుత్తు వాహనాల సంఖ్యను 2030 కల్లా రెట్టింపు చేసుకోవాలనే ఆలోచనలో, ఇ-కామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్ ఉంది. వస్తువుల డెలివరీ కోసం 2022లో విద్యుత్ వ్యాన్ల వినియోగాన్ని ప్రారంభించిన అమెజాన్.. 2025 చివరికి ప్రపంచవ్యాప్తంగా ఈ సంఖ్యను 50,000కు చేర్చింది. అయిదేళ్లలో భారత్‌లో కార్యకలాపాల కోసం 1,000 విద్యుత్ తేలికపాటి, మధ్యస్థాయి ట్రక్కులను అందుబాటులోకి తేవాలని భావిస్తోంది.**

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
8 జూన్ 2026

# జలకన్యలు పెట్టారు.. జేబులకు చిల్లు పడగొట్టారు

## తాజ్ మహల్ ఎగ్జిబిషన్ పేరుతో నల్లగొండ ప్రజల నిలువు దోపిడీ

- వినోదం పేరిట జిఎస్టీకి ఎగనామం
- భద్రత లేకుండా ప్రజల ప్రాణలతో ఆటలు




**నల్లగొండ ప్రతినిధి (జనంసాక్షి):** నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి ఈ ఎగ్జిబిషన్ కొత్త దందాలతో కొనసాగుతోంది. ఎంట్రీ ఫీజు మాత్రమే 80 రూపాయలు. లోపటికి వెళ్ళాక మాత్రం ప్రతిదానికి సపరేటు రేటు ఉంటుంది. కనీసం తాగడానికి మంచి నీళ్ళు ఉండవు. పోవడానికి మరుగుదొడ్లు ఉండవు. కనీస మౌలిక వసతులు కల్పన కూడా లేవు. అలాగే అక్కడ ఏం కొనాలన్నా ఏం తినాలన్న వాళ్ళు పెట్టిన రేటే ఫిక్సడ్ రేట్. ఒక్కో వినోదానికి ఒక్కో రేటు. మళ్ళీ జలకన్యాల పేరున నల్గొండ నగరానికి కొత్త ట్రెండ్ ని అలవాటు చేస్తూ జలకన్యలు వేసుకున్న బట్టలు కూడా వివాదాన్ని గురి తీసేలా ఉన్నాయి.

ప్రజల వినోదం పేరిట జేబులోకి చిల్లు పెడుతూ సామాన్య మధ్యతరగతి కుటుంబాలు అక్కడికి వెళ్తే సుమారుగా ఒక కుటుంబానికి 1500 నుంచి 2000 రూపాయల వరకు ఖర్చు అవుతుంది. అంటే ఎంత పెద్ద ఎత్తున ఈ లావాదేవీ జరుగుతుందో తెలిసి పోతుంది. రోజు సుమారు లక్షల్లో వ్యాపార నడుస్తూ ఉంది.ఇది కాస్త కోట్ల రూపాయలకు టర్నవర్గా వెళ్తాఉంది మరి ఈ ప్రభుత్వానికి సమకూర్చాల్సిన పన్నులు ఏవి కూడా తూ తూ మంత్రంగా చెల్లిస్తూ నిర్వహణ కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వెలువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో నాగార్జున కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న తాజ్ మహల్ ఎగ్జిబిషన్‌పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దలకు రూ.80, మూడు సంవత్సరాల పైబడిన పిల్లలకు రూ.50 చొప్పున ప్రవేశ రుసుము వసూలు చేస్తున్న నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### టికెట్లపై జీఎస్టీ వివరాలు ఏవీ?


ప్రతిరోజూ వందలాది మంది సందర్శకులు వస్తుండగా, టికెట్లపై జీఎస్టీ వివరాలు స్పష్టంగా లేకపోవడం,అలాగే టికెట్టు ధర లేక పోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజల నుంచి వసూలు చేస్తున్న మొత్తానికి సంబంధించి సరైన బిల్లులు ఇస్తున్నారా? ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కానీ అధికారులు నిర్వాహకులు ఇచ్చిన తాయిలాలకి సప్పుడు చేస్తాలేరు అనే ఆరోపణలు ఉన్నాయి. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్స్, పిల్లల ఆట పరికరాలు, విద్యుత్ అలంకరణలు, తాత్కాలిక స్టాల్స్ వద్ద తగిన భద్రతా చర్యలు కనిపించడం లేదని సందర్శకులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం లేదా ఇతర ప్రమాదాలు సంభవిస్తే అత్యవసర సహాయక చర్యలకు తగిన ఏర్పాట్లు ఉన్నాయా అనే సందేహాలు నెలకొన్నాయి. అక్కడ ఫైర్ సేఫ్టీ లేదు అని భద్రత ప్రమాణాలు లేవని తెలుస్తోంది. ఇలాంటి భారీ ఎగ్జిబిషన్లకు మున్సిపాలిటీ, ఫైర్ శాఖ, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ తదితర విభాగాల అనుమతులు తప్పనిసరి. నిర్వాహకులు అన్ని అనుమతులు పొందారా? భద్రతా తనిఖీలు జరిగాయా? అనే విషయాలు ప్రజలకు తెలియాల్సి ఉంది.




> **జిఎస్టీ అధికారులు మౌనం ఎందుకు:**
> ఒక్కో టికెట్ ధర పెద్దలకు 80 రూపాయలు మూడు సంవత్స రాల పైపడిన చిన్నారులకు 50 రూపాయల చొప్పున కౌంటర్ ఏర్పాటు చేసి టికెట్లు అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు సుమారు ఆ ఎగ్జిబిషన్ కోసం తిలకించడానికి నల్గొండ జిల్లా కేంద్రం నుంచి వందలాది మంది అక్కడ టికెట్లు కొనుగోలు చేస్తున్నారు. కానీ ఆ టికెట్లు పై ఎలాంటి జీఎస్టీ గాని ఏమి వివరాలు ఏమీ ఉండవు. మరి ఇంతగా జరుగుతున్న నల్గొండ జిల్లా కేంద్రంలో జిఎస్టి అధికారులు నిద్ర మత్తులో ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.
> లేదా ఆ ఎగ్జిబిషన్ వారితో కుమ్మక్కు అయ్యారా అనే ఆరోపణ లు కూడా బలంగా వినిపిస్తా ఉన్నాయి. ఇకనైన ఈ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు పై వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వానికి ఆదాయ వనరులు కొట్టేస్తున్న వ్యక్తుల మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

ఎగ్జిబిషన్‌లో రోజూ చిన్నారులు, మహిళలు,యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా ఘటన జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు? సందర్శకులకు బీమా సదుపాయం ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అలాంటివి ఏమి లేవు అని తెలుస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగితే మాత్రం ప్రజల ప్రాణాలకు ఎలాంటి హామీలేనట్లు అక్కడ స్పష్టం అవుతోంది. ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఈ ఎగ్జిబిషన్‌పై సంబంధిత శాఖలు ఇప్పటివరకు సమగ్ర తనిఖీలు నిర్వహించాయా లేక చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయా అనే విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారులకు అటు ఎగ్జిబిషన్ అనయులకు కొన్ని ఫ్రీగా పాసులు కూడా పంపిణీ చేసినట్టు సమాచారం.




# గుంతల మయంగా మారిన వనపర్తి పెబ్బేరు బీటీ రోడ్డు

- జిల్లాలో అధ్వానంగా మారిన ఆర్ అండ్ బి రహదారులు
- నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు
- ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులకు కనిపించడం లేదా?
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి బ్యూరో జూన్ 7 జనంసాక్షి :** జిల్లాలో ధ్వంసమైన ఆర్ అండ్ బి రోడ్లను తక్షణమే బాగు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం వనపర్తి-పెబ్బేరు రోడ్డును బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రాచాల మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 600 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారులు ఉన్నాయని, అందులో 200 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతల మయంగా ఉందన్నారు.వనపర్తి నుంచి పెబ్బేరు వరకు 20 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డులో తొమ్మిది కిలోమీటర్లకు పైగా అధ్వానంగా మారి ప్రయాణికులకు నరకయాతన కలిగిస్తుందని తెలిపారు.ప్రతినిత్యం అభివృద్ధి పేరుతో జపం చేస్తున్న జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వనపర్తి-పెబ్బేరు రోడ్డు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.అనారోగ్య సమస్యలతో పెబ్బేరు నుంచి వనపర్తికి వచ్చే ప్రయాణికులు గతుకుల, గుంతల మయంగా మారిన రోడ్డు వల్ల మార్గమధ్యలోనే అనంత లోకాలకు వెళ్లే విధంగా రహదారి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే విషయంపై ఆర్ అండ్ బి అధికారులను సంప్రదించగా రోడ్డు మరమ్మత్తులకు శాంక్షన్ కాలేదని బదులివ్వడం ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లుగా ఇటీవలే ప్రజా ప్రతినిధులు వెల్లడించినట్లు ఆయన గుర్తు చేశారు. మరి వనపర్తి-పెబ్బేరు బీటీ రోడ్డు అభివృద్ధిలో భాగం కాదా? అని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పెబ్బేరు వనపర్తి రోడ్డుతో పాటు జిల్లాలో ధ్వంసమైన ఆర్ అండ్ బి రోడ్లను బాగు చేయాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జెఎసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, చెలిమిళ్ళ రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక ఉద్యమానికి ఘన గౌరవం

- 756 ఓట్ల భారీ మెజారిటీతో అఖండ విజయం
- ఉద్యోగుల సమస్యలతో పాటు ప్రజా సమస్యల్లోనూ అండగా నిలవాలి
- మొగుళ్ల రాజిరెడ్డికి అభినందనల వెల్లువ




**ఉప్పల్, జూన్ 7 (జనంసాక్షి):** హైదరాబాద్ జలమండలి ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో భారత జాతీయ కార్మిక సంఘ కాంగ్రెస్ తరపున పోటీ చేసి 756 ఓట్ల భారీ మెజారిటీతో అఖండ విజయం సాధించిన ప్రముఖ కార్మిక నాయకుడు మొగుళ్ల రాజిరెడ్డికి ఉప్పల్ ప్రాంత ప్రజలు, అభిమానులు, సామాజిక కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు ఘన సన్మానం చేశారు.

ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్, చిలుకనగర్, నాచారం, మల్లాపూర్, హౌసింగ్ బోర్డు, సర్వోదయ నగర్, వెంకట్రెడ్డి నగర్, కాళిదాస్ నగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి మొగుళ్ల రాజిరెడ్డికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ విజయం కేవలం ఒక సంఘ ఎన్నికల విజయం మాత్రమే కాదని, కార్మికుల ఐక్యతకు, న్యాయపోరాటాలకు, కార్మిక హక్కుల పరిరక్షణకు లభించిన గౌరవమని అభిమానులు కొనియాడారు. హైదరాబాద్ జలమండలి ఉద్యోగుల సంఘ ఎన్నికలు అత్యంత ఉత్కంఠభరితంగా జరిగాయని, అలాంటి ఎన్నికల్లో 756 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడం సాధారణ విషయం కాదని నాయకులు అభిప్రాయపడ్డారు.

సన్మాన సభలో మాట్లాడిన మొగుళ్ల రాజిరెడ్డి తన విజయాన్ని ఉద్యోగులందరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఉద్యోగికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సేవా పరిస్థితుల మెరుగుదల కోసం మరింత బాధ్యతతో పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని ప్రజలు పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, మురుగునీటి కాలువల నిర్మాణం, వర్షాకాలంలో కాలనీల్లో నీటి నిల్వలు, రహదారుల అభివృద్ధి, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ ఇబ్బందులు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్మిక నాయకత్వం నుంచి ప్రజా నాయకత్వం వైపు మొగుళ్ల రాజిరెడ్డి ముందుకు సాగాలని అభిమానులు ఆకాంక్షించారు. ఉద్యోగుల సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో కూడా ఆయన అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# గృహ జ్యోతి వర్తించని గృహాలు ఎన్నో?

- జీరో బిల్లు కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ఆన్‌లైన్‌లో నాట్ అప్లికేషన్... క్రింద దరఖాస్తులు
- ఏదో సాకు చెప్పి చేతులు దులుపుకుంటున్న విద్యుత్ సిబ్బంది
- పూర్తి స్థాయిలో అమలు కాని గృహజ్యోతి



**ధారూర్ జూన్ 07(జనంసాక్షి) :** ప్రగతి పథం.సకల జనహితం. మన ప్రజా పాలనా ప్రభుత్వం.అని ఎన్నో గొప్పలు చెప్పి ప్రజా పాలన అని గ్రామాలలో ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేసి పథకాల అమలు కోసం సమర్పించిన దరఖాస్తులను స్వీకరించిన అధికారులు అనంతరం లబ్ధిదారులు పెట్టుకున్న పథకాలకు ఆన్ లైన్ లో హడావిడిగా నమోదు చేయడంతో అందరికీ గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచితంగా కరెంట్ అందడం లేదు.ప్రతినెల కరెంటు బిల్లు కరెంటు అధికారులు బలవంతంగా బిల్లులు వసూలు చేస్తున్నాట్లు ఆరోపణలు ఉన్నాయి.ఏది ఏమైనా గ్రామాలలో గృహజ్యోతి పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. మండల అభివృద్ధి కార్యాలయంలో జీరో బిల్లు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కరెంటు సిబ్బంది చెప్పడంతో ప్రజలు అధిక మొత్తంలో మండల అభివృద్ధి కార్యాలయానికి ప్రతిరోజు తిరుగుతూ జీరో బిల్లు వచ్చే విధంగా చేయండి సార్ అని అధికారులను ప్రజలు వేడుకొన్న ఫలితం దక్కడం లేదు.ఎందుకంటే అధికారులు ఏం చేయని పరిస్థితిలో ఉండిపోయారు.ఏం చేద్దాం అన్న ఆప్షన్ లేకుండా పోయింది.మరి కొంతమందికి ప్రజా పాలనలో పథకం వర్తింపు కోసం పెట్టుకున్న చాలామంది లబ్ధిదారులకు నాట్ అప్లికేషన్ అని వస్తుందని సంబంధిత అధికారులు ప్రజలకు తెలుపుతున్నారు.ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అధికారుల చేతుల్లో ఎలాంటి ఆప్షన్స్ లేవని తెలుస్తుంది. పైనుంచి ఎప్పుడు ఎడిట్ ఆప్షన్ ఇస్తారు అని ప్రజలు అధికారులు ఎదురుచూస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.గృహజోతి పథకం అమలు కోసం మండల పరిషత్ కార్యాలయంలో సుమారు 200నుండి 300మంది దరఖాస్తులు పెట్టుకొనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సంబంధిత అధికారులను అడుగగా దరఖాస్తులు వచ్చిన మాట వాస్తవమే కానీ అప్షన్ లేదని తెలిపారు.

# మచ్చబొల్లారం డంపింగ్ యార్డును తక్షణమే తరలించండి

- అధికారుల తీరుపై మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి ఆగ్రహం
- రాంకీ వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన
- 150 కాలనీల ప్రజల సమస్యలు విన్న జాతీయ మానవహక్కుల కమిషన్



**అల్వాల్, జూన్ 7 (జనంసాక్షి):** అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారం డంపింగ్‌యార్డును తక్షణమే తరలించాలని జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉపకమిషనర్ భోగేశ్వర్లుతో కలిసి డంపింగ్‌యార్డును పరిశీలించిన ఆమె.. అక్కడి పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమారు 150 కాలనీలకు చెందిన జేఏసీ ప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు పెద్దఎత్తున హాజరై తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. నివాస ప్రాంతాల మధ్య డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయడానికి సరైన అనుమతులు ఉన్నాయా? ఎవరి అధికారంతో దీనిని కొనసాగిస్తున్నారని విజయభారతి అధికారులను ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా డంపింగ్‌యార్డు కొనసాగడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, కలుషిత వాయువులతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. రాంకీ సంస్థ వేస్తున్న వ్యర్థాలు సుమారు 20 అడుగుల లోతు వరకు చేరి భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని, దీంతో ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని విజయభారతి ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డును తరలించాలని పలుమార్లు నిరసనలు తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడ్డారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులే ఇప్పుడు తమకు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాయు, నీటి కాలుష్యం కారణంగా సాధారణ జీవనం కూడా కష్టంగా మారిందన్నారు. డంపింగ్‌యార్డును పూర్తిగా తొలగించి ఆ స్థలంలో హిందూ స్మశానవాటికను అభివృద్ధి చేయాలని స్థానికులు కమిషన్ సభ్యురాలిని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీల జేఏసీ అధ్యక్షుడు ఉదయ్ ప్రకాష్, కార్యదర్శి సుధాకర్ పడాల, అఖిలపక్ష నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోహిత్ రావు, పవన్, ప్రవీణ్, కుమార్, కనకయ్య, కవిత, పుష్పవతి, ఉమా, నర్మద తదితరులు కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు.

# బాలికల విద్యాభివృద్ధికి కేజీబీవీలు పట్టుకొమ్మలు

- నీట్, జేఈఈ, క్లాట్ కోచింగ్‌లతో నల్గొండ జిల్లా కస్తూరిబా విద్యాలయాల ప్రగతి
- ఇంటర్‌లో 71.18%, పదిలో 98.47% ఉత్తీర్ణతతో రికార్డు






**నల్లగొండ,జూన్ 7 (జనం సాక్షి) :** కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా రాణిస్తూ బాలికల విద్యాభివృద్ధికి పట్టుకొమ్మలుగా మారాయని జిల్లా లింగ సమానత్వ సమన్వయకర్త అరుంధతి కొనియాడారు. కేజీబీవీలలో సాధారణ విద్యతో పాటు నీట్, జేఈఈ, క్లాట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్, ఉపాధి అవకాశాలు కల్పించే వొకేషనల్ కోర్సులను విజయవంతంగా అందిస్తున్నామని ఆమె తెలిపారు.

### 27 కేజీబీవీలు, 24 ఇంటర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్

నల్గొండ జిల్లాలోని మొత్తం 27 కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో 24 విద్యాలయాలను ప్రభుత్వం ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసింది. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ వంటి జనరల్ కోర్సులతో పాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, కంప్యూటర్ సైన్స్ వంటి ప్రతిష్టాత్మక వొకేషనల్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ విద్యార్థినులు 71.18 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని 23 కేజీబీవీలలో 16 కేజీబీవీలు 100 శాతం ఫలితాలను సాధించి రికార్డు సృష్టించాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని కేజీబీవీల సగటు ఉత్తీర్ణత 98.47 శాతంగా నమోదైంది.

### అధికారుల నిరంతర పర్యవేక్షణ

జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు, జీఈసీఓ అరుంధతి నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వమే ఈ అద్భుత విజయాలకు ప్రధాన కారణమని అధికారులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఎంఈఓలు, ప్యానెల్ అధికారులు అందించిన సూచనలతో బోధన సిబ్బంది తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విద్యార్థినులను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దారు.

### ఉచిత కోచింగ్, ప్రత్యేక క్యాంపులు

విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ విద్యా సంవత్సరంలో ఉచితంగా నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు కోచింగ్ అందించారు. వీటితో పాటు ఎంసెట్, పాలీసెట్ శిక్షణ తరగతులు, సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక సప్లిమెంటరీ క్యాంపులను సైతం ఏర్పాటు చేసి వారి విజయానికి బాటలు వేశారు.

### బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం

బాలికల విద్యాభివృద్ధి, అక్షరాస్యత పెంపు దిశగా జీఈసీఓ అరుంధతి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో బాలికల నమోదు శాతాన్ని మరింత పెంచాలని, జిల్లాలో ఎక్కడా కూడా బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను, పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమిష్టి కృషితోనే కేజీబీవీలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని ఆమె అభినందించారు.

### ఖాళీ సీట్లను సద్వినియోగం చేసుకోండి

బాలికల సమగ్ర అభివృద్ధికి కేజీబీవీలు కేరాఫ్ అడ్రస్‌గా మారాయని, జిల్లాలోని ప్రతి బాలిక ఈ ఉచిత విద్యా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలని అరుంధతి సూచించారు. జిల్లాలోని 24 ఇంటర్మీడియట్ కళాశాలలు, 27 కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లలో పూర్తిస్థాయి అడ్మిషన్లు పొందేందుకు ఆసక్తి గల విద్యార్థినులు తమకు నచ్చిన కోర్సుల్లో తక్షణమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మర్రిగూడ కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలు ఉన్నాయని ఎస్.ఓ జ్యోతి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో మర్రిగూడ కస్తూరిబా రూపురేఖలు మారిన విషయం అందరికీ విధితమే. అత్యాధునిక సదుపాయాలతో కస్తూరిబా డెవలప్ కావడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు.

- కొత్త బైలా అమలు కాకుండా అడ్డుకాలు..
- రాజకీయాలకు అడ్డాగా మారిన జిల్లా కార్యాలయం
- 18 ఏళ్ల అక్రమ 'గ్రామ ఓబీ' పాలనకు కొమ్ముకాస్తున్న జిల్లా అధికారులు
- మహిళా సంఘాల ఆందోళన, విచారణ డిమాండ్



# మహిళా సాధికారతకు అడ్డుగా నల్గొండ జిల్లా అధికారి!

**మర్రిగూడ, జూన్ 7 (జనంసాక్షి):** ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం కోట్లు ఖర్చు చేసి తీసుకొచ్చిన 'కొత్త బైలా' నిబంధనలు నల్గొండ జిల్లాలో అమలు కాకుండా జిల్లా అధికారులు అడ్డుకాలు వేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా సాధికారతకు కేంద్రంగా ఉండాల్సిన జిల్లా కార్యాలయం రాజకీయాలకు అడ్డాగా మారిందని, నిబంధనలకు విరుద్ధంగా 18 ఏళ్లుగా కొనసాగుతున్న గ్రామ ఓబీలకు అధికారులు బహిరంగంగా మద్దతు పలుకుతున్నారని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

సెర్ప్ కొత్త బైలా 14.3 ప్రకారం మహిళా సమాఖ్య పాలకవర్గ సభ్యుల గరిష్ట పదవీ కాలం 3 సంవత్సరాలు మాత్రమే. తిరిగి పోటీ చేసే అర్హత లేదు. ప్రతి ఏడాది 1/3 వంతు సభ్యులు రొటేషన్ పద్ధతిలో విరమించి కొత్తవారు రావాలి. మొదటిసారి లాటరీ ద్వారా పదవీ కాలం నిర్ణయించాలి. కానీ మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామంలో ఒకే మహిళ 2008 నుండి 2026 వరకు 18 ఏళ్లుగా గ్రామ ఓబీగా అక్రమంగా కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం ఎప్పుడో పదవీ కాలం ముగిసినా జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోగా వారికే మద్దతు పలుకుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అక్రమాల పర్వం

మండల ఏపీఎం, సీసీ, వీఓలు క్షేత్రస్థాయికి వెళ్లి రికార్డులు తనిఖీ చేయడం లేదు. ఆఫీసులో కూర్చొని తప్పుడు నివేదికలు పంపుతున్నారని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. మర్రిగూడ మహిళా సమాఖ్యలో అకౌంటెంట్ వ్యవహార శైలి, మార్కెటింగ్ కమిటీ నిధుల నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల లెక్కల్లో పారదర్శకత లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డబుల్ జీతాలు తీసుకుంటున్న సిబ్బందిపై చర్యలు లేవని ఆరోపణలు చేస్తున్నాయి.

### మహిళల ఆక్రోశం

"కొత్త బైలా గురించి మాకు చెప్పనే లేదు. పదవుల్లో ఉన్నవారు దిగిపోవడం లేదు, అధికారులు దిగిపోమని చెప్పరు. మీటింగ్‌లో మాట్లాడనివ్వరు. 'మేము చెప్పిందే వేదం' అని బెదిరిస్తున్నారు" అంటూ ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా సాధికారత నీటి మూటగా మారిందని వేదన వ్యక్తం చేస్తున్నారు.

### మహిళా సంఘాల డిమాండ్లు

- కొత్త బైలా అమలు చేయకుండా అడ్డుకుంటున్న జిల్లా అధికారిపై వెంటనే శాఖాపరమైన విచారణ జరపాలి.
- 18 ఏళ్లుగా అక్రమంగా కొనసాగుతున్న గ్రామ ఓబీని తక్షణమే తొలగించి ఎన్నికలు నిర్వహించాలి.
- మర్రిగూడ మహిళా సమాఖ్య నిధుల వినియోగంపై స్వతంత్ర సంస్థతో ఆడిట్ చేయించాలి.
- డబుల్ జీతాలు తీసుకుంటున్న సిబ్బందిని తొలగించి రికవరీ చేయాలి. ఏళ్ల తరబడి ఒకేచోట ఉన్న సిబ్బందిని బదిలీ చేయాలి.
- రాజకీయాలకు అడ్డాగా మారిన జిల్లా కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలి.

ఏండ్లుగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఓబీలను తొలగించకుండా వారికే మద్దతు పలకడంపై జిల్లా అధికారిపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ 18 ఏళ్ల అక్రమ పాలన వెనుక ఉన్న లబ్ధిదారులు ఎవరు? జిల్లా అధికారి ప్రమేయం లేకుండా ఇది సాధ్యమేనా? మహిళా సాధికారతకు అడ్డుగా నిలుస్తున్న అధికారిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత జిల్లా అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.

## భీమన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 7 (జనంసాక్షి) :




తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద శైవక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుటుంబ సమేతంగా ఆదివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు,వేద పండితులు స్వాగతం పలికారు.భీమన్న ఆలయంలో ఆయన కోడె మొక్కులు చెల్లించుకొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం నిర్వహించగా ఆలయ ఏఈఓ శ్రావణ్ కుమార్, ఆలయ పిఆర్ఓ అశోక్ స్వామి వారి శేష వస్త్రాలు ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. రాజన్న ఆలయం అభివృద్ధి చెందుతున్నప్పటికీ భీమేశ్వర ఆలయంలో భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని దేశం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటుండటం స్వామివారి మహిమలకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు.

## ఇండియన్ ఆర్మీ ఫలితాల్లో 'ఢిల్లీ డిఫెన్స్' ప్రభంజనం

**ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో 193 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక**

**ఢిల్లీ డిఫెన్స్ అకాడమి చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి**



**కరీంనగర్ బ్యూరో, జూన్ 07 (జనంసాక్షి) :** గత నెల మే 30న వెలువడిన ఇండియన్ ఆర్మీ ఫలితాలలో ఢిల్లీ డిఫెన్స్ అకాడమి విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని సంస్థ చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి మాట్లాడుతూ... వివిధ విభాగాలలో మొత్తం 193 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ఆయన తెలిపారు. ఇందులో అగ్నివీర్ జనరల్ డ్యూటీ విభాగంలో 157 మంది, అగ్నివీర్ టెక్నికల్ విభాగంలో 17 మంది, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ విభాగంలో 14 మంది, అగ్నివీర్ క్లర్క్ విభాగంలో ఒకరు, ఎయిర్‌ఫోర్స్‌లో నలుగురు (జె. శన్ముఖ్ సాయి రాజ్, ఎ. చరణ్ తేజ్, ఎస్. శ్రిజ, పి. మధుమిత) ఉద్యోగాలు సాధించారని వివరించారు. మారుతున్న ఎంపిక విధానానికి అనుగుణంగా విద్యార్థులకు నిరంతరం పరీక్షలు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నామని సతీష్ రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూ శారీరక, మానసిక శిక్షణ ఇస్తుండటం వల్లే రాత, శారీరక పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఇంతటి విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మీ ఉద్యోగాలే లక్ష్యంగా ఉన్న నిరుద్యోగులు అకాడమీలో చేరి తమ కలలను నిజం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## హరీష్ రావును అడ్డుకున్న పోలీసులు


**గోదావరిఖని, జూన్ 7, (జనం సాక్షి) :** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం సీఎస్పీ లో కార్మికులను కలిసేందుకు వచ్చిన హరీష్ కు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీనితో హరీష్ రావు వెనుతిరిగారూ.
టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి పరిరక్షణ సదస్సుకు హాజరయ్యేందుకు వచ్చిన హరీష్ రావు ముందుగా సి.ఎస్.పి వద్దగల బొగ్గు నిల్వలు, కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు వస్తున్న క్రమంలో హరీష్ రావు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి తదితరులను అడ్డుకున్నారు. దీంతో హరీష్ రావు సింగరేణి పరిరక్షణ సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లారు.

## డైరీ ఫార్మ్ నిర్వహకుడి ఆత్మహత్య

**చొప్పదండి, జూన్ 7 (జనం సాక్షి ):** మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన డైరీ ఫార్మ్ నిర్వహకుడు. ముద్దం రాజ నరసయ్య( 62 ) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చొప్పదండి మండలం చాకుంట గ్రామం లోని ముద్దం రాజనర్సయ్య గతం లొ డైరీ ఫార్మ్ పెట్టడం ద్వారా లాస్ అవ్వటం తో తన యొక్క వ్యవసాయ భూమి అమ్ముకోవడం ద్వారా మనస్థాపానికి గురై శనివారం సాయంత్రం 5:30 సమయం లొ గడ్డి మందు త్రాగడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలోచికిత్స పొందుతూ రాజ నరసయ్య ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ముద్దం నరేందర్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## యువత స్వయంకృషితో అభివృద్ధి సాధించాలి

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా




**కడ్తాల్ జూన్ 07(జనంసాక్షి):** చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు చెడు అలవాట్లకు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల పై ఆధారపడకుండా స్వయం కృషితో అభివృద్ధి సాధించాలని ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు.ఆదివారం హైదరాబాద్ శ్రీశైలం రహదారి పక్కన కడ్తాల్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ ప్రాంగణంలో పట్టణానికి చెందిన నిరుద్యోగ యువకులు సిద్ది గారి సురేష్,మూడ రవి టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నారు.ముఖ్యఅతిథిగా గంప వెంకటేష్ గుప్తా స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యం,డ్రగ్స్ వంటి చెడుఆలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు.తల్లిదండ్రులకు భారం కాకుండా బాధ్యతగా స్వయం ఉపాధి రంగాలను ఏర్పాటు చేసుకుని అందులో ఆర్థికంగా బలపడాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,డిసిసి ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ రాయకంటి బిక్షపతి,అన్మాస్ పల్లి ఉప సర్పంచ్ క్యాసిక మహేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,వార్డు సభ్యులు కొప్పు కృష్ణ,ముత్తు కృష్ణ,చంద్రయ్య,రమేష్,వంశీ,మహేష్,మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా,మాజీ ఏఎంసీ డైరెక్టర్ లాయక్ అలీ,అమృతం పాండు,బీ.నరసింహ,రామచంద్రయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కే.అంజి,సిద్దిగారి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.



## కట్టేశారు.. వదిలేశారు

*పల్లె దవఖాన ప్రారంభానికి మోక్షం ఎప్పుడో..?*

- 20 లక్షలతో నిర్మాణం.. 2 సంవత్సరాలు మూసుకునే ఉంది
- ప్రజలకు వైద్య సేవలు అందకుండా నిర్లక్ష్యం

**కుల్కచర్ల, జూన్ 7 (జనం సాక్షి):** మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామానికి దాదాపు 20 లక్షల నిధులతో పల్లె దవఖాన మంజూరు కావడం జరిగింది. పనులు పూర్తయి దాదాపు 2 సంవత్సరాలు గడిచినప్పటికీ దవఖాన ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరి ప్రారంభానికి మోక్షం ఎప్పుడో అని గ్రామ ప్రజలు గుసగుసలాడుతున్నారు.ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం కోసం ఏర్పాటు చేసిన పల్లె దవఖానాని గాలికి వదిలిపెట్టినట్టుగా ఉందని బాధపడుతున్నారు.గ్రామాల్లో వైద్య సేవలు విస్తరించేలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా పల్లె దవఖానాను ఏర్పాటు చేస్తే వాటిని ప్రారంభించడంలో అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. పేరుకు మాత్రం కట్టిరి వదిలిపెట్టిరి అని కాకుండా వీలైనంత తొందరగా ఈ దవఖానాను ప్రారంభిస్తే ఆ గ్రామానికి చుట్టుపక్కల ఉన్న గిరిజన దండాలు, చిన్న చిన్న గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవచూపి దవఖానను ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు కొత్త సారథి

- డాక్టర్ రాహుల్ దేవరాజ్ బాధ్యతల స్వీకరణ
- అధికారికంగా బాధ్యతలు అప్పగించిన నిమ్స్ పూర్వపు డైరెక్టర్ నగరి బీరప్ప
- నిమ్స్‌లో యూరాలజీ విభాగాధిపతిగా సేవలందిస్తున్న డా.రాహుల్ దేవరాజ్



**ఖైరతాబాద్, జూన్ 07 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కు19వ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ డా.రాహుల్ దేవరాజ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.యూరాలజీ విభాగాధిపతిగా సేవలందిస్తున్న ఆయనకు, పూర్వ డైరెక్టర్ డా.నగరి బీరప్ప అధికారికంగా బాధ్యతల ను అప్పగించారు.బాధ్యతల స్వీకరణ అనంతరం డా.రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. నిమ్స్‌ను వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.రోగులకు అత్యాధునిక, నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలను అందించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.నగరి బీరప్ప మాట్లాడుతూ.. నిమ్స్ అభివృద్ధిలో అధ్యాపకులు, వైద్యులు, సి బ్బంది అందించిన సహకారం కీలకమని తెలిపారు . నూతన డైరెక్టర్ నాయకత్వంలో సంస్థ మరిన్ని విజయాలు సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశా రు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, పరిపాలన విభాగ హెచ్‌ఓడీ డా.లక్ష్మీ భాస్కర్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.కృష్ణ రెడ్డితో పాటు డా.అమరేశ్వర్, డా. రామ్మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొని నూతన డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ధైర్యంగా వెళ్లి కంటి ఆపరేషన్లు చేయించుకోండి





- **మహిళలు, వృద్ధులకు ఆత్మీయ భరోసా ఇచ్చిన కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి**

**మర్రిగూడ, జూన్ 7, (జనం సాక్షి) :** మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండోసారి నిర్వహించిన 14వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. సుశీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షల కోసం వచ్చిన మహిళలు, వృద్ధులను ఆమె ఆత్మీయంగా పలకరించి వారి కుటుంబ, వ్యక్తిగత బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కంటి చికిత్సకు ఎంపికైన వారు ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్ చేయించుకుంటే చూపు మెరుగుపడుతుందని, అవసరం లేని వారికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు.
ఆపరేషన్లకు వెళ్లే వారు భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా ఉంటేనే చికిత్స విజయవంతమవుతుందని పేర్కొన్నారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 9,766 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 2,198 మందికి కంటి ఆపరేషన్లు చేయించామని, 4,227 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామని వెల్లడించారు. వేలాది మంది పేదలకు కంటి వెలుగు అందించడమే లక్ష్యంగా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. శిబిరానికి హాజరైన ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం కల్పించడంతో పాటు స్వయంగా భోజనం వడ్డించి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండలానికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## పాము కాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి

**శంషాబాద్, జూన్ 7 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారం గ్రామ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. పొలంలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న నాలుగేళ్ల చిన్నారి పాము కాటుకు గురై మృతి చెందింది.పోలీసుల వివరాల ప్రకారం, ఒడిశా రాష్ట్రానికి చెందిన రాహుల్ పరభూయే కుటుంబం గత ఏడాది నుంచి కాచారం గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటోంది. అదే ప్రదేశంలో అతని అన్న ఛోటు పరభూయే కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. శనివారం రాత్రి భోజనం అనంతరం వేడి ఎక్కువగా ఉండటంతో కుటుంబ సభ్యులు గది బయట నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 12:10 గంటల సమయంలో ఛోటు పరభూయే కుమార్తె పల్లవి (4) ఒక్కసారిగా ఏడవడంతో తల్లి మేల్కొని చూడగా బాలిక పక్కనే పాము కనిపించింది. బాలిక పొట్ట కింది భాగంలో పాము కాటుకు సంబందించిన గాయం గుర్తించారు. వెంటనే చిన్నారిని శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ లోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున సుమారు 2:40 గంటలకు చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు.



## బోయినపల్లి మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


**'ఎన్ఎమ్ఎమ్ఎస్'కు ముగ్గురు ఎంపిక**

**బోయినపల్లి, జూన్ 07 (జనం సాక్షి) :** జాతీయ స్థాయిలో నిర్వహించిన 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్' (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శ్రీహర్షిత, లాస్య, శృతి ఈ ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, ఎంపికైన వారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తి వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12,000 చొప్పున. మొత్తంగా రూ.48,000 ఆర్థిక సహాయం అందనుందని వివరించారు. ఈ స్కాలర్‌షిప్ విద్యార్థుల ఉన్నత చదువులకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ సాధించడం పట్ల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కటుకం రాజకుమార్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను పరీక్షకు సన్నద్ధం చేసిన గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు ఇరప నాగలక్ష్మి, క్లాస్ టీచర్లు గూడూరు శ్రీనివాసరావు, కాసు శ్రీనివాస్‌లను, ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## చేవెళ్లలో ఈగల్ పోలీస్ టీం తనిఖీలు



**చేవెళ్ల, జూన్ 07 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిషేధిత డ్రగ్స్, మాదక ద్రవ్యాలను ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఈగల్ టీం బృందం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ ఇతర పబ్లిక్ ప్రాంతాల్లో పోలీస్ డాగ్స్‌తో ఈగల్ బృందం, పోలీస్లు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల పరిసర ప్రాంతాల నందు గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన మత్తుపదార్థాలను అమ్మిన కొనుగోలు చేసిన చట్టరీత్యానేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదుచేసా బిమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌లు ఉన్నారు.



### జిల్లా స్థాయిలో చక్రం తిప్పుతున్న పెద్దలు ఎవరు?

**సర్పంచ్ తన అనుకూల వ్యక్తులు,భర్త పేరు మీద. పంచాయతీ కారోబార్ పేరు మీద పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా తన సొంత కుమారుడి పేరు ధర్మ గళ్ళ సాయి కార్తీక్ మీద రూ. 2.95 లక్షల నిధులు మళ్లించడం అక్షరాలా చట్ట విరుద్ధం. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఇది తీవ్రమైన నేరమని తెలిసినా, ఫైలు ముందుకు కదలకపోవడం వెనుక జిల్లా స్థాయిలో 'చక్రం తిప్పే' కొందరు రాజకీయ పెద్దల హస్తం ఉన్నట్లు స్పష్టమైన ఆరోపణలు వస్తున్నాయి. ఆమె వెనుక, సదరు పాలకవర్గం వెనుక అధికార పార్టీకి చెందిన లేదా జిల్లా స్థాయిలో పట్టున్న ఒక అదృశ్య శక్తి ఉండి అధికారులను నియంత్రిస్తోందా? అందుకేనా చట్టం తన పని తాను చేయకుండా కుంటుపడుతోంది?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.**

## విచారణలన్నీ ఉత్తదేనా?

- సీఈఓ గడువు ముగిసినా కదలని ఫైల్
- వెనకనుండి చక్రం తిప్పుతున్నదెవరు?

### పెద్దమల్లారెడ్డి మేజర్ గ్రామ పంచాయతీ స్కామ్

**భిక్కనూరు జూన్ 07 (జనంసాక్షి):**
కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి మేజర్ గ్రామ పంచాయతీలో నిబంధనల ఉల్లంఘనలు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నా, సాక్ష్యాలు నోరు విప్పి చెపుతున్నా.. పెద్దమల్లారెడ్డి గ్రామ పంచాయతీ అవినీతి ఫైలు కదలకుండా ఉన్నచోటే ఎందుకు ఆగిపోయింది? "పది రోజుల్లో పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తాం" అని స్వయంగా జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందర్ నాయక్ మీడియా ముఖంగా ప్రకటించి వారాలు గడుస్తున్నా,నేటికీ ఆ నివేదిక వెలుగు చూడకపోవడం వెనుక ఉన్న అసలు మతలబు ఏమిటి? జిల్లా స్థాయి అత్యున్నత అధికారి స్వయంగా వచ్చి విచారణ జరిపినా,ఇంతవరకు కంటితుడుపు చర్యలు కూడా లేకపోవడం స్థానికంగా తీవ్ర దురదృష్టకరంగా మారింది. ఇప్పుడు ఇదే విషయంపై జిల్లా వ్యాప్తంగా ప్రజలు, సామాజిక శక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు.

**నివేదిక వస్తుందా?బుట్టదాఖలు అవుతుందా?**

విచారణ రోజున స్వయంగా సీఈఓ నే కొన్ని నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ఒప్పుకున్నారు. పంచాయతీ నిధులు దారి మళ్లాయని, రూల్స్ దాటి పనులు జరిగాయని స్పష్టమైన ప్రాథమిక ఆధారాలు దొరికిన తర్వాత కూడా చర్యల్లో ఈజాప్యం దేనికి సంకేతం? ఈనివేదిక అసలు కలెక్టర్ టేబుల్ మీదికి చేరుతుందా లేక రాజకీయ ఒత్తిళ్లతో ఎటో ఒకచోట మూలన పడిపోతుందా?అనే బలమైన అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**సామాన్యుడికో చట్టం.. అధికారులకో చట్టమా?**

ఒక సామాన్య పౌరుడు చిన్న తప్పు చేస్తే క్షణాల మీద స్పందించి లాకప్‌లలో పెట్టే మన చట్టాలు, వ్యవస్థలు.. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని నమ్ముకున్న బినామీల అకౌంట్లలోకి మళ్లించిన అధికారులను, ప్రజాప్రతినిధులను ఎందుకు తాకలేకపోతున్నాయి? ప్రజలను పట్టి పీడించే ఇలాంటి అవినీతి అధికారుల కోసం చట్టంలో ఏమైనా ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయా? పంచాయతీ నిధుల లూటీ వ్యవహారం ఎప్పటికీ ఒక కొలిక్కి రాదా? అని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

**న్యాయం గెలవాలి..నివేదిక బయటపడాలి**

సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చేసిన ఈ నిధుల దుర్వినియోగంపై జాప్యం జరగడం వల్ల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సడలిపోతోంది. విచారణ అధికారి విచారించి వెళ్లిన తర్వాత కూడా ఎలాంటి యాక్షన్ తీసుకోకపోవడం, బాధ్యులను సస్పెండ్ చేయకపోవడం అవినీతికి మరింత ఊతమిచ్చినట్లవుతుంది.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని, భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి పంచాయతీ విచారణ నివేదికను తక్షణమే తెప్పించుకుని బాధ్యులపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, దోచుకున్న ప్రజాధనాన్ని రికవరీ చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో ఈఅవినీతిపై పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం తప్పదని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌కు సాన్వి డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల ఎంపిక

- **ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించిన సాన్వి డిఫెన్స్ అకాడమీ చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్**

**కరీంనగర్ బ్యూరో, జూన్ 07 (జనంసాక్షి) :**
కరీంనగర్ రేకుర్తి సాన్వి డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకుని ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ నియామకాల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ మాట్లాడుతూ... గత ఫిబ్రవరి లో వరంగల్లో జరిగిన ఆర్మీ ఓపెన్ ర్యాలీలో పాల్గొని మే 31వ తేదిన ప్రకటించిన ఫలితాల్లో సాన్వి డిఫెన్స్ అకాడమీ విద్యాసంస్థల నుండి ఆర్మీ వివిధ ట్రేడ్ లలో మొత్తం 56మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. మా కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఇంటర్మీడియట్లో రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులు, ఎంసెట్,




ఐఐటీ పోటీ పరీక్షల్లో మంచి ర్యాంక్‌లు సాధించారని, పెద్ద మొత్తంలో డిఫెన్స్ ఉద్యోగాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
8 జూన్ 2026

## ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవంలో
# బీపీ ఆచార్య కవితా సంకలనం ఆవిష్కరణ




**ఖాట్మండు (జనంసాక్షి) :** నేపాల్ రాజధాని ఖాట్మండులో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవం నాల్గవ ఎడిషన్‌లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, రచయిత బి.పి. ఆచార్య సంపాద కత్వం వహించిన 'పోయమ్స్ అక్రాస్ టైం' కవితా సంకలనం అంతర్జాతీయ పాఠకుల కోసం ఘనంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని నేపాల్ మాజీ ప్రధాన మంత్రి, మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కార్కీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రముఖ ఒడియా రచయిత్రి డాక్టర్ ప్రతిభా రాయ్ తో పాటు భారత్, నేపాల్‌కు చెందిన పలువురు సాహితీవేత్తలు, కవులు, మేధావులు పాల్గొన్నారు.

'పోయమ్స్ అక్రాస్ టైం' ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల సాహిత్య సృజనను ఒకే సంకలనంగా పాఠకుల ముందుకు తీసుకువచ్చింది. ఇందులో బీపీ ఆచార్య, ఆయన పెద్దన్నయ్య దివంగత డాక్టర్ డీపీ ఆచార్య, అలాగే విదేశాల్లో స్థిరపడిన ఆయన మేనల్లుడు అన్షుమన్ రచించిన కవితలు చోటు చేసుకున్నాయి. కాలం, అనుభ వాలు, సంస్కృతులు, భౌగోళిక నేపథ్యాలు భిన్నమైనప్పటికీ మానవీయ భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, జీవన తాత్వికత, కాల ప్రవాహం వంటి విశ్వవ్యాప్త అంశాలను ఈ కవితలు ప్రతిబింబిస్తున్నాయి. మూడు తరాల సాహిత్య దృక్పథాలను సమన్వయం చేసిన ఈ సంకలనం సమకాలీన ఆంగ్ల కవిత్వంలో ఒక విశిష్ట కృషిగా నిలుస్తుందని సాహిత్య విమర్శకులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ పాఠకులను దృష్టిలో ఉంచుకుని ప్రచురించిన ఈ పుస్తకం ప్రస్తుతం అమెజాన్ వేదిక ద్వారా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంది. ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవం వంటి అంతర్జాతీయ సాహిత్య వేదికపై ఈ కవితా సంకలనం ఆవిష్కరణ జరగడం భారతీయ సాహిత్యానికి, ముఖ్యంగా ఒడిశా సాహిత్య సంప్రదాయానికి అంతర్జాతీయ గుర్తింపును మరింత పెంచిందని ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు.

# పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఆదర్శం

- స్మార్ట్ పోలీసింగ్‌కు, ప్రజా భద్రతకు దేశానికే దిక్సూచి
- సందర్శించిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధుల బృందం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజా భద్రత, సాంకేతిక ఆధారిత పరిపాలన, స్మార్ట్ గవర్నెన్స్ రంగాల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన విశేష పురోగతిని అధ్యయనం చేసేందుకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధుల బృందం తెలంగాణ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్రంలోని అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు, ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్ వ్యవస్థలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం, డేటా ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, విపత్తుల నిర్వహణ వ్యవస్థలు మరియు ప్రజా భద్రత కోసం తెలంగాణ పోలీసులు వినియోగిస్తున్న అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాల గురించి అధికారులు సమగ్రంగా వివరించారు.

సందర్శన అనంతరం ఫోరం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ దేశంలోనే అత్యంత ఆధునికమైన, సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో నిర్మించబడిన ప్రజా భద్రతా కేంద్రాలలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కేంద్రం తెలంగాణ రాష్ట్ర దూరదృష్టికి, ప్రజల భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతకు మరియు తెలంగాణ పోలీసు శాఖ వృత్తి నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో రూపొందించిన ఈ కేంద్రం కేవలం పోలీసింగ్‌కే పరిమితం కాకుండా, ఆధునిక నగర నిర్వహణ, విపత్తుల సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన, సమగ్ర ప్రజా భద్రతా వ్యవస్థలకు ఒక మోడల్‌గా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. లక్షలాది సీసీటీవీ కెమెరాల అనుసంధానం, రియల్‌టైమ్ డేటా విశ్లేషణ, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ, నేరాల నియంత్రణ మరియు ట్రాఫిక్ నిర్వహణలో ఈ కేంద్రం పోషిస్తున్న పాత్ర విశేషమని అభిప్రాయపడ్డారు. తెలంగాణ పోలీసు శాఖ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలను అందిస్తున్న విధానం దేశవ్యాప్తంగా ప్రశంసనీయమని ఫోరం సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్మించిన తెలంగాణ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఈ కేంద్రం కీలక భూమిక పోషిస్తోందని, సురక్షిత తెలంగాణ నిర్మాణంలో ఇది ఒక మైలురాయిగా నిలిచిందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్శనలో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పికె ఝా, ప్రొఫెసర్ ఎ. రఘురామరావు, మాజీ టీఎస్‌పీఎస్సీ సభ్యుడు టి. వివేక్, ఫిల్మ్ మేకర్, సామాజిక కార్యకర్త సయ్యద్ రఫీ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి గోపాల్ రెడ్డి, భారత వైమానిక దళానికి చెందిన కెప్టెన్ సురేష్ రెడ్డి, ప్రొఫెసర్ మోహన్ రావు (ప్రకాశం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) తదితరులు పాల్గొన్నారు.

# విదేశీయులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వైద్యం

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం!**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌ను ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కాపిటల్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా.. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ విదేశీయులకు వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. గౌతమి, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప సభ్యులుగా నియమించింది. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అమలుకు సంబంధించిన వివిధ అంశాలను కమిటీ పరిశీలించనుంది. టిమ్స్ సనత్‌నగర్‌లో ప్రత్యేక ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం బ్లాక్ ఏర్పాటుపై అధ్యయనం చేయడంతో పాటు, విదేశీ రోగులకు అందించే వైద్య సేవలు, వాటికి తగిన ప్యాకేజీలు, ధరల విధానాన్ని సూచించనుంది. అలాగే భాషా అనువాద సేవలు, పేషెంట్లకు అందించే ఆహారం, తదితర అంశాలపై సిఫార్సులు చేయనుంది. తెలంగాణ మెడికల్ అండ్ వెల్‌నెస్ టూరిజం ప్రమోషన్ బోర్డుతో సమన్వయం చేస్తూ ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అభివృద్ధికి అవసరమైన ప్రచార, మార్కెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై కూడా కమిటీ సూచనలు చేయనుంది. కమిటీ నెలరోజుల్లో తన నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను గ్లోబల్ హెల్త్‌కేర్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో త్వరలో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయిం చింది. ఈ సందర్భంగా నిమ్స్, టిమ్స్, ఉస్మానియా, గాంధీ తదితర ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అందుతున్న అత్యాధునిక వైద్య సేవలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయనున్నారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు, కార్డియాక్ కేర్, ట్రామా కేర్, న్యూరో సైన్సెస్, గ్యాస్ట్రో సైన్సెస్ వంటి అత్యాధునిక వైద్య సేవలతో ప్రభుత్వ హాస్పిటల్స్ ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయి. ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న తాజా చర్యలు తెలంగాణను ప్రపంచ ఆరోగ్య పటంలో మరింత ముందుకు తీసుకెళ్లనున్నాయి.

## మహిళా పోలీస్ అధికారి
# స్పై ఆపరేషన్

- పబ్‌లో అసాంఘిక కార్యక్రమాలు బట్టబయలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆమె అర్ధరాత్రి సమయంలో సింగిల్‌గా పబ్‌లోకి నడుచుకుంటూ వెళ్లి డేరింగ్ ఆపరేషన్ చేసింది. అక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను షూట్ చేసి ఆ పబ్‌ను నిర్వహిస్తున్న వారిని కటకటాల్లోకి నెట్టేసింది. ఆమెనే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రితిరాజ్. లేడీ ఆఫీసర్ డీసీపీ రితిరాజ్ అర్ధరాత్రి సమయంలో తన సెక్యూరిటీని దూరంగా పెట్టేసి ఒంటరిగానే పబ్‌లోకి వెళ్లారు. ఆ పబ్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలని డైరెక్ట్ గా స్పై ఆపరేషన్ చేశారు. పబ్‌లో జరుగుతున్న కార్యక్రమాలను షూట్ చేసి స్థానిక పోలీసులను పిలిచారు. పబ్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై డీసీపీ రితిరాజ్ స్థానిక పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులను పిలిచి వెంటనే పబ్‌లో సోదాలు నిర్వహించిన లేడీ డీసీపీ పబ్‌లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. పబ్‌లో కస్టమర్లను ఆకర్షించేందుకు గలీజ్ దందా చేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు.. కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్ మేనేజర్‌ను అరెస్టు చేశారు.

# నదీ జలాలపై కాంగ్రెస్ రాజీ

- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** గోదావరి నల్లమల సాగర్‌కు పాలమూరు రంగారెడ్డికి లింక్ పెట్టడమంటే.. తెలంగాణ రాష్ట్రానికి ట్రిబ్యునల్ ద్వారా లభించిన నదీ జలాలపై రాజీపడటమే అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పాలకులు కృష్ణా జలాలను బనకచర్ల రూపంలో కృష్ణార్పణం చేశారని అన్నారు. ఇప్పుడు గోదావరి జలాలపై ద్రోహం తలపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో నష్టం జరిగిందంటే అక్కడి నేతలే పాలకులుగా ఉన్నారని తెలిపారు. కానీ స్వరాష్ట్రంలో పాలకుల చేతిలో అన్యాయం జరిగితే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి బనకచర్ల అని ఏపీ ప్రభుత్వం మొదలుపెట్టిందని తెలిపారు. ఆ కుట్రలను బయటపెట్టిందే బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. పోలవరం బనకచర్లతో అన్యాయం జరుగుతుందని ప్రశ్నించామని తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా పరివాహకానికి తరలిస్తే జీడబ్ల్యూడీటీ అవార్డు ప్రకారం.. 14-21-45 రేషియో ప్రకారం హక్కులు సంక్రమిస్తా హరీశ్‌రావు తెలిపారు. 14 కర్ణాటకకు, 21 మహారాష్ట్రకు, 45 తెలంగాణకు సంక్రమిస్తాయని వివరించారు. పోలవరం విషయంలో అవార్డు పాసైందని వెల్లడించారు. 80 టీఎంసీల కంటే ఎక్కువ నీళ్లు తీసుకెళ్తే ఇవే హక్కులు సంక్రమిస్తాయని స్పష్టం చేశారు. అందుకే ఇప్పుడు బనకచర్ల కాదు.. నల్లమలసాగర్ అని చంద్రబాబు అంటున్నారని తెలిపారు. కృష్ణాలో కలిస్తే ట్రిబ్యునల్ అవార్డు ఉందని ఒక ఫేజ్ తగ్గించి, గోదావరి నల్లమల సాగర్ అని రెండో ప్రయత్నం మొదలుపెట్టారని చెప్పారు. గోదావరిలో మిగులు జలాలే లేవని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మిగులు జలాలపై గలంలో ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయాన్ని కేంద్రమే స్పష్టం చేసిందని వెల్లడించారు. అందుకే ఇప్పుడు మూడో ప్లాన్ అమలుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే గోదావరి-కావేరి ఇంటర్ లింకింగ్‌ను ముందుకు తెచ్చారని తెలిపారు. తెలంగాణ భూభాగం టచ్ కాకుండా గోదావరి నీటిని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసే కుట్రకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూపాయి ఖర్చు లేకుండా జాతీయ ప్రాజెక్టు కింద నిర్మించుకునే యత్నం చేస్తున్నారని అన్నారు. సమ్మక్క సాగర్ 47 టీఎంసీలు కూడా మనం వదులుకోవాలని అంటున్నారని.. దీనికి డూడూ బసవన్నల లెక్క రేవంత్ రెడ్డి తలూపుతున్నాడని మండిపడ్డారు. 2015 జనవరి 6వ తేదీన నిర్వహించిన సమావేశానికి నీటిపారుదల శాఖ మంత్రిగా హాజరయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. మాకు 1050 టీఎంసీల అవసరం ఉంది, మా అవసరాలు తీరినంకనే ఇంటర్ లింకింగ్ రివర్స్ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించామని పేర్కొన్నారు. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్‌కు లింక్ చేసేందుకు నాటి కర్ణాటక మంత్రి డీకే శివకుమార్, ఏపీ మంత్రి దేవినేని ఉమ ఒప్పుకున్నారని తెలిపారు. తెలంగాణ సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లకు అనుమతి ఇవ్వాలని కేంద్రం చెప్పిందని అన్నారు. సమ్మక్క సాగర్ నుంచి నాగార్జున సాగర్‌కు అడ్డగోలుగా భూసేకరణ చేయొద్దని చెప్పామన్నారు. తక్కువ భూమి తీసుకున్న మంచి పరిహారం ఇస్తామని కేంద్రం చెప్పిందని అన్నారు. పోలవరం నుంచి కావేరి లింక్ పెడితే తెలంగాణకు అన్యాయం కాదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# నిమ్స్ డైరెక్టర్‌గా రాహుల్ దేవరాజ్ నియామకం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్నియమితులయ్యారు. ఈ మేరకు రాహుల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారిక ఉత్వర్వులు జారీ చేసింది. ఇతను మూడు సంవత్సారాలు ఈ పదవిలో కొనసాగనున్నాడు. కాగా, ప్రస్తుతానికి డా. రాహుల్ దేవరాజ్ నిమ్స్ యూరాలజీ విభాగం అధిపతిగా సేవలు అందిస్తున్నారు. నిమ్స్ ఆసుపత్రిలో ఇప్పటివరకు జరిగిన 2,000 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లలో (ముఖ్యంగా సౌత్ ఇండియాలో ప్రభుత్వ రంగంలో మొదటి రోబోటిక్ కిడ్నీ మార్పిడి వంటివి), డా. రాహుల్ దేవరాజ్ నాయకత్వంలోని వైద్య బృందం ఎంతో కీలక పాత్ర పోషించింది

# హైడ్రాకూ హిట్లరే స్ఫూర్తా?

- హిట్లర్ స్ఫూర్తి వ్యాఖ్యలపై దాసోజు ధ్వజం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హిట్లర్ తనకు స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే దాసోజు శ్రవణ్ విమర్శలు గుప్పించారు. హిట్లర్‌ను అనుకరిస్తూ తెలంగాణలో హైడ్రా ఏర్పాటు చేయడం, నివాస గృహాలను అక్రమంగా కూల్చివేయడం వంటి చర్యలకు పాల్పడటం నిరంకుశత్వం, అప్రజాస్వామికమని అన్నారు. ఇది భారత రాజ్యాంగాన్ని ఎగతాళి చేయడమేనని పేర్కొన్నారు. ఈ దౌర్జన్యపూరిత హిట్లర్ సిద్ధాంతం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సరికొత్త విధానమా? లేక రేవంత్ రెడ్డి కొనుగోలు చేసిన ప్రత్యేక కాంగ్రెస్ ఫ్రాంచైజీ భావజాలమా? అని అనుమానం కలుగుతోందని దాసోజు శ్రవణ్ అన్నారు. ప్రజాస్వామ్యం అంటే జీవితాలను నాశనం చేయడం, నిర్మూలించడం కాదని తెలిపారు. ప్రజాస్వామ్యం అంటే మానవ హక్కులను కాపాడటం, ప్రతి ఒక్కరూ గౌరవం, స్వేచ్ఛ, సోదరభావం, న్యాయంతో 'బతుకు, బతకనివ్వు' అనే విధంగా జీవించేలా చూడటమని స్పష్టం చేశారు. ప్రపంచానికి జై సంవిధాన్ అని లెక్చర్లు ఇచ్చే ముందు.. తమ సొంత ముఖ్యమంత్రికి ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలను నేర్పించాలని రాహుల్ గాంధీకి సూచించారు. దశాబ్దాల క్రితమే హిట్లర్‌ను ప్రపంచం తిరస్కరించిందని గుర్తుచేశారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి అహంకారంతో ఎంతగా కళ్లు మూసుకుపోయారంటే.. పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడానికి, ఒక నియంత నుంచి ప్రేరణ పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రిది ఎంతటి అవమానకరమైన, సిగ్గుచేటైన విలువల వ్యవస్థ అని మండిపడ్డారు.

# విద్యుత్ అసవరాలకనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం బట్టి, మంత్రి తుమ్మల




**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 07 (జనంసాక్షి) :** పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో మౌళిక వసతులను నిరంతరం విస్తరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఆదివారం ఖమ్మం నగరంలోని పాకబండ వద్ద నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎన్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉపకేంద్రంలోని కంట్రోల్ రూమ్, ఆధునిక పరికరాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రికి అధికారులు సాంకేతిక వివరాలను వివరించారు. ఈ సందర్భంగా లిఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉపకేంద్రాన్ని నిర్మించడం జరిగిందని, కంట్రోల్ రూమ్ నుంచే నిర్వహించే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ఖమ్మం జిల్లాలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలు సహా అన్ని రంగాలకు ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. 2023లో రాష్ట్ర పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్లు ఉండగా ప్రస్తుతం 18,548 మెగావాట్లకు పెరిగిందన్నారు. మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ, పరిశ్రమలు, ఫార్మాసిటీ, డేటా సెంటర్లు, వ్యవసాయ రంగ విస్తరణ వంటి కారణాలతో భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు మరింత పెరుగుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి 2030 నాటికి 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని 85 గ్రామాలను పూర్తిస్థాయి సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బోనకల్ మండలంలో సోలార్ ఆధారిత విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గిరిజనుల భూముల సాగుదారులకు ఇందిరా గిరి జల వికాస పథకం క్రింద సుమారు 6 లక్షల ఎకరాలకు సోలార్ పంపుసెట్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తూ ముందుకు వెళు న్నామని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు 3,500 మెగావాట్ల మేర డిమాండ్ పెరిగినా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు విధించలేదన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత పరిస్థితులు ఉన్నప్పటికీ తెలంగాణలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవసరమైన మేరకు కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపితే వెంటనే పరిశీలించి మంజూరు చేస్తామని చెప్పారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతుందని, రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం ప్రతి నెల 1150 కోట్ల భారీ మొత్తంలో సబ్సిడీ అందిస్తోందన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక రైతు డిస్కం ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉచిత విద్యుత్‌పై జరుగుతున్న దుష్ప్రచారాలను రైతులు నమ్మవద్దని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా లూజ్ వైర్లను వెంటనే బిగించే చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి ఖమ్మం నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఉపకేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతం చేయాలని అధికారులను సూచించారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్లు, భవనాలు, విద్యుత్, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తవుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో ఖాళీగా ఉన్న భూముల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఖమ్మం నగరంలో విద్యుత్ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ మౌళిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగరంలో మరో ఐదు విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపును వారం రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370